




www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

సంపుటి 09, సంచిక: 269 | శుక్రవారం | 28-08-2026 | ఖమ్మం

Published from: **Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar**

పేజీలు: 12+8 | వెల రూ. 5.00



నేపాల్ వరదల నేపథ్యంలో
**యుపిలో హై అలర్ట్**
నదులపై నిరంతర నిఘా.. సిద్ధంగా సహాయక బృందాలు **12**

రాయ్‌పూర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో
**మరో ప్రశ్నాపత్రం లీక్** **07**


## శుభాకాంక్షలు



పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు 'ప్రజాపక్షం' 'రక్షాబంధన్' శుభాకాంక్షలు

### సెలవు

'రాఖీ' పండగ సందర్భంగా 'ప్రజాపక్షం' కార్యాలయానికి శుక్రవారం సెలవు. శనివారం పత్రిక వెలువడదు. పునర్దర్శనం ఆదివారం.

\- ఎడిటర్





## మీర్ ఆలం చెరువుకు
# కొత్త హంగులు

- ఫ్యామిలీ టూరిస్టు హబ్‌గా అభివృద్ధి
- గడువులోగా పనులు పూర్తి చేయాలని సిఎం ఆదేశం
- సస్పెన్షన్ బ్రిడ్జి, వాటర్ స్పోర్ట్స్ ఐలాండ్‌ల అభివృద్ధికి ప్రణాళికలు
- చెరువును ఆకస్మికంగా తనిఖీ చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

చారిత్రక ప్రాధాన్యం కలిగిన మీర్ ఆలం చెరువుకు తెలంగాణ ప్రభుత్వం కొత్త రూపు, సరి కొత్త హంగులు ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కుటుంబ సమేతంగా వచ్చి రోజంతా ప్రకృతి, వినోదం, విశ్రాంతిని ఆస్వాదించేలా దీనిని ప్రముఖ పర్యాటక, వినోద కేంద్రంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. మీర్ ఆలం చెరువును ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి గురువారం అకస్మికంగా పరిశీలించి, అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించారు. చెరువు చుట్టూ జరుగుతున్న పనులు, మీర్ ఆలం చెరువుపై నిర్మిస్తున్న ఐకానిక్ సస్పెన్షన్ బ్రిడ్జి పనులను సిఎం పరిశీలించారు. అధికారులు ఫొటో ప్రదర్శన ద్వారా పనుల పురోగతిని సిఎంకు వివరించారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని సిఎం ఆదేశించారు. మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్

తరువాయి 8లో

## లోక్‌సభ స్థానాల సంఖ్యను
# మరో 25 ఏళ్ల పాటు పెంచకండి

డీలిమిటేషన్ ప్రతిపాదనలు అన్ని పార్టీలకూ వెల్లడించండి
ప్రధాని మోదీకి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే లేఖ



**న్యూఢిల్లీ:** డీలిమిటేషన్‌కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం రూపొందిస్తున్న ప్రతిపాదనలను అన్ని రాజకీయ పార్టీలతో పంచుకోవాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే గురువారం ప్రధాని నరేంద్ర మోదీని కోరారు. ప్రస్తుత లోక్‌సభ స్థానాల సంఖ్య 543ను మరో 25 ఏళ్ల పాటు కొనసాగించాలని, 2029 లోక్‌సభ ఎన్నికల నుంచే మహిళలకు మూడో వంతు రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. డీలిమిటేషన్‌పై ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న అంశాలను చర్చించేందుకు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ఖర్గే తన లేఖలో కోరారు. ప్రతిపాదనలను సమగ్రంగా పరిశీలించేందుకు అన్ని రాజకీయ పార్టీలు, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన సమయం ఇవ్వాలని అన్నారు. డీలిమిటేషన్ ప్రతిపాదనలపై చర్చించేందుకు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని తాను జులై 16న కూడా ప్రధానిని కోరిన విషయాన్ని ఖర్గే ఈ సందర్భంగా గుర్తుచేశారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించే అవకాశం ఉందని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి నిన్న రాత్రి టీవీ ఇంటర్వ్యూలో బహిరంగంగా చెప్పిన నేపథ్యంలో తాను మరోసారి ఈ విజ్ఞప్తి చేస్తున్నానని తెలిపారు. దీంతోనే వర్షాకాల పార్లమెంట్ సమావేశాలను నిరవధికంగా వాయిదా వేయడంలో జాప్యం జరుగుతోందేమోనని ఖర్గే అన్నారు. డీలిమిటేషన్‌పై కాంగ్రెస్ వైఖరి స్పష్టంగా ఉందని ఆయన పేర్కొన్నారు. మరో 25 ఏళ్ల పాటు లోక్‌సభ మొత్తం స్థానాలను 543గా కొనసాగించాలని, రాష్ట్రాల వారీగా ప్రస్తుత స్థానాల సంఖ్యను కూడా 25 ఏళ్ల పాటు కొనసాగించాలని, 2029 లోక్‌సభ ఎన్నికల నుంచే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. 'దేశానికి అత్యంత ప్రాధాన్యమున్న ఈ అంశంపై మీరు ముందుకు వెళ్లే ముందు అఖిలపక్ష సమావేశం నిర్వహించి డీలిమిటేషన్ ప్రతిపాదనలపై చర్చించాలి. అన్ని రాజకీయ పార్టీలు, రాష్ట్ర ప్రభుత్వాలు వాటిని అధ్యయనం చేసేందుకు తగిన సమయం ఇవ్వాలి' అని ఖర్గే తన లేఖలో

తరువాయి 8లో

## రాష్ట్రంలో భారీగా
# ఆధునిక ధాన్య సైలోలు

అదనంగా 5–10 లక్షల మెట్రిక్ టన్నుల శాస్త్రీయ నిల్వ సామర్థ్యానికి కార్యాచరణ : మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో పెరుగుతున్న వరి సాగు, ధాన్యం ఉత్పత్తి, ప్రభుత్వ సేకరణకు అనుగుణంగా ఆధునిక ధాన్య సైలోల నిర్మాణానికి సమగ్ర ప్రణాళిక రూపొందించాలని పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో అదనంగా 5 నుంచి 10 లక్షల మెట్రిక్ టన్నుల శాస్త్రీయ నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు చర్యలు

తరువాయి 8లో

# 700 మంది విదేశీయులు సహా జాడ తెలియని 1300 మంది

- 359కు పెరిగిన మృతుల సంఖ్య
- 350 మందిని కాపాడిన బృందాలు
- పూర్తిగా కొట్టుకుపోయిన చైనా–నేపాల్ భూ సరిహద్దు కేంద్రం
- 288 మంది భారతీయులు గల్లంతు : రణధీర్ జైస్వాల్ ప్రకటన



**కాఠ్మండు :** టిబెట్ వైపు భూకంపం,హిమనీ నద విస్ఫోటనం(గ్లేసియర్ లేక్ ఔట్ బరస్ట్)తో నేపాల్‌లో బుధవారం సంభవించిన జల ప్రళయంలో మరణించిన వారి సంఖ్య 359 కు పెరిగిందని స్థానిక పోలీసు అధికారులు చెప్పారు. అదేసమయంలో 700 మంది విదేశీ పర్యాటకులు సహా ఇంకా 1300 మంది స్వదేశీ,విదేశీయుల జాడ ఇంతవరకూ తెలియరాలేదు.గల్లంతైనవారికోసం,మృతదేహాలకోసం ముమ్మరంగా సైన్యం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. జాడ తెలియని వారిలో 44 మంది నేపాలీ సైనికులు, మరో 28 మంది పోలీసులు అధికారులు

తరువాయి 8లో

## మున్సిపల్ కార్మికుల వేతనాలు
# తగ్గించడం సిగ్గుచేటు





రూ.26 వేల కనీస వేతనం అమలు చేయాలి
సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

ప్రజాపక్షం/హైదరాబాద్

మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచాల్సింది పోయి, గతంలో ఉన్న వేతనాలను సైతం తగ్గించడం సిగ్గుచేటని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనాలు పెంచుతామని ప్రకటించి, అమలు చేయకపోవడం దుర్మార్గమన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ మున్సిపల్ స్టాఫ్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్

తరువాయి 8లో

## 'బద్లావ్ జరూరీ హై'కి వెళ్ళకుండా
# భయపెట్టి ఆపలేరు

### బిజెపి ప్రభుత్వాల తీరుపై సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా ధ్వజం



- యుపిలో సిపిఐ కార్యకర్తల ఇళ్ళకి వెళ్లి బెదిరిస్తున్న పోలీసులు
- కేరళం, తమిళనాడులో ఢిల్లీకి బుక్ చేసుకున్న ప్రత్యేక రైళ్ళు రద్దు
- ఇలాంటి ఒత్తిళ్లతో కార్యకర్తల దృఢ సంకల్పం మరింత బలపడుతోందని స్పష్టీకరణ

**న్యూఢిల్లీ :** ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు కేంద్రంగా ఢిల్లీలోని రాంలీలా మైదాన్‌లో సెప్టెంబర్ 1 నిర్వహిస్తున్న 'బద్లావ్ జరూరీ హై' ర్యాలీకి భారీ జన సమీకరణ కోసం దేశవ్యాప్తంగా సిపిఐ శాఖలు తీవ్రంగా కృషి చేస్తున్నట్లు సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా తెలిపారు. వివిధ రాష్ట్రాల నుండి యువత, విద్యార్థులు, మహిళలు, కార్మికులు, రైతులు, ప్రజాస్వామ్యవాద వర్గాల ర్యాలీలో పెద్ద ఎత్తున పాల్గొనేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. ఢిల్లీలోని సిపిఐ కేంద్ర కార్యాలయం అజయ్‌భవన్‌లో సిపిఐ జాతీయ కార్యదర్శులు రామకృష్ణ పాండ, డాక్టర్ గిరీశ్ శర్మ, అన్నీ రాజాలతో కలిసి గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డి.రాజా మాట్లాడారు. 'బద్లావ్ జరూరీ హై' ర్యాలీలో పాల్గొనేందుకు కేరళ, తమిళనాడు రాష్ట్రాల నుంచి సిపిఐ శ్రేణులు ఢిల్లీకి ముందస్తుగా బుక్ చేసుకున్న ప్రత్యేక రైళ్లను రద్దు చేశారని ఆయన తెలిపారు. తద్వారా బిజెపి పాలనలో రవాణా విషయంలో

తరువాయి 8లో

## బిఆర్‌ఎస్ హస్తగతానికి
# హరీశ్‌రావు ప్రయత్నాలు

తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత ఆరోపణ



ప్రజాపక్షం/హైదరాబాద్

బిఆర్‌ఎస్‌ను హస్తగతం చేసుకునేందుకు హరీశ్‌రావు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని తెలంగాణ రక్షణ సేన(టిఆర్‌ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. రాజకీయ బిక్ష పెట్టిన కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచేందుకు సిద్ధమయ్యారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ అరాచకాలను ప్రశ్నించాల్సిన బిఆర్‌ఎస్,అందుకు భిన్నంగా కాంగ్రెస్ ప్రభుత్వంతో రాజీపడిందని ఆరోపించారు. హైదరాబాద్‌లోని టిఆర్‌ఎస్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ అరాచకాలను ప్రశ్నించాల్సిన బిఆర్‌ఎస్,అందుకు భిన్నంగా కాంగ్రెస్ ప్రభుత్వంతో రాజీపడిందని ఆరోపించారు. పాల వ్యాపారం కోసం హరీష్ రావు, ఆంధ్రా దోస్తులు, రియల్ ఎస్టేట్ బిజినెస్ కోసం కెటిఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైన నేపథ్యంలో తామే అధికారంలోకి వస్తామని బిఆర్‌ఎస్ చెబుతోందని, కానీ ఆ పార్టీ అధికారంలో ఉండగా వ్యవస్థీకృత నేరాలకు పాల్పడిందని ఆరోపించారు. అధికారంలో ఉన్నప్పుడు

తరువాయి 12లో

## తుమ్మిడిహట్టి బ్యారేజ్‌పై
# సెప్టెంబర్ 1న ఢిల్లీలో కీలక సమావేశం

సిడబ్ల్యుసి చైర్మన్ అధ్యక్షతన పాల్గొననున్న తెలంగాణ, మహారాష్ట్ర జలవనరుల శాఖల ఉన్నతాధికారులు


ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రాణహిత నదిపై తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన తుమ్మిడిహట్టి బ్యారేజ్ నిర్మాణానికి సంబంధించిన సాంకేతిక, అంతర్రాష్ట్ర అంశాలపై సెప్టెంబర్ 1న ఢిల్లీలో కీలక సమావేశం జరగనుంది. కేంద్ర జల సంఘం (సిడబ్ల్యుసి ) చైర్మన్ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు సేవా భవన్‌లో జరిగే ఈ సమావేశంలో తెలంగాణ, మహారాష్ట్ర జలవనరుల శాఖల ఉన్నతాధికారులు పాల్గొంటారు. ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి చేసిన నిరంతర ప్రయత్నాల నేపథ్యంలోనే కేంద్ర జల సంఘం ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసింది. తుమ్మిడిహట్టి ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మే 26న మహారాష్ట్ర ముఖ్యమంత్రికి లేఖ రాసి, రెండు రాష్ట్రాల మధ్య సమావేశం ఏర్పాటు చేసి పరస్పర ఆమోదయోగ్యమైన పరిష్కారం సూచించాలని కోరారు. ఈ అంశాన్ని ప్రధానమంత్రి దృష్టికి కూడా తీసుకెళ్లగా, ప్రధానమంత్రి కార్యాలయం జలశక్తి మంత్రిత్వ శాఖకు పంపించింది. అనంతరం ఆగస్టు 5న కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్.పాటిల్‌కు సిఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా లేఖ రాసి కేంద్రం జోక్యం చేసుకోవాలని కోరారు. మహారాష్ట్ర గతంలో అంగీకరించిన 148 మీటర్ల ఎత్తుకు బదులుగా 152 మీటర్ల ఎత్తు ఉండేలా అంగీకారం సాధించేందుకు తెలంగాణ ప్రయత్నిస్తోంది. 148 మీటర్ల వద్ద అవసరమైన నీటిని గ్రావిటీ ద్వారా తీసుకోవడం సాధ్యం కాదని, భారీ పంపులు వినియోగిస్తే విద్యుత్ వ్యయం పెరుగుతుందని తెలంగాణ కేంద్రానికి

తరువాయి 8లో

# ఆంధ్రప్రదేశ్‌లో బస్సు–ఆటో ఢీ..

### ఏడుగురు మృతి, ఆరుగురికి గాయాలు



**చిలకలూరిపేట (ఆంధ్రప్రదేశ్):** పల్నాడు జిల్లా చిలకలూరిపేటలోని కళామందిర్ జంక్షన్ సమీపంలో గురువారం తెల్లవారుజామున ప్రైవేట్ బస్సు, ఆటోరిక్షా ఢీకొన్న ప్రమాదంలో ఏడుగురు మృతి చెందగా, మరో ఆరుగురు గాయపడ్డారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి, విచారం వ్యక్తం చేశారు. నరసరావుపేట డిఎస్‌పి హనుమంతరావు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం తెల్లవారుజామున సుమారు ఒంటిగంట సమయంలో తిరుపతికి వెళ్తున్న ప్రైవేట్ బస్సు

తరువాయి 12లో




# అడకత్తెరలో టిఎంసి రెబెల్ ఎంపిలు

పశ్చిమబెంగాల్ శాసనసభ ఎన్నికలు పూర్తవ్వగానే గోడ దూకిన టిఎంసి 20 మంది ఎంపిల పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా మారింది. అధికార బిజెపి అండదండలు చూసుకొని రెచ్చిపోయినా ఆ ఎంపిలకు తాజా పరిణామాలు గుబులు రేపుతున్నాయి. వారి సభ్యత్వాలను రద్దు చేయాలని కోరుతూ లోక్‌సభ స్పీకర్‌కు టిఎంసి ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ గతంలో ఇచ్చిన అనర్హత పిటిషన్‌లకు కదలిక వచ్చింది. ఈ పిటిషన్‌లు షరా మాములే అన్నట్లుగా ఎంతో కాలంగా స్పీకర్ వద్దే పెండింగ్‌లో ఉన్నాయి. వీటిపై త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని కోరుతూ టిఎంసి ప్రధాన కార్యదరి అభిషేక్ బెనర్జీ వేసిన కేసులో వాదనలు వినేందుకు ఆగస్టు 25న సుప్రీం కోర్టు అంగీకరించడంతో టిఎంసి రెబెల్ ఎంపిలను, వారిని తెరవెనుక నుంచి ఆడిస్తున్న అధికార బిజెపికి ఒక్కసారిగా ఉలిక్కిపాటు ఎదురైంది. సుప్రీం కోర్టు ఆదేశాలతో లోక్‌సభ సెక్రెటేరియట్ నుంచి వారం రోజుల్లోగా సమాధానాన్ని కోరుతూ రెబెల్ ఎంపీలకు నోటీసులు జారీ అయ్యాయి. దాంతో పాటు అభిషేక్ బెనర్జీ సుప్రీం కోర్టు పిటిషన్ కాపీ, నోటీసులను జత చేశారు. పశ్చిమ బెంగాల్‌లో నూతన బిజెపి ప్రభుత్వం నుంచి తీవ్ర అణిచివేత ఎదుర్కొంటున్న అసలుసిసలు మమతా బెనర్జీ టిఎంసికి నూతనోత్తేజం కలిగించింది.

మే 4న పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాలు వచ్చిన కొద్ది రోజులకే అధికార బిజెపి వికృత క్రీడను మొదలెట్టింది. టిఎంసి శాసనసభా పక్షాన్ని చీల్చి, చీలిక వర్గానికే ప్రతిపక్ష హోదాను కట్టబెట్టింది. ఇదే పంథాను లోక్‌సభ సభ్యుల విషయంలో కూడా అమలు చేసింది. టిఎంసి మెజారిటీ ఎంపిలలో 20 మందిని తన వైపు తిప్పుకుంది. వారంతా జూన్ 14న కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్ నివాసంలో సమావేశమై లోక్‌సభలో ప్రత్యేక వర్గంగా కూర్చోవాలని, లేదంటే బిజెపిలో విలీనమవ్వాలని భావించారు. కానీ, చట్టపరమైన అడ్డంకులు వారి అభీష్టాన్ని నీరుగార్చాయి. చివరాఖరుకు త్రిపురకు చెందిన ఎన్‌సిపిఐ పార్టీలో వారు విలీనమవుతున్నట్లు అసమ్మతి ఎంపిలు ప్రకటించుకున్నారు. అసలు లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయని ఒక పార్టీ లోక్‌సభలో ఐదవ అతిపెద్దగా మారటం వైచిత్రి!

టిఎంసి ప్రధాన కార్యదర్శి, ఎంపి అభిషేక్ బెనర్జీ అసమ్మతి ఎంపిలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ నిబంధనల ప్రకారం జూన్ 19న స్పీకర్‌కు పిటిషన్‌లను సమర్పించారు. జులై 27న స్పీకర్‌కు ఇదే అంశాన్ని లిఖితపూర్వకంగా గుర్తు చేయడమే కాకుండా, చర్య ఆలస్యమవుతుండడంపై ఆగస్టు 12న స్పీకర్‌ను స్వయంగా కలిశారు. అయినప్పటికీ, స్పీకర్ ఓం బిర్లా ఎటువంటి చర్యా తీసుకోలేదు. చివరకు అత్యున్నత న్యాయస్థానం మెట్లెక్కాల్సి వచ్చింది.

భారత ప్రధాన న్యాయమూర్తి సూర్య కాంత్ నేతృత్వంలో త్రిసభ్య ధర్మాసనం ఆగస్టు 25న విచారణకు అంగీకరించడంతో కథ కీలక మలుపు తీసుకుంది. తమ పార్టీ నుంచి గెలిచిన 28 మందితో తాము 20 మంది ఉన్నామని, కాబట్టి రాజ్యాంగంలోని పదవ షెడ్యూల్‌లోని నాలుగవ పేరాలో పేర్కొన్న మూడింట రెండు వంతుల పరిమితి కంటే ఎక్కువే నని టిఎంసి అసమ్మతి ఎంపిలు వాదిస్తూ వచ్చారు. అయితే, వారు చేసిన తప్పు ఎన్‌సిపిఐ అనే కొత్త పార్టీలో తాము విలీనమవుతున్నట్లు ప్రకటించటం.

రాజ్యాంగంలోని పదవ షెడ్యూలులోని నాలుగవ పేరాలోనే పార్టీ విలీనం మాత్ర పార్టీ వ్యవహారమే తప్ప పార్లమెంటరీ పక్షం చేతిలో ఉండబోదని స్పష్టంగా ఉంది. తాజాగా సుప్రీం కోర్టు కేసు ఆధారంగా స్పీకర్ సచివాలయం కూడా తిరుగుబాటు ఎంపిలకు నోటీసులు జారీ చేసింది. ఇప్పుడు స్పీకర్ ఎలాంటి వైఖరి తీసుకుంటారనే అంశంపై అందరి దృష్టి నెలకొంది. వచ్చే నెల మొదటి వారం నాటికి నోటీసులు అందుకున్న అసమ్మతి ఎంపిలు సమాధానం ఎలా ఉండబోతుందదనేది ఆసక్తికరం. వాటిపై స్పీకర్ స్పందన కీలకం కానుంది. అభిషేక్ బెనర్జీ వేసిన కేసు సాధారణమైనదేమీ కాదు.ఇది ఫిరాయింపుల నిరోధక చట్టానికే కాకుండా, స్పీకర్ రాజ్యాంగపరమైన పాత్ర, అనర్హత పిటిషన్‌లపై అంతులేని జాప్యం, ఫిరాయింపు రాజకీయాలు వంటి అంశాలపై కొత్త చర్చకు తెరలేపనుంది. ●



## అదే బాటలో అనేక లా స్కూల్స్

2026 బ్యాచ్ పట్టభద్రుల స్నాతకోత్సవాన్ని నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ (ఎన్‌ఎల్‌ఎస్‌యుఐ) రద్దు చేసింది. స్నాతకోత్సవానికి బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియ చైర్మన్, భారత చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ మిశ్రా హాజరు కావడాన్ని విద్యార్థులు, పూర్వ విద్యార్థులు వ్యతిరేకించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. స్నాతకోత్సవం కోసం వారిరువురు హాజరు కావడాన్ని ఇప్పుడు అనేక లా స్కూళ్లు వ్యతిరేకిస్తున్నాయి.

– ప్రశాంత్ భూషణ్, సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది

## ప్రభుత్వ పాఠశాల దుస్థితిని ప్రశ్నిస్తే ప్రాణాలు తీస్తారా?

ఒక పాఠశాల దుస్థితిని ప్రశ్నించిన గొంతు.. చివరకు ఒక కుటుంబాన్ని విషాదంలోకి నెట్టింది. విద్యార్థుల భవిష్యత్తు కోసం కనీస సౌకర్యాలు కోరిన ప్రశ్న కు సమాధానం దాడి, హత్యగా మారడం పశ్చిమ బెంగాల్‌లో తీవ్ర చర్చకు దారితీస్తోంది.

ప్రభుత్వ పాఠశాలలో కనీస మౌలిక వసతులు కల్పించాలని ప్రశ్నించడమే నేరమైందా? పాఠశాల దుస్థితిని వీడియో తీసి ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని ప్రయత్నించిన ఓ యువకుడి కుటుంబంపై జరిగిన దాడి తీవ్ర విషాదానికి దారితీసింది. పశ్చిమ బెంగాల్‌లోని బంకురా జిల్లా ఇందాస్ బ్లాక్‌లో చోటుచేసుకున్న ఈ ఘటనలో యువకుడి తండ్రి తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందడం కలకలం రేపుతోంది. జెన్‌జీల ఆందోళనలకు అడ్డుపడ్డవాళ్లు ..ఇప్పుడు ఏకంగా హత్యలనే ఎంచుకోవడం దేశ చరిత్రలో ఇదే తొలిసారి. పాఠశాలలో విద్యార్థులకు కనీస సౌకర్యాలు లేవని ప్రశ్నించినందుకే తమ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఇందాస్ బ్లాక్‌కు చెందిన 26 ఏళ్ల షేక్ అబ్దుల్ హాఫీజ్ తన గ్రామంలోని ప్రాథమిక పాఠశాల పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశాడు.

విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు ఉన్నాయా? పాఠశాల నిర్వహణ ఎలా ఉంది? అనే అంశాలను ప్రజల ముందుకు తీసుకురావాలనే ఉద్దేశంతో ఆగస్టు 13న పాఠశాలకు వెళ్లాడు. అక్కడి పరిస్థితులను వీడియోలో చిత్రీకరించేందుకు ప్రధానోపాధ్యాయుడి అనుమతి కోరినట్లు తెలుస్తోంది. 'స్కూల్ టీక్ కరో' పేరుతో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల మెరుగుదల, నిధుల వినియోగంలో పారదర్శకత కోసం చేపట్టిన ఉద్యమంలో భాగంగానే అబ్దుల్ హాఫీజ్ ఈ ప్రయత్నం చేసినట్లు సమాచారం. అబ్దుల్ పాఠశాలకు వెళ్లి వీడియో తీసేందుకు ప్రయత్నించిన విషయం స్థానికంగా వివాదానికి దారితీసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అదే రోజు రాత్రి కొందరు వ్యక్తులు అబ్దుల్ ఇంటిపై దాడికి పాల్పడ్డారని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ముందుగా ఇంటి విద్యుత్ సరఫరాను నిలిపివేసి, కర్రలు, ఇనుప రాడ్లు, సూలాలతో గుంపుగా ఇంట్లోకి చొరబడ్డారని ఆరోపించారు. తన కుమారుడిపై దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన తండ్రి షేక్ మహమ్మద్ మఫీక్‌పై దుండగులు తీవ్రంగా దాడి చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తలకు బలమైన గాయాలు కావడంతో ఆయనను ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ ఆగస్టు 15న మృతి చెందినట్లు పేర్కొన్నారు.

**'పాఠశాల బాగుపడాలని కోరితే తప్పేంటి?'**

తన తండ్రిని కోల్పోయిన అబ్దుల్ హాఫీజ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు. మా ఊరి పాఠశాల బాగుపడాలి.. పిల్లలకు కనీస సౌకర్యాలు కల్పించాలి అని కోరడ మే నేను చేసిన తప్పా? అంటూ కన్నీరుమున్నీరవుతున్నాడు. ప్రజా సమస్యను ప్రశ్నించి, పాఠశాల పరిస్థితులను వీడియో ద్వారా చూపించాలనుకున్నందుకు తమ కుటుంబాన్ని ఎందుకు లక్ష్యంగా చేసుకున్నారో అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నాడు. ఈ దాడి వెనుక స్థానిక బిజెపి నాయకులు, కార్యకర్తల హస్తం ఉందని బాధిత కుటుంబం, స్థానిక నిరసనకారులు ఆరోపిస్తున్నారు. రాజకీయ కక్షల కారణంగానే అబ్దుల్ కుటుంబంపై దాడి జరిగిందని వారు మండిపడుతున్నారు.

అయితే ఈ ఆరోపణలపై సంబంధిత బిజెపి నాయకుల అధికారిక స్పందన ఏమిటన్నది స్పష్టంగా తెలియాల్సి ఉంది. ఆరోపణలు దర్యాప్తులో నిర్ధారణ కావాల్సి ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కనీస సదుపాయాలు కల్పించాలని కోరడం ప్రజల హక్కు అని ప్రజా సంఘాలు పేర్కొంటున్నాయి. పాఠశాల పరిస్థితులను ప్రశ్నించినందుకు ఒక కుటుంబం దాడికి గురై, చివరకు ఒక ప్రాణం పోవడం అత్యంత ఆందోళనకరమని పేర్కొన్నాయి. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే వారిపై భౌతిక దాడులకు పాల్పడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం. దాడికి పాల్పడిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబం, ప్రజా సంఘా లు డిమాండ్ చేస్తున్నాయి. ఘటనకు రాజకీయ రంగు పులమకుండా, అసలు దోషులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాయి.

# పేపర్ లీకులు... విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం



కల్లూరు ధర్మేంద్ర
ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
9705309583

ఒక విద్యార్థి ఒక పరీక్ష కోసం నెలల తరబడి చదువుతాడు. ఒక పేద కుటుంబం తన బిడ్డ భవిష్యత్తు కోసం అప్పు చేసి కోచింగ్ ఫీజు చెల్లిస్తుంది. ఒక తల్లి తన బిడ్డ చదువు కోసం ఆభరణాలు అమ్ముతుంది. ఒక తండ్రి తన కష్టార్జితాన్ని మొత్తం పిల్లల చదువుపైనే ఖర్చుచేస్తా డు. ఒక యువకుడు తన కలను సాకారం చేసుకోవడానికి రోజుకు పది, పన్నెండు గంటలు పుస్తకాలతో గడుపుతాడు. పరీక్ష తేదీ కోసం ఎదురుచూస్తాడు. పరీక్షా కేంద్రానికి చేరుకుని తన భవిష్యత్తును నిర్ణయించే ప్రశ్నపత్రాన్ని రాస్తాడు. కానీ పరీక్షకు ముందే ప్రశ్నపత్రం కొందరి చేతుల్లోకి వెళ్లిందని, కొందరు డబ్బు చెల్లించి ప్రశ్నలు ముందుగానే తెలుసుకున్నారని వార్త బయటకు వస్తే ఆ విద్యార్థి పరిస్థితి ఏమిటి? అతను అనేక నెలల తరబడి చేసిన కష్టం విలువ ఏమిటి? అతని కుటుంబం పెట్టిన డబ్బు, సమయం, ఆశలకు విలువ ఏమిటి?

పేపర్ లీక్ అనేది కేవలం ఒక పరీక్షా అవకతవక కాదు. అది విద్యార్థి జీవితంపై జరిగే అన్యాయం.అది ఒక ప్రశ్నపత్రం బయటకు వెళ్లడం మాత్రమే కాదు. అది కష్టపడి చదివిన విద్యార్థి నమ్మకాన్ని దెబ్బతీయడం. ప్రతిభతో ముందు కు రావాలనుకునే పేద, మధ్యతరగతి విద్యార్థి అవకాశాన్ని దోచుకోవడం. పరీక్షా వ్యవస్థపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని ధ్వంసం చేయడం. ముఖ్యంగా పోటీ పరీక్షలపై ఆధారపడి ఉన్న లక్షలాది మంది యువత భవిష్యత్తును అనిశ్చితిలోకి నెట్టడం.

ఈ సమస్యను 2026 నీట్ యుజి పరీక్ష పరిణామాలు మరోసారి దేశం ముందుకు తీసుకొచ్చాయి. 2026 మే 3న నిర్వహించిన నీట్ యుజి పరీక్షకు 22.7 లక్షలకు పైగా అభ్యర్థులు హాజరయ్యారు. పరీక్ష కు సంబంధించిన ప్రశ్నపత్రం లీక్ ఆరోపణలపై మే 12న సిబిఐ కేసు నమోదు చేసింది. అనంతరం దర్యాప్తులో ప్రశ్నపత్రానికి సంబంధించిన సమాచారం పరీక్షకు ముందే కొందరికి చేరినట్లు దర్యాప్తు సంస్థ పేర్కొం ది. దర్యాప్తు అనంతరం ఈ కేసులో 13 మంది నిందితులపై సీబీఐ చార్జ్‌షీట్ దాఖలు చేసింది. దర్యాప్తులో 360 మంది సాక్షులు, 422 పత్రాలు, 43 భౌతిక ఆధారాలను ఉపయోగించినట్లు నివేదికలు వెల్లడించాయి. పరీక్షను రద్దు చేసి జూన్ 21న మళ్లీ నిర్వహించాల్సి వచ్చింది.

ఇక్కడ మనం ఒక కీలకమైన ప్రశ్న అడగాలి. ఇంత పెద్ద పరీక్షా వ్యవస్థలో ప్రశ్నపత్రం బయటకు ఎలా వెళ్లింది? ఇది కేవలం కొంతమంది వ్యక్తుల నేరంగా చూసి ముగించాల్సిన ప్రశ్న కాదు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పరీక్షా వ్యవస్థలో ఎక్కడ లోపం ఏర్పడిందో గుర్తించాలి. ప్రతి దశలో భద్రత, పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలి.

ఇక్కడ మరో అంశాన్ని కూడా పరిశీలించాలి — కోచింగ్ సంస్కృతి.

దేశంలో ఉన్నత విద్య, వైద్య విద్య, ఇంజినీరింగ్, ప్రభుత్వ ఉద్యోగాలు, వివిధ పోటీ పరీక్షల్లో ప్రవేశం కోసం కోచింగ్ కేంద్రాలపై ఆధారపడే పరిస్థితి విస్తరించింది. ఒక విద్యార్థి పరీక్షలో విజయం సాధించాలంటే ఖరీదైన కోచింగ్ తప్పనిసరి అన్న భావన ఏర్పడుతోంది. దీని ఫలితంగా విద్యార్థి ప్రతిభ కంటే కుటుంబ ఆర్థిక స్థోమత కూడా పోటీ పరీక్షల్లో ఒక ముఖ్యమైన అంశంగా మారుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో పరీక్ష నిజంగా ప్రతిభను మాత్రమే కొలుస్తుందా? లేక ఆర్థిక అసమానతను కూడా ప్రతిబింబిస్తుందా? అనే ప్రశ్న తలెత్తుతుంది.

అందుకే ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు పోటీ పరీక్షలకు ఉచిత, నాణ్యమైన కోచింగ్ అందించాల్సిన అవసరం ఉంది. ప్రధానమంత్రి 2026 ఆగస్టు 15న యువతకు ఏఐ శిక్షణ, పోటీ పరీక్షలకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ వంటి కార్యక్రమాలను ప్రకటించింది. ఈ కార్యక్రమాలు కేవలం ప్రకటనలుగా కాకుండా గ్రామీణ, గిరిజన, పేద, మధ్యతరగతి విద్యార్థులకు నిజంగా అందుబాటులోకి రావాలి. అయితే ఉచిత కోచింగ్ మాత్రమే సమస్యకు పూర్తి పరిష్కారం కాదు. పరీక్షల విశ్వసనీయతను కాపాడటం మరింత ముఖ్యమైనది. ప్రతిభకు బదులు గా డబ్బు, పరిచయాలు, మోసం ముందుకు వస్తే అది ప్రజాస్వామ్య సమాజానికి ప్రమాదకరం.

అందుకే పరీక్షా వ్యవస్థను కేవలం సాంకేతికంగా కాకుండా ప్రజాస్వామ్య హక్కుగా చూడాలి. సమాన అవకాశాల హామీ లేకుండా సమానత్వం సాధ్యం కాదు. విద్యలో సమానత్వం లేకుండా సామాజిక న్యాయం




సాధ్యం కాదు. పరీక్షల్లో పారదర్శకత లేకుండా విద్యలో సమానత్వం సాధ్యం కాదు.

**తెలంగాణలో పేపర్ లీకులు–విద్యార్థి నమ్మకాన్ని దెబ్బతీస్తున్న వ్యవస్థ:**

దేశవ్యాప్తంగా పేపర్ లీకుల సమస్యను పరిశీలించినప్పుడు తెలంగాణ అనుభవం కూడా ఆందోళన కలిగించే విధంగానే కనిపిస్తుంది. ప్రభుత్వ ఉద్యోగాల కోసం సంవత్సరాల తరబడి సిద్ధమవుతున్న తెలంగాణ యువతకు పరీక్షల నిర్వహణలో జరిగే అవకతవకలు తీవ్ర అన్యాయంగా మారుతున్నాయి.

ముఖ్యంగా టీజీపీయస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారం రాష్ట్రంలోని నిరుద్యోగ యువతలో తీవ్ర ఆగ్రహాన్ని, అసంతృప్తిని కలిగించింది. 2022లో గ్రూప్ I ప్రిలిమినరీ పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారం బయటపడిన తర్వాత పరీక్ష రద్దు చేయాల్సి వచ్చింది. అనంతరం 2023లో నిర్వహించిన గ్రూప్ I ప్రిలిమ్స్‌ను కూడా న్యాయపరమైన కారణాలతో రద్దు చేసి తిరిగి పరీక్ష నిర్వహించాల్సి వచ్చింది.

అందుకే తెలంగాణలో పేపర్ లీకేజీని కేవలం కొంతమంది వ్యక్తుల నేరంగా కాకుండా విద్యార్థుల సమాన అవకాశాలపై, వారి కష్టంపై జరిగిన దాడిగా చూడాల్సిన అవసరం ఉంది. పరీక్ష నిర్వహించే సంస్థలోని ప్రతి స్థాయిలో జవాబుదారీతనం ఉండాలి; ప్రశ్నపత్రం తయారీ నుంచి పరీక్ష పూర్తయ్యే వరకు భద్రతా వ్యవస్థలో ఏ లోపం జరిగినా దానికి బాధ్యత వహించాల్సిన వ్యవస్థను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలి.

తెలంగాణలో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం రావాలంటే పరీక్ష రద్దు చేసిన తర్వాత కొత్త పరీక్ష నిర్వహించడం మాత్రమే సరిపోదు. పేపర్ లీక్ కాకుండా ముందస్తు భద్రత, లీక్ జరిగితే తక్షణ జవాబుదారీతనం, విద్యార్థికి న్యాయం జరిగే పరిహార వ్యవస్థ అనే మూడు అంశాలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి. పరీక్ష రద్దయితే విద్యార్థులపై మళ్లీ పరీక్ష ఫీజు, ప్రయాణం, కోచింగ్ భారాన్ని మోపకుండా అవసరమైన పరిహారం, వయో పరిమితి సడలింపు, అదనపు అవకాశాలు కల్పించాలి. అంతేకాకుండా ప్రతి సంవత్సరం ఖాళీలను ముందుగానే ప్రకటించి ఉద్యోగ క్యాలెండర్‌ను అమలు చేసి, నోటిఫికేషన్ నుంచి నియామకం వరకు నిర్ణీత కాలపరిమితిని పాటించాలి. ఎందుకంటే పేపర్ లీక్ సమస్యను ఉద్యోగాల కొరత నుంచి వేరుచేసి చూడలేం. తక్కువ సంఖ్యలో ఉద్యోగాల కోసం లక్షలాది మంది యువత పోటీపడే పరిస్థితి ఉన్నంతకాలం పరీక్షలపై ఒత్తిడి పెరుగుతూనే ఉంటుంది. కాబట్టి ప్రభుత్వ ఉద్యోగాల ఖాళీలను భర్తీ చేయడం, ప్రభుత్వ విద్యను బలోపేతం చేయ డం, ఉచిత నాణ్యమైన కోచింగ్ అందించడం, పారదర్శక పరీక్షా వ్యవస్థను నిర్మించడం –ఇవన్నీ కలిపిన సమగ్ర విధానమే అవసరం.

అందుకే పరీక్షా సంస్థలు తమ పనితీరుపై ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. పరీక్ష నిర్వహణలో జరిగిన లోపాలపై స్వతంత్ర ఆడిట్ ఉండాలి. విద్యార్థుల ప్రతినిధుల తో కూడిన పర్యవేక్షణ వ్యవస్థను కూడా పరిశీలించాలి. పరీక్షా ప్రక్రియపై అనుమానా లు వచ్చినప్పుడు వాటిని పరిష్కరించేందుకు విద్యార్థులకు అందుబాటులో ఉండే స్వతంత్ర ఫిర్యాదు వ్యవస్థ అవసరం.

పోటీ పరీక్షల పెరుగుదల వెనుక ఉన్న మరో అంశం కూడా పరిశీలించాలి. ప్రభుత్వ విద్యా సంస్థలు బలహీనపడుతుంటే, ఉన్నత విద్య ఖరీదవుతుంటే, ప్రభుత్వ ఉద్యోగాల సంఖ్య తగ్గుతుంటే, యువత సహజంగానే కొద్ది పరీక్షలపై ఆధార పడుతుంది.

ఒక వైద్య సీటు కోసం లక్షలాదిమంది పోటీ పడుతున్నారు. ఒక ప్రభుత్వ ఉద్యోగం కోసం లక్షలాదిమంది దరఖాస్తు చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఒక్క పరీక్షా అవకతవక కూడా వేలాది కుటుంబాల భవిష్యత్తును ప్రభావితం చేస్తుంది.

అందువల్ల పరిష్కారం కేవలం పరీక్షలను మరింత కఠినంగా నిర్వహించడమే కాదు. ఉన్నత విద్యలో సీట్లు పెంచాలి. ప్రభుత్వ వైద్య, ఇంజినీరిం గ్, డిగ్రీ కళాశాలలను బలోపేతం చేయాలి. ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలి. యువతకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలను పెంచాలి.

ఈ నేపథ్యంలో అఖిల భారత యువజన సమాఖ్య (AIYF) విద్యార్థు ల సమస్యలను కేవలం పరీక్షల పరిధిలో చూడదు. విద్యను మార్కెట్ వస్తువుగా మార్చే విధానాన్ని, ఖరీదైన కోచింగ్ సంస్కృతిని, ప్రభుత్వ విద్యా సంస్థలను బలహీనపరిచే విధానాలను, ఉద్యోగాల కొరతను, పేపర్ లీక్‌లను ఒకదానితో ఒకటి అనుసంధానించి చూడాల్సిన అవసరం ఉందని భావిస్తుంది.

**ఎఐవైఎఫ్ ఏమి కోరుతోంది?**

పరీక్షల్లో పూర్తి పారదర్శకత ఉండాలి. పేపర్ లీక్‌లకు పాల్పడే వ్యక్తులతో పాటు బాధ్యత వహించాల్సిన వ్యవస్థలపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలి. విద్యార్థి భవిష్యత్తు ఒక ప్రశ్నపత్రం లీక్‌తో నిర్ణయించబడకూడదు. అతని భవిష్యత్తును నిర్ణయించేది అతని ప్రతిభ, అతని కష్టం, అతనికి లభించే సమాన అవకాశం కావాలి.

ఎఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభల పిలుపు:

విద్యార్థి హక్కుల కోసం ఐక్యమై ఉద్యమిద్దాం – ప్రజా విద్యను కాపాడుదాం, పరీక్షా వ్యవస్థను ప్రక్షాళన చేద్దాం, సమానత్వంతో కూడిన విద్యా వ్యవస్థ కోసం పోరాడుదాం.

# 6 వేల మంది రాజకీయ ఖైదీల విడుదల ఎప్పుడు?

★ దశాబ్దాలుగా జైళ్లలోనే మగ్గుతున్నారు ★ హైదరాబాద్ వేదికగా ఆందోళనకు శ్రీకారం

మావోయిస్టు ఉద్యమం దాదాపు అంతమైందని కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తున్న పరిస్థితుల్లో దేశవ్యాప్తంగా వివిధ జైళ్లలో ఉన్న సుమారు ఆరు వేల మంది రాజకీయ ఖైదీలను వెంటనే విడుదల చేయాలని రాజకీయ ఖైదీల విడుదల ఐక్యవేదిక కన్వీనర్ రవి నర్ల కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇందులోదశాబ్దకాలంకు పైగా జైళ్లలో మగ్గుతున్న రాజకీయ ఖైదీలు ఉన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఆయా రాష్ట్రాలలో ఉన్న రాజకీయ ఖైదీలను వెంటనే విడుదల చేసేందుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు హైదరాబాద్ వేదికగా ఈ నెల 19 నుంచి ఉద్యమానికి శ్రీకారం చుడుతున్నామని సోమవారం **ప్రజాపక్షం** ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో **రవి నర్ల** స్పష్టం చేశారు. ఇంటర్వ్యూ ఇలా సాగింది.

**ప్రశ్న: తెలుగు రాష్ట్రాల్లో జైళ్లలో రాజకీయ ఖైదీలు ఎంతమంది ఉంటారు?**

**రవి నర్ల:** రాజకీయ భావాలు, ప్రజా ఉద్యమాలతో సంబంధాలున్న వారిపై ప్రభుత్వాలు అక్రమ కేసులు నమోదు చేశాయి. తెలంగాణ జైళ్లలో యుఎపిఎ (ఉపాచట్టం) కేసులపై సుమారు 45మందికిపైగా ఉంటారు. ఎపిలో 56 మంది ఉంటారు. దేశవ్యాప్తంగా 6వేల మంది వరకు ఉంటారని అంచనా. నిజామాబాద్ జైలులో పిఎఫ్ఐతో సంబంధాలున్నాయనే ఆరోపణలపై 16 మంది యుఎపిఎ కేసులు ఎదుర్కొంటున్నారు.

మావోయిస్టు ఉద్యమం దాదాపు అంతమైందని కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తున్న పరిస్థితుల్లోనూ సాధారణ కార్యకర్తలు, ప్రజా సంఘాల్లో పనిచేసిన వ్యక్తులపై కేసులు నమోదు చేసి జైళ్లలో ఉంచుతున్నారు.

**ప్రశ్న:సంవత్సరాలుగా ఎందుకు బెయిల్ రావడం లేదు..?**

రవి నర్ల: ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టు కేసుల్లో ఉన్నవారిలో అధిక శాతం ఆదివాసీలే. మైనర్లకు సైతం బెయిల్ నిరాకరించిన ఘటనలు ఉన్నాయి. యుఎపిఎ కారణంగా విచారణ ప్రక్రియ ఏళ్ల తరబడి కొనసాగుతూ బెయిల్ పొందడం కష్టంగా మారుతోంది. సుప్రీంకోర్టు బెయిల్‌కు సంబంధించి పలు తీర్పులు ఇచ్చినప్పటికీ, వాటి స్ఫూర్తి కింది కోర్టులు, హైకోర్టుల్లో సక్రమంగా అమలు కావడం లేదు. యుఎపిఎలోని రక్షణ చర్యలు ఉల్లంఘనకు గురవుతున్నందున ఆ చట్టాన్నే రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నాము.



రవి నర్ల
రాజకీయ ఖైదీల విడుదల ఐక్యవేదిక కన్వీనర్

**ప్రశ్న:ఎవరెవరు ఎన్నెన్నిఏండ్లు అక్రమ కేసుల్లో జైలులో ఉన్నారు?**

రవి నర్ల: జర్నలిస్టులు, న్యాయవాదులు, రచయితలు, ఉపాధ్యాయులు, లెక్చరర్లు, విద్యార్థులపై కూడా యుఎపిఎ వంటి కఠిన చట్టాలను ప్రయోగించి జైళ్లలో వేశారు. కొంతమంది విచారణ ఖైదీలు ఎలాంటి శిక్ష పడకుండానే పదేళ్లకు పైగా జైళ్లలో ఉంటున్నారు. కామ్రేడ్ అడమ 12 ఏళ్లుగా విచారణ ఖైదీగా ఉన్నారు. కామ్రేడ్ శివారెడ్డి 2014–15 నుంచి జైల్లోనే ఉన్నారు. విశాఖపట్నం జైలులో పాంగి నాగన్న, సాకే కళావతి సుమారు ఆరేళ్లుగా జైల్లో ఉన్నారు. ఒడిశాలో దున్నా కేశవ రావు 15 ఏళ్ల పాటు విచారణ ఖైదీగా ఉండి చివరకు ఎలాంటి శిక్ష లేకుండా విడుదలయ్యారు. భీమా కోరేగావ్ కేసులో సురేంద్ర గాడ్లింగ్ సుమారు ఎనిమిదేళ్లుగా జైలులో ఉన్నారు..

**ప్రశ్న:బెయిల్‌పై వచ్చిన వారిపై ఎలాంటి ఆంక్షలు ఉన్నాయి?**

రవి నర్ల: ఎంతో కష్టపడి కొందరు బెయిల్‌పై వచ్చినా ప్రభుత్వం ఆంక్షలతో వారిని ఇబ్బందులు పెడుతుంది. బెయిల్ మంజూరైన వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తులపై విధిస్తున్న కఠినమైన ఆంక్షలు వారి జీవనాన్ని మరింత కష్టతరం చేస్తున్నాయి. ముంబై, కలకత్తా వంటి నగరాలను విడిచి వెళ్లకూడదనే ఆంక్షల కారణంగా వరవరరావు, సత్యనారాయణ, సాధనాల రామకృష్ణ వంటి వృద్ధులు ఆర్థిక, ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. గౌతం నవలఖాకు ఢిల్లీలో ఉండేందుకు సుప్రీంకోర్టు అనుమతించిన అంశాన్ని ప్రస్తావిస్తూ, ఇదే విధమైన మానవతా దృక్పథాన్ని ఇతర వృద్ధులు, అనారోగ్యంతో ఉన్న ఖైదీల విషయంలోనూ చూపించాలి.

**ప్రశ్న:జైళ్లలో వీరికి సరైన సౌకర్యాలు అందుతున్నాయా..?**

రవి నర్ల: జైళ్లలో వైద్య సౌకర్యాలు కూడా ఆందోళనకరంగా మారాయి. ఖైదీల పోరాటాల కారణంగా గతంలో జైళ్ల పరిస్థితులు కొంత మెరుగుపడ్డాయి. ప్రస్తుతం వైద్య ఖర్చులకు కేటాయించే బడ్జెట్ తగ్గిపోవడంతో అనేకమంది ఖైదీలకు అవసరమైన మందులు అందడం లేదు.

డయాబెటిస్ తదితర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి సరైన వైద్యం అందడం లేదు. మూల దేవేందర్ రెడ్డి ఒక కన్ను కోల్పోయినప్పటికీ జైల్లోనే ఉన్నారు. కర్తమ్ జోగా పక్షవాతంతో బాధపడుతున్నప్పటికీ బెయిల్ రాలేదు.

**ప్రశ్న:కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేసేందుకు ఎలా ఉద్యమిస్తారు?**

రవి నర్ల: తమ ఆకాంక్ష నెరవేందుకు హైదరాబాద్ వేదికగా ఉద్యమానికి శ్రీకారం చుట్టాము. ఈ క్రమంలోనే ఈ నెల 29న ఇందిరాపార్క్ ధర్నాచౌక్‌లో నిర్వహించే ధర్నా నిర్వహించతలపెట్టాము.తెలంగాణ ముఖ్యమంత్రిని ప్రతినిధి బృందంగా కలిసి వినతిపత్రం అందజేస్తాము. ప్రభుత్వ స్పందనను బట్టి ఉద్యమాన్ని దేశవ్యాప్తంగా విస్తరించే ఆలోచన ఉంది. ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, తదితర రాష్ట్రాల్లోనూ కార్యక్రమాలను చేపట్టనున్నాము.

బి.వాసుదేవరాజు




## గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు సిఎం రేవంత్ రెడ్డి పరామర్శ

ప్రజాపక్షం/హైదరాబాద్: అనారోగ్యంతో హైటెక్ సిటీలోని యశోదా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి గురువారం పరామర్శించారు. గవర్నర్ ఆరోగ్య పరిస్థితి గురించి సిఎం అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి వెంట ఎంపి వేం నరేందర్ రెడ్డి కూడా ఉన్నారు. స్వల్ప అస్వస్థత కారణంగా గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆసుపత్రిలో చేరిన విషయం తెలిసిందే.

## క్రీడల్లో రాజకీయాలకు తావు ఉండకూడదు : వి.హెచ్

### రాజీవ్‌గాంధీ పేరును 'ఖేల్ రత్న' నుంచి తొలగించడం సరికాదు




ప్రజాపక్షం/హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఖేలో ఇండియా యూత్ కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించడం అభినందనీయమని ప్రభుత్వ సలహాదారు, కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు అన్నారు. క్రీడల్లో రాజకీయాలకు తావు ఉండకూడదని, క్రీడాకారుల్లో స్ఫూర్తి, ప్రతిభను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. గాంధీ భవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశంలో క్రీడలను ప్రోత్సహించేందుకు మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు. ఆసియా క్రీడలకు ప్రోత్సాహం కల్పించడంతో పాటు యువతను క్రీడల వైపు ప్రోత్సహించేందుకు ఆయన ప్రత్యేక శ్రద్ధ చూపారని తెలిపారు. ఖేలో ఇండియా కార్యక్రమానికి రూ.22 కోట్లు మంజూరు చేయడం సంతోషకరమని, ఇదే విధంగా తెలంగాణ అభివృద్ధికి సంబంధించిన అన్ని అంశాల్లోనూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి సహకరించాలని కోరారు. రాజీవ్ గాంధీ ఖేల్‌రత్న అవార్డు పేరును మార్చడం సరికాదని, ఆయన పేరును తొలగించి కేంద్ర ప్రభుత్వం రాజకీయాలు చేయడం తగదన్నారు. తెలంగాణలో స్పోర్ట్స్ సిటీ ఏర్పాటు చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం హర్షణీయమని పేర్కొన్నారు. తాను నిర్వహిస్తున్న రాజీవ్ గాంధీ క్రికెట్ పోటీల ద్వారా యువతను క్రీడల వైపు ప్రోత్సహిస్తున్నానని విహెచ్ తెలిపారు.

## ఎన్‌హెచ్-65పై 17 బ్లాక్‌స్పాట్‌ల

# ఫ్లైఓవర్లు త్వరగా పూర్తి చేయాలి

చిట్యాల ఫ్లైఓవర్ దసరా నాటికి.. మిగతావి డిసెంబర్ చివరికి పూర్తి చేయాలి : కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్: హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారి (ఎన్‌హెచ్65)పై నిత్యం జరుగుతున్న ప్రమాదాలను నివారించేందుకు గుర్తించిన 17 బ్లాక్‌స్పాట్‌ల వద్ద నిర్మిస్తున్న ఫ్లైఓవర్ల పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో గురువారం రోడ్లు, భవనాల శాఖ పరిధిలోని పలు రహదారులు, జాతీయ రహదారి ప్రాజెక్టుల పురోగతిపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కోదాడ సమీపంలో ఇటీవల జరిగిన బస్సు ప్రమాదంతో పాటు ఇతర రోడ్డు ప్రమాదాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. హైదరాబాద్ విజయవాడ రహదారిపై గుర్తించిన 17 బ్లాక్ స్పాట్‌ల వద్ద నిర్మిస్తున్న ఫ్లైఓవర్లు, హైమాస్ట్ లైట్ల పనుల పురోగతిని మంత్రి సమీక్షించారు. దాదాపు అన్ని ఫ్లైఓవర్ల పనులు తుది దశకు చేరుకున్నాయని అధికారులు మంత్రికి వివరించారు. పెద్దకాపర్తి ఫ్లైఓవర్‌పై ఇప్పటికే ట్రాఫిక్ అనుమతిస్తున్నట్లు, సూర్యాపేట ఈనాడు కార్యాలయం వద్ద నిర్మిస్తున్న ఫ్లైఓవర్ కూడా వాహనాల రాకపోకలకు సిద్ధంగా ఉందని తెలిపారు. చిట్యాల ఫ్లైఓవర్‌ను ఈ దసరా నాటికి పూర్తి చేయాలని, మిగిలిన ఫ్లైఓవర్లను డిసెంబర్ చివరి నాటికి అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి ఆదేశించారు.

### సంక్రాంతి నాటికి అన్ని ఫ్లైఓవర్లపై వాహనాల రాకపోకలు సాగేలా పనులు పూర్తి..

సంక్రాంతి నాటికి అన్ని ఫ్లైఓవర్లపై వాహనాల రాకపోకలు సాగేలా పనులను పూర్తి చేయాలని మంత్రి స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాలు, కొన్ని ప్రాంతాల్లో రహదారులకు రెయిలింగ్ లేకపోవడంపై కూడా మంత్రి ఆరా తీశారు. నిత్యం జరుగుతున్న ప్రమాదాలను అరికట్టాలంటే హైదరాబాద్ విజయవాడ రహదారి విస్తరణ పనులను త్వరగా చేపట్టాల్సిన అవసరం ఉందని మంత్రి అన్నారు. 6+2 లేన్‌ల రహదారి విస్తరణ కోసం ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలిసి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని పలుమార్లు కలిశామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధే తమ ధ్యేయమని, రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎలాంటి బేషజాలకు తావులేదని మంత్రి స్పష్టం చేశారు. ఎన్‌హెచ్65 విస్తరణ పనులతో పాటు బుల్లెట్ ట్రైన్, ఇతర ఎన్‌హెచ్ఎఐ ప్రాజెక్టులను కూడా త్వరగా చేపట్టాలని కేంద్రాన్ని కోరుతామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. సమీక్ష సమావేశంలో ఆర్‌అండ్‌బి ఇఎన్‌సి లింగారెడ్డి, సిఇలు వసంత్ నాయక్, ధర్మారెడ్డితో పాటు పలువురు ఎన్‌హెచ్ఎఐ అధికారులు పాల్గొన్నారు.

## ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ భవన్‌లో నల్ల బ్యాడ్జీలు ధరించి ఉద్యోగుల నిరసన





ప్రజాపక్షం/హైదరాబాద్: అడుక్కుంటే హక్కులు అసాధ్యం.. పోరాటాలతోనే అవి సాధ్యం అంటూ ఉద్యోగ సంఘాల నాయకులు నినదించారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వారు కోరారు. జాక్ జెఎసి పిలుపు మేరకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ భవన్‌లో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు, నల్ల దుస్తులు ధరించి గురువారం నిరసన తెలిపారు. కార్యాలయ ఉద్యోగులతో పాటు సిఐలు, ఎస్ఐలు, సూపరింటెండెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, ఇతర సిబ్బంది నిరసనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి టిఎన్‌జిఓఎస్ అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, తెలంగాణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు టి. లక్ష్మణ్ గౌడ్, కార్యదర్శి చంద్రశేఖర్, తెలంగాణ స్టేట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సూర కృష్ణ, టిఎన్‌జిఓఎస్ మీడియా ఇన్‌చార్జి మహేందర్ రావు పటేల్, తెలంగాణ ప్రభుత్వ రంగ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి తదితరులు పాల్గొని మద్దతు తెలిపారు.

## ప్రేమ, ఆప్యాయతకు ప్రతీక 'రాఖీ'

### మహిళల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి సీతక్క

ప్రజాపక్షం/హైదరాబాద్: రాఖీ పండుగ అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయత, పరస్పర నమ్మకానికి ప్రతీక అని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క అన్నారు. రాఖీ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు, ముఖ్యంగా తెలంగాణ ఆడబిడ్డలకు ఆమె హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణలో ప్రతి ఆడబిడ్డకు ఒక అన్నగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగితే కుటుంబాలు బలపడతాయని, లక్షలాది మహిళలు ఆర్థిక కార్యకలాపాల్లో భాగస్వాములైతే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందన్నారు. ఈ లక్ష్యంతో ప్రభుత్వం మహిళలకు అన్ని రంగాల్లో ప్రోత్సాహం అందిస్తోందని వివరించారు. మహిళా సంఘాలకు ఇప్పటివరకు సుమారు రూ. 70 వేల కోట్ల బ్యాంకు రుణాలు అందించామని, వాటిపై రూ. 1,903 కోట్ల వడ్డీని ప్రభుత్వం తిరిగి చెల్లించిందని తెలిపారు. ఆర్‌టిసి బస్సుల నిర్వహణ, ఇందిరా క్యాంటిన్లు, వరి కొనుగోలు కేంద్రాలు, సోలార్ ప్లాంట్లు వంటి పలు రంగాల్లో మహిళా సంఘాలకు అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. త్వరలో రైస్ మిల్లులు, గోదాముల నిర్వహణ వంటి రంగాల్లోనూ మహిళలను భాగస్వాములను చేయనున్నట్లు వెల్లడించారు. మహిళలను కేవలం రుణ గ్రహీతలుగానే కాకుండా పెట్టుబడిదారులు, యజమానులు, ఆస్తుల సృష్టికర్తలుగా తీర్చిదిద్దడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. రాఖీ పండుగ సందర్భంగా ప్రతి అన్న తన సోదరికి రక్షణ కల్పించడంతో పాటు ఆమె విద్య, ఉపాధి, అభివృద్ధికి కూడా అండగా నిలవాలని మంత్రి సీతక్క ఆకాంక్షించారు.

### అన్నాచెల్లెళ్ల మధ్య నమ్మకానికి ప్రతీక రాఖీ : మహేష్ కుమార్ గౌడ్



అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయత, అనురాగం, నమ్మకానికి రాఖీ పౌర్ణమి ప్రతీక అని టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా తెలంగాణ ప్రజలకు, ముఖ్యంగా అక్కాచెల్లెళ్లు, అన్నదమ్ములకు ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. రాఖీ పౌర్ణమి నేపథ్యంలో గురువారం మహేష్‌కుమార్ గౌడ్‌కు బ్రహ్మకుమారీ లు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాఖీ కేవలం ఒక దారం కాదని, కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేసే పవిత్రమైన అనుబంధానికి ప్రతీక అని అన్నారు. రాఖీ పౌర్ణమి ప్రతి కుటుంబంలో ఆనందం, సంతోషం, సోదర భావాన్ని నింపాలని, అన్నాచెల్లెళ్ల అనుబంధం చిరకాలం వర్ధిల్లాలని మహేష్ కుమార్ గౌడ్ ఆకాంక్షించారు.

## ఆటో డెవర్లకు రూ.200 కోట్ల రెట్రో ఫిట్‌మెంట్ నిధులు విడుదల

### ప్రభుత్వానికి ఆటో సంఘాల జెఎసి కృతజ్ఞతలు

ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలోని ఆటో డ్రైవర్ల కోసం రెట్రో ఫిట్‌మెంట్ నిమిత్తం రూ.200 కోట్ల నిధులను విడుదల చేసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ రాష్ట్ర ఆటో, యాప్ ఆధారిత సంఘాల జెఎసి నాయకులు బి.వెంకటేశం, ఎ.సత్తిరెడ్డి, ఎం.ఎ.సలీం తదితరులు కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల తెలంగాణ రాష్ట్ర ఆటో, క్యాబ్ సంఘాల ప్రతినిధులతో ప్రభుత్వం జరిపిన చర్చల్లో ఇచ్చిన హామీలను సైతం వెంటనే అమలు చేయాలని జెఎసి నాయకులు కోరారు. రెట్రో ఫిట్‌మెంట్ నిధులకే పరిమితం కాకుండా ఆటో డ్రైవర్ల సంక్షేమానికి ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రత్యేకంగా ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ వర్గాలకు చెందిన ఆటో డ్రైవర్లతో పాటు బడుగు, బలహీన వర్గాల ఆటో డ్రైవర్లకు ఆర్థిక సహాయం అందించాలని కోరారు. అలాగే ఎలక్ట్రిక్ (ఈవి) ఆటోలు కొనుగోలు చేసిన డ్రైవర్లకు కూడా రూ.1.50 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించాలని జెఎసి నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, చర్చల్లో ఇచ్చిన హామీలను త్వరితగతిన అమలు చేయాలని వారు కోరారు.

## రాష్ట్రంలో రెండు రోజుల పాటు మోస్తరు వర్షాలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో రానున్న 24 గంటల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పలు ప్రాంతాల్లో కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. గురు, శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. వర్షాలతో పాటు ఉరుములు, మెరుపులు, గంటకు 30—40 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నట్టు హెచ్చరించారు. ఆదిలాబాద్, కొమురం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్‌మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. శుక్రవారం నుంచి రాబోయే ఏడు రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని చెప్పారు. సెప్టెంబర్ 3వ తేదీ వరకు ఇదే తరహా వాతావరణ పరిస్థితులు కొనసాగనున్నట్టు తెలిపారు.

## బొగ్గు మైనింగ్‌లో కలిసి నడుద్దాం

- కర్ణాటక క్యాప్టివ్ బొగ్గు గనుల్లో జాయింట్ వెంచర్‌కు సింగరేణి సిద్ధం
- కర్ణాటక ఇంధన మంత్రి కెజె.జార్జ్‌కు ప్రతిపాదించిన తెలంగాణ డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క



ప్రజాపక్షం/హైదరాబాద్ : బొగ్గు మైనింగ్‌లో కలిసి నడుద్దామని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కర్ణాటక రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి కె.జె.జార్జ్‌కు ప్రతిపాదించారు. కర్ణాటక పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ (కెపిసిఎల్) చేపట్టిన క్యాప్టివ్ బొగ్గు గనుల్లో సింగరేణి సంస్థతో కలిసి జాయింట్ వెంచర్‌గా మైనింగ్ చేపడుదామనే డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క ప్రతిపాదనకు కర్ణాటక మంత్రి జార్జ్ సానుకూలంగా స్పందించారు. బెంగళూరు పర్యటనలో భాగంగా గురువారం భట్టి విక్రమార్క, మంత్రి కె.జె.జార్జ్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రెండు రాష్ట్రాల మధ్య ఇంధన రంగ అభివృద్ధి, బొగ్గు సరఫరా, బొగ్గు కొనుగోళ్ల చెల్లింపులు, సాంకేతిక పరిజ్ఞానం మార్పిడిపై విస్తృతంగా చర్చించారు. కర్ణాటకలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా బొగ్గు అవసరాలను తీర్చేందుకు సింగరేణి, కెపిసిఎల్ కలిసి పనిచేయాలని భట్టివిక్రమార్క సూచించారు. ఛత్తీస్‌ఘడ్, ఒడిశా రాష్ట్రాల్లో కెపిసిఎల్ చేపట్టిన క్యాప్టివ్ కోల్ బ్లాక్‌ల్లో సింగరేణి తన 137 ఏళ్ల మైనింగ్ అనుభవంతో బొగ్గు తవ్వకాలు చేపట్టేలా జాయింట్ వెంచర్ ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని ఆయన కోరారు. కర్ణాటకకు విద్యుత్ రంగంలో ఉన్న అనుభవాన్ని సింగరేణి సంస్థ భవిష్యత్తులో చేపట్టే విద్యుత్ ప్లాంట్ల నిర్వహణలో వినియోగించుకోవచ్చని ఆయన తెలిపారు. రెండు రాష్ట్రాల ప్రభుత్వ రంగ సంస్థల పరస్పర సహకారంతో అభివృద్ధి, విస్తరణకు దోహదపడేలా జాయింట్ వెంచర్ ఏర్పాటుపై అధ్యయనం చేయాలని సూచించారు. కర్ణాటకలో పారిశ్రామిక ప్రగతితో విద్యుత్ డిమాండ్ భారీగా పెరుగుతున్న నేపథ్యంలో థర్మల్ పవర్ ప్లాంట్ల నిర్వహణకు తెలంగాణ నుంచి బొగ్గును నిరంతరం సరఫరా చేయాలని కర్నాటక మంత్రి కె.జె.జార్జ్ కోరారు. దీనిపై భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందిస్తూ, కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ కేటాయింపులకు అనుగుణంగా బొగ్గు సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం సింగరేణి సంస్థ కర్ణాటకకు ఏడాదికి బొగ్గు లింకేజీ ద్వారా 10.54 మిలియన్ టన్నుల బొగ్గును సరఫరా చేస్తోంది. ఇందులో ఎర్రమారస్ థర్మల్ పవర్ ప్లాంట్‌కు 5.24 మిలియన్ టన్నులు పూర్తి లింకేజీ ద్వారా అందిస్తోంది. రాయచూరు థర్మల్ పవర్ ప్లాంట్‌కు పాక్షిక లింకేజీ ద్వారా 3.01 మిలియన్ టన్నులు, బళ్లారి యూనిట్3 థర్మల్ పవర్ ప్లాంట్‌కు 2.29 మిలియన్ టన్నుల బొగ్గును సింగరేణి సరఫరా చేస్తోంది. రోజుకు కనీసం నాలుగు రేక్‌ల ద్వారా బొగ్గు రవాణా జరుగుతోందని అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో కర్ణాటక అదనపు ప్రధాన కార్యదర్శి గౌరవ్ గుప్తా, సింగరేణి సంస్థ చైర్మన్, ఎండి డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి, కెపిసిఎల్ ఎండి రాజేంద్ర చోళన్, కెపిసిఎల్ ఫైనాన్స్ డైరెక్టర్ నాగరాజు, సింగరేణి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూవ్‌మెంట్) వెంకన్న, జిఎంతదితరులు పాల్గొన్నారు.

### దేవదుర్గ గని నుంచి విరివిగా బంగారం, రాగి తీసి దేశ సంపదను పెంచుదాం

కర్ణాటకలోని దేవదుర్గ గని నుంచి పెద్ద ఎత్తున బంగారం, రాగి ఖనిజాలను వెలికితీసి దేశ సంపదను పెంపొందించడానికి కలిసికట్టుగా కృషి చేద్దామని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. రాయచూరు జిల్లా, దేవదుర్గ తాలూకా లింగదహళ్ళి గ్రామంలో సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కాపర్, గోల్డ్ మైనింగ్ అన్వేషణ కార్యక్రమాన్ని అధికారికంగా డిప్యూటీ సిఎం ప్రారంభించారు. అనంతరం ఖనిజ అన్వేషణ ప్రదేశాలను ఆయన క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు. దాదాపు 136 సంవత్సరాల సుదీర్ఘ మైనింగ్ అనుభవం ఉన్న సింగరేణి కాలరీస్ సంస్థ, కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన టెండర్లలో దేవదుర్గ్ బ్లాక్ ఎక్స్‌ప్లోరేషన్ (అన్వేషణ) హక్కులను దక్కించుకున్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం డిప్యూటీ సిఎం మాట్లాడుతూ అన్వేషణ పనులను సింగరేణి సంస్థ త్వరలోనే వేగవంతం చేస్తుందని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు విజయవంతమై ఇక్కడ బంగారం, రాగి విరివిగా లభిస్తే ప్రాంతీయంగా నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున ఉపాధి లభించడమే కాకుండా ఈ ప్రాంతం శీఘ్రగతిన అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సింగరేణి సంస్థ చైర్మన్, ఎండి డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి, డైరెక్టర్ సి.కె.వెంకటేశ్వర్లు, జిఎం పంకజ్ కులశ్రేష్ట, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల ప్రజాప్రతినిధులు, సింగరేణి ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటిలో మొక్కలు పెంచే సంస్కృతిని ప్రోత్సహించాలి

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రతి ఇంటిలో మొక్కలు పెంచే సంస్కృతిని ప్రోత్సహించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. నగరాల్లో పెరుగుతున్న కాలుష్యం, ఒత్తిడిని తగ్గించేందుకు హరిత వాతావరణాన్ని పెంపొందించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు.హైదరాబాద్‌లో ఐమ్యాక్స్ థియేటర్ పక్కన హెచ్ఎండిఎ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన 20వ గ్రాండ్ నర్సరీ మేళాఆల్ ఇండియా హార్టికల్చర్ అండ్ అగ్రికల్చర్ షోను గురువారం మంత్రి ప్రారంభించారు. అనంతరం స్టాళ్లను సందర్శించి మొక్కల వివరాలను అడిగి తెలుసుకున్నారు.2015 నుంచి ప్రతి ఏడాది జనవరి, ఆగస్టు నెలల్లో నర్సరీ మేళాను నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రజలకు వివిధ రకాల మొక్కలను ఒకే వేదికపై అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ఇంటి స్థాయిలో గార్డెనింగ్‌ను ప్రోత్సహించేందుకు ఈ మేళా ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ నెల 27 నుంచి 31 వరకు ఐదు రోజుల పాటు జరిగే మేళాలో 110కు పైగా స్టాళ్లు ఏర్పాటు చేశారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన పూలు, ఔషధ, అలంకరణ మొక్కలు, బోన్సాయ్, కాక్టస్ తదితర రకాల మొక్కలు అందుబాటులో ఉన్నాయి. టెర్రస్, వెర్టికల్, హైడ్రోపోనిక్ గార్డెనింగ్‌కు అవసరమైన మొక్కలు, సామగ్రి కూడా లభిస్తున్నాయి. రూ.20 నుంచి రూ.2.5 లక్షల వరకు వివిధ ధరల మొక్కలు అందుబాటులో ఉన్నాయని మంత్రి తెలిపారు. మొక్కల పెంపకానికి అవసరమైన మెటీరియల్స్, ఆర్గానిక్ ఎరువులు, ఫెర్టిలైజర్లు, టెర్రకోట కుండీలు తదితర సామగ్రి కూడా ఒకే చోట లభించడం మేళా ప్రత్యేకత అన్నారు.ఇంటి ఆవరణలో మొక్కలు పెంచడం వల్ల అందంతో పాటు ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని తుమ్మల పేర్కొన్నారు. మొక్కల పెంపకం ఒత్తిడిని తగ్గించి మానసిక ఉల్లాసాన్ని కలిగించడంతో పాటు పరిసరాలను చల్లగా ఉంచేందుకు దోహదపడుతుందని తెలిపారు.హైదరాబాద్ నగరవాసులు ఐదు రోజుల నర్సరీ మేళాను సందర్శించి తమకు నచ్చిన మొక్కలను కొనుగోలు చేసి ఇళ్లను పచ్చదనంతో నింపుకోవాలని మంత్రి కోరారు.



## రాఖీ పౌర్ణమికి 5 వేల ప్రత్యేక బస్సులు

### ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఆర్‌టిసి విస్తృత ఏర్పాట్లు: మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాపక్షం/హైదరాబాద్: రాఖీ పౌర్ణమి పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని టిజిఎస్‌ఆర్‌టిసి విస్తృత ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆగస్టు 27 నుంచి 31వ తేదీ వరకు ప్రయాణికుల సౌకర్యార్థం 5 వేల ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు వెల్లడించారు. గత ఏడాది రాఖీ పౌర్ణమి సందర్భంగా 4,760 ప్రత్యేక బస్సులను నడపగా, ఈసారి మరో 240 బస్సులను అదనంగా ఏర్పాటు చేసినట్లు మంత్రి చెప్పారు. గత ఏడాది ప్రత్యేక బస్సుల్లో సుమారు 3.68 కోట్ల మంది ప్రయాణించగా, 2.51 కోట్ల మంది మహిళా ప్రయాణికులు ఉన్నారని తెలిపారు. ప్రయాణికుల రద్దీని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

### యథావిధిగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం..

మహిళా ప్రయాణికులకు మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం యథావిధిగా కొనసాగుతుందని మంత్రి స్పష్టం చేశారు. పండుగ రద్దీ నేపథ్యంలో ఆర్‌టిసి సిబ్బంది సమష్టిగా, ఓర్పుతో విధులు నిర్వహించి ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులు సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకునేలా టిజిఎస్ ఆర్‌టిసి అన్ని చర్యలు చేపడుతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

## నేపాల్ వరదల నేపథ్యంలో..

# తెలంగాణ పౌరుల భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు

- 23 మంది బాధితులను ప్రాథమికంగా గుర్తించిన అధికారులు
- కేంద్ర విదేశాంగ శాఖకు వివరాలు అందజేత
- బాధితుల కుటుంబాలు ఆందోళన చెందొద్దు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ : నేపాల్‌లో సంభవించిన ఆకస్మిక వరదల నేపథ్యంలో అక్కడ ఉన్న తెలంగాణకు చెందిన పర్యాటకులు, యాత్రికులు, ఇతర పౌరుల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. నేపాల్‌లో చిక్కుకున్న తెలంగాణ వాసుల కుటుంబ సభ్యులు అందించిన సమాచారంతో ప్రాథమికంగా 23 మంది తెలంగాణ వాసులను గుర్తించి, వారి వివరాలను కేంద్ర విదేశాంగ శాఖకు పంపించినట్లు వెల్లడించారు. వారి ఆచూకీ, ప్రస్తుత పరిస్థితిని తెలుసుకుని అవసరమైన సహాయ చర్యలు అందించేందుకు కేంద్ర విదేశాంగ శాఖ, కాఠ్మాండు భారత రాయబార కార్యాలయం, నేపాల్ అధికారులతో రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం సమన్వయం చేస్తోందని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ప్రత్యేక హెల్ప్‌లైన్, కోఆర్డినేషన్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అలాగే హైదరాబాద్లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో సాధారణ పరిపాలన శాఖ (ఎన్‌ఆర్‌ఐ విభాగం) ఆధ్వర్యంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి బాధితుల కుటుంబాల నుంచి సమాచారం సేకరిస్తూ సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తున్నట్లు చెప్పారు. నేపాల్‌లోని తాజా పరిస్థితులు, అక్కడ తెలంగాణ వాసుల సంఖ్యపై డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించినట్లు తెలిపారు. ఇంకా ఎవరైనా తెలంగాణ వాసులు నేపాల్‌లో చిక్కుకున్నట్లయితే వారి కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వానికి సమాచారం అందించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. బాధితుల పేరు, పాస్‌పోర్ట్ వివరాలు, మొబైల్ నెంబర్, నేపాల్‌లో చివరిగా ఉన్న ప్రదేశం, ట్రావెల్ లేదా టూర్ ఆపరేటర్ వివరాలు, కుటుంబ సభ్యుల సంప్రదింపు నెంబర్లు అందిస్తే సంబంధిత అధికారులతో సమన్వయం చేసి అవసరమైన సహాయం అందిస్తామన్నారు. పరిస్థితి పూర్తిగా సాధారణ స్థితికి వచ్చే వరకు తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తంగా ఉంటుందని, రాష్ట్రానికి చెందిన ప్రతి ఒక్కరి భద్రత కోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. నేపాల్‌లో నెలకొన్న విషాదకర పరిస్థితులపై ఆయన తీవ్ర విచారం వ్యక్తం చే స్తూ, అక్కడ ఉన్న తెలంగాణ ప్రజల కుటుంబ స భ్యులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు.

### ప్రత్యేక హెల్ప్‌లైన్ నెంబర్లు..

**తెలంగాణ భవన్ (న్యూఢిల్లీ)**:9871999044, 9949351270, 9618597969

**తెలంగాణ సచివాలయం ప్రత్యేక కంట్రోల్ రూమ్**

ఎస్.లక్ష్మి నారాయణ (అసిస్టెంట్ సెక్రటరీ) 9885371189, కె. శ్రీనివాస్ రెడ్డి (సెక్షన్ ఆఫీసర్) 7997959754, ఇ. చిట్టిబాబు (సెక్షన్ ఆఫీసర్) 9440854433.


**మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ :: సరూర్‌నగర్ సర్కిల్-12**

Date: 25.08.2026

NIT No. 15/EE12/SRNR/MMC/2026-27, తేది: 25.08.2026, పని పేరు: (04) పనుల కోసం ''గణేష్ పనులు'', అంచనా విలువ: రూ.16.3 లక్షలు, బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం: 31.08.2026 మ.03.10గం.ల వరకు, అధికారి పేరు & చిరునామా: శ్రీ వి.కార్తీక్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సరూర్‌నగర్ సర్కిల్-12, ఎంఎంసి. మొబైల్ నెం. 9701365519, మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా http://www.eprocurement.telangana.gov.in/లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సరూర్‌నగర్ సర్కిల్-12, ఎంఎంసి.

DIPR R.O. No. : 8708-PP/CL/ADVT/2026-27, Date: 27-08-2026

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్ నెం.28, చార్మినార్ జోన్

Short Tender Notice No. 23/EE.Div.NO.28/GHMC/2026-27 Date: 18.08.2026

NIT No. షార్ట్ టెండర్ నోటీసు నెం. 27/EE.Div.NO.28/GHMC/26-27, తేది: 27.08.2026, పని వివరణ: నిర్వహణ పనులు - (02) నెం.లు, అంచనా విలువ: రూ.2.30 లక్షలు, బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం: ప్రారంభ తేది: 27.08.2026 సా.05.00గం.లకు, స్వీకరణకు ఆఖరి తేది & సమయం: 28.08.2026 సా.05.00గం.ల వరకు, అధికారి పేరు & చిరునామా: శ్రీమతి ఆర్.ఇందిరా బాయి, సెల్ నెం. 9963025505. పనుల వివరాల కాపీ జతచేయడమైనది.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-28, సిఆర్‌జెడ్, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 8733-PP/CL/ADVT/2026-27, Date: 27-08-2026

**హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ**
4వ అంతస్తు, స్వర్ణజయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట్, హైదరాబాద్.

HMDA Act. 2008లోని సెక్షన్ 15 (4) ప్రకారం బహిరంగ ప్రకటన

(మెమో నం. 11578/Plg.I(1)/2025, తేదీ: 14.07.2026 - G.O.Ms.No. 251 MA & UD శాఖ, తేదీ: 22.11.2025కి సవరణ)

హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం, 2008 (చట్టం నం. 8/2008)లోని సెక్షన్ 15, ఉప-సెక్షన్ (1) ద్వారా సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ, ప్రభుత్వం ఈ క్రింది మార్పును చేస్తోంది: G.O.Ms. No. 288 MA&UD, తేదీ: 03.04.2008 ద్వారా ప్రభుత్వం ఆమోదించిన పూర్వపు HUDA పరిధిలోని కూకట్‌పల్లి జోన్ విభాగానికి సంబంధించిన సవరించిన మాస్టర్ ప్లాన్‌లో పేర్కొన్న రోడ్డు నెట్‌వర్క్‌లో ఈ మార్పు చేయబడింది. మాస్టర్ ప్లాన్‌లో పొందుపరచడానికి గాను, గాజులరామారం గ్రామం సర్వే నం. 307 గుండా వెళ్లే 30 మీటర్ల వెడల్పు గల మాస్టర్ ప్లాన్ రోడ్డు యొక్క రీ-అలైన్‌మెంట్ (మార్గ మార్పు)కు సంబంధించిన సవరించిన RDP (షీట్ నం. 2) ఆమోదం: అంటే, G.O.Ms.No.288 MA&UD, తేదీ: 03.04.2008 ద్వారా ప్రకటించిన మాస్టర్ ప్లాన్ ప్రకారం ఉన్న 30 మీటర్ల వెడల్పు గల రోడ్డు మార్గాన్ని, GHMC ఆమోదించిన సవరించిన RDP ప్రకారం మార్చడం. ఈ మార్పు హనుమాన్ ఆలయం (కైసర్ నగర్) నుండి మిథిలా నగర్ వరకు, శంషిగూడ గ్రామం సర్వే నం. 68 మరియు గాజులరామారం గ్రామం సర్వే నం. 307, 342, 345 ల నుండి శంషిగూడ గ్రామం సర్వే నం. 68 మరియు గాజులరామారం గ్రామం సర్వే నం. 307, 306, 337, 338, 339, 342 ల మీదుగా వెళ్లేలా చేయబడింది.

దీనికి సంబంధించిన వివరాలు http://gazette.telangana.gov.in// మరియు http://hmda.gov.in// వెబ్‌సైట్‌లలో అందుబాటులో ఉన్నాయి.

సం/-
ప్లానింగ్ డైరెక్టర్ (CMC & GHMC), HMDA

DIPR R.O. No. : 8759-PP/CL/ADVT/2026-27, Date: 27-08-2026

## ఎఐటియుసి జిల్లా కౌన్సిల్ సభ్యుల ఎన్నిక



ప్రజాపక్షం/ ఖమ్మం : ఎఐటియుసి జిల్లా కౌన్సిల్ సభ్యులుగా, ప్లంబింగ్ వర్కర్స్ అసోసియేషన్ నాయకులు సాదు నాగరాజు, దేవ శ్రీను, మూల గుంద్ల గోపి లు ఎన్నికయ్యారు. సత్తుపల్లిలో జరిగిన జిల్లా మహాసభల్లో ఈ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక హక్కుల సాధనలో ముందు వరుసలో నిలిచిన ఎఐటియుసి జిల్లా కమిటీకి తమను ఎంపిక చేయడం పట్ల నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఎఐటియుసి నిర్వహించే పోరాటంలో తాము ముందు వరుసలో ఉంటామని ఈ సందర్భంగా వారు తెలిపారు.

## తప్పులు లేకుండా పంట వివరాలు ఆన్‌లైన్ చేయాలి

జిల్లా వ్యవసాయ అధికారి డి పుల్లయ్య




ప్రజాపక్షం/కొణిజర్ల : రైతుల పంటల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసే టప్పుడు తప్పులు లేకుండా నమోదు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య తెలిపారు. గురువారం మండల పరిధిలోని రాళ్ళబంజర గ్రామంలో డిజిటల్ క్రాప్ సర్వే విధానాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల వివరాలు ఆన్‌లైన్‌లో సరిగా నమోదు చేయకపోతే రైతులు పండించిన పంటను అమ్ముకునేటప్పుడు నష్టపోతారని తెలిపారు. రైతులు మీ గ్రామాల్లో పంటల వివరాలు నమోదు చేసే వాలంటీర్స్ వద్దకు వెళ్లి తప్పులు లేకుండా ఆన్‌లైన్ చేయించుకోవాలని రైతులకు సూచించారు. రైతుల పంటల నమోదు వివరాలు కార్యక్రమం తొందరగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఎఇఒలు ఎప్పటికప్పుడు వాలంటీర్స్‌తో మాట్లాడి వారికి వచ్చిన సందేహాలు నివృత్తి చేసి త్వరగా సర్వే పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కొణిజర్ల మండల వ్యవసాయ అధికారి దొడ్డిగొర్ల బాలాజీ, ఎఇఒ శ్రీకృష్ణ, సర్వే వాలంటీర్స్ పాల్గొన్నారు.

## ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఆత్మహత్య

ప్రజాపక్షం/ఖమ్మం క్రైం : చాలీచాలని జీతం... ఇంటి నిర్మాణం కోసం తీసుకున్న బ్యాంక్‌లోన్ వంటి ఆర్థిక ఇబ్బందులతో ఓ ప్రైవేటు ఉపాధ్యాయుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఖమ్మం టూటౌన్ పరిధిలోని విజయనగరం కాలనీలో గురువారం చోటు చేసుకుంది. టూటౌన్ సిఐ బాలకృష్ణ కథనం ప్రకారం విజయ నగర కాలనీలో ముప్ప రవీందర్ (47), వినోద దంపతులు జీవిస్తున్నారు. రవీందర్ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తుండగా భార్య వినోద ప్రైవేట్ ఆస్పత్రిలో నర్స్‌గా పనిచేస్తోంది. వీరికి ఇద్దరు సంతానం .. ఇటీవల ఇంటి నిర్మాణం కోసం రవీందర్ బ్యాంక్‌లో లోన్ తీసుకుని నెలవారి చెల్లింపులు చేస్తున్నాడు. పిల్లల చదువులు, బ్యాంక్‌లోన్ వచ్చే ఆదాయానికి మించి భారంగా మారడంతో భార్యకు చెప్పుకొని బాధపడుతుండేవాడు. మనస్తాపానికి లోనై బుధవారం రాత్రి భార్య వినోద రాత్రి విధులకు ఆస్పత్రికి వెళ్లగా పిల్లలిద్దరిని వారి గదిలో పడుకోబెట్టిన రవీందర్ ఒంటరిగా తన బెడ్‌రూంలో పడుకున్నాడు. గురువారం ఉదయం ఎనిమిది గంటల సమయంలో తన బెడ్‌రూమ్‌లో ఫ్యాన్‌కు ఉరి వేసుకోగా గమనించిన ఇరుగుపొరుగువారు భార్యకు, పోలీసులకు సమాచారం ఇచ్చి బాధితుడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

## న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

కలెక్టరేట్ ముందు టిజిఇజెఎసి ధర్నా



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ టిజి ఇజెఎసి జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ముందు మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు పెద్ద ఎత్తున ఉద్యోగులు, ఉపాధ్యాయులు తరలి వచ్చారు. ఈ సందర్భంగా టిజి ఇజెఎసి జిల్లా చైర్మన్ అమరనేని రామారావు, కన్వీనర్ సంగం వెంకటపుల్లయ్య మాట్లాడుతూ ఉద్యోగులు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల్లో ప్రజలకు చేరవేయడంలో కీలకపాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. వారిని ప్రభుత్వం అన్ని విధాలుగా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. రెండో వేతన సవరణ కమిషన్ నివేదికను తెప్పించి వెంటనే అమలు చేయాలని ఉద్యోగులు, పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న ఆరు డిఎలను విడుదల చేయాలని, రూ.10 వేల కోట్లుగా పేరుకుపోయిన బకాయిలను మంజూరు చేయాలని, సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకుని డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, వివిధ ఉద్యోగ ఉపాధ్యాయ గెజిటెడ్ అధికారుల సంఘాల ప్రతినిధులు పెన్షనర్లు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## జెఎసి ధర్నాకు చంద్రావతి మద్ధతు



ప్రజాపక్షం/ ఖమ్మం : ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల న్యాయమైన డిమాండ్లను సత్వరం పరిష్కరించాలని మాజీ శాసన సభ్యురాలు బానోత్ చంద్రావతి డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ వద్ద జెఎసి ఆధ్వర్యంలో జరిగిన ధర్నాకు ఆమె సంపూర్ణ మద్ధతు ప్రకటించారు. ఈ సందర్భంగా చంద్రావతి మాట్లాడుతూ పాలనలో ఉద్యోగుల పాత్ర అత్యంత కీలకమని ప్రజలకు ప్రభుత్వ పథకాలు, సేవలు చేరవేస్తూ సంక్షేమాన్ని పర్యవేక్షిస్తుంటారని ఆమె తెలిపారు. ఉద్యోగుల డిఎ, పిఆర్‌సిలతో పాటు ఆరోగ్య కార్డులు అందుబాటులోకి తేవడం ప్రభుత్వ కనీస బాధ్యత అన్నారు. భవిష్యత్తులో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు చేపట్టే ఆందోళనకు తాము పూర్తి మద్ధతునిస్తామన్నారు.

## ఇందిరమ్మ రాజ్యంలో..

# విద్య, వైద్యానికి పెద్దపీట

ప్రతీ నిరుపేదకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

రూ.30లక్షలతో పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి



ప్రజాపక్షం/తిరుమలాయపాలెం: మండల పరిధిలోని గోపాలపురంలో రూ.30లక్షల వ్యయంతో నూతన ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణానికి తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శంకుస్థాపన చేశారు. జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ మాట్లాడారు. ప్రతీ గ్రామంలో విద్యా వసతులను మెరుగుపరచడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని తెలిపారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నామని, గోపాలపురం గ్రామంలో రూ.30లక్షలతో నిర్మించనున్న నూతన ప్రాథమిక పాఠశాల భవనం ద్వారా విద్యార్థులకు మరింత మెరుగైన వాతావరణంలో విద్యను అభ్యసించేందుకు అవకాశం కలుగుతుందని, మంత్రి స్పష్టం చేశారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా ఎర్రగడ గ్రామంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని, మొక్కలను నాటడంతోపాటు వాటిని సంరక్షించే బాధ్యతను తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిఆర్ఎస్ఇ వెంకట్‌రెడ్డి, ఆర్అండ్ బి ఎస్ఇ యుగంధర్‌రావు, హౌసింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ఖమ్మం ఆర్‌డిఒ ఎన్.శ్రీనివాస్, ఎంపిడిఒ సిలార్ సాహెబ్, తహసీల్దార్ విల్సన్, ఎంఇఒ నుకారపు బాబు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు ఇందిరా, ఎర్రగడ్డయ, గ్రామ సర్పంచ్ నల్లమల్ల కీర్తి నీరణ్ కుమార్, పాలేరు నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మాజీ ఎంపిపి కొప్పుల అశోక్, కొక్కిరేణి సర్పంచ్ కర్నాటి రాజేంద్రప్రసాద్, మాజీ సర్పంచ్ గడ్డి కొప్పుల రాజు తదితరులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల నియంత్రణకు పటిష్ట చర్యలు: అదనపు కలెక్టర్



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : జిల్లాలో మాదక ద్రవ్యాల వినియోగం, విక్రయం, అక్రమ రవాణాలను పూర్తిగా అరికట్టేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ వేణుగోపాలరావు అన్నారు. గురువారం ఐడిఒసిలో జిల్లా స్థాయి మాదక ద్రవ్యాల నివారణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తుల జీవితాలు దుర్భరం అవుతున్నాయని యువత మాదక ద్రవ్యాల భారిన పడకుండా ముందస్తు అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులు, యువతకు వీటిపై జరిగే నష్టాన్ని వివరించాలని సూచించారు. గంజాయితో పాటు మాదకద్రవ్యాల నివారణకు సంబంధించి పూర్తి నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఇలాంటి చర్యలను తీవ్రంగా పరిగణించాలని ఆదేశించారు. గతంలో నమోదైన కేసులు వాటి పురోగతి, ఆర్టీసీ ద్వారా జరుగుతున్న అక్రమ రవాణాను అరికట్టేందుకు సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణాధికారి వెంకటరమణ, జిల్లా వ్యవసాయాధికారి బాబూరావు ఇల్లెందు డిఎస్‌పి వెంకన్నబాబు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ‘సర్’ ఓటర్ ముసాయిదా జాబితాపై సమావేశం



ప్రజాపక్షం/రఘునాథపాలెం : ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ఓటరు ముసాయిదా జాబితాపై గ్రామ పంచాయతీల్లో సమావేశం నిర్వహించారు. అన్ని గ్రామ పంచాయతీల్లో ముసాయిదా ఓటరు జాబితాకు సంబంధించి సర్పంచ్‌ల అధ్యక్షతన బూత్ లెవల్ అధికారులు (బిఎల్ఒ), బూత్ లెవల్ ఏజెంట్లు (బిఎల్ఏ) సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సర్ ప్రక్రియలో భాగంగా అనామలీస్, మ్యాపింగ్ కానీ ఓటర్లకు సంబంధించి నోటీసుల జారీ, విచారణకు సంబంధించిన అంశాలపై చర్చించారు. ఎన్నికల సంఘం సూచించినవిధంగా 11 రకాల ధృవపత్రాలతో విచారణ సమయంలో నోటీసులు అందుకున్న ఓటర్లు సమర్పించాలని బిఎల్ఒలు సూచించారు. అదేవిధంగా కొత్త ఓటర్ల నమోదు, ఓటరు జాబితాలో తప్పులు, ఓటరుకు సంబంధించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఫిర్యాదు చేయాలని సూచించారు. వి. వెంకటాయపాలెం గ్రామ పంచాయతీలో సర్పంచ్ కాపా ఆదినారాయణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అనామలీస్, మ్యాపింగ్ కానీ ఓటర్ల పై చర్చించారు. ఈ కార్యక్రమంలో బిఎల్ఒలు కవిత, షాలిని, వసంత, సుభద్ర, రాజకీయ పార్టీల నాయకులు వెంకటరమణ, శ్రీనివాసరావు, కుతుంబాక నరేష్, తొలుపునూరి దానయ్య, గుత్తా వంశీ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గం

నిర్లక్ష్యం చేస్తే మూల్యం చెల్లించక తప్పదు

టిజిఇజెఎసి నేతల హెచ్చరిక



ప్రజాపక్షం/ ఖమ్మం : ఖమ్మంలో ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లు కదం తొక్కారు. గురువారం కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నాకు ఖమ్మం జిల్లా నలుమూలల నుండి పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఖమ్మం కలెక్టరేట్ పరిసరాలు ధర్నాకు వచ్చిన ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లతో కిటకిటలాడాయి. వైరా రోడ్డులో ట్రాఫిక్ స్తంభించింది. ఎటు చూసినా ఆందోళనకారులే కనిపించారు. ప్రతీ ఒక్కరూ డిమాండ్స్‌తో కూడిన ప్లకార్డ్స్‌ను ప్రదర్శిస్తూ కనిపించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యోగ జాయింట్ యాక్షన్ కమిటీ ఖమ్మం జిల్లా చైర్మన్ (టిజిఇజెఎసి) గుంటుపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వివిధ సంఘాల నాయకులు ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం చూపి ఆర్థిక, సేవ, ఆరోగ్య భద్రత కల్పించేవిధంగా తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పే రివిజన్ కమిషన్ నివేదికను వెంటనే తెప్పించి నిర్ణీత గడువు లోగా అమలు చేయాలని నేతలు డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న డిఎలను విడుదల చేయడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెన్షనర్లకు సంబంధించిన రూ.10వేల కోట్ల మేర బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని వెంటనే చెల్లించాలని, సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఉద్యోగుల ఆరోగ్య పథకం పూర్తి స్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని, సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కారించాలని కోరారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేయాలని అవసరమైతే ఆందోళనను హైదరాబాద్ కేంద్రంగా నిర్వహించేందుకు ఉద్యోగ,ఉపాధ్యాయ పెన్షనర్లు సిద్ధం కావాలని గుంటుపల్లి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లు ఐక్యంగా కదలడం వల్లే ఈ ధర్నా విజయవంతమైందని ఇది భవిష్యత్తు పోరాటాలకు శుభ సూచకమన్నారు. సమస్యల పరిష్కారం కోరుతూ ఆందోళనకారులు చేసిన నినాదాలతో వైరా రోడ్డు మారుమ్రోగింది. ధర్నా అనంతరం ఉద్యోగులు ర్యాలీగా వెళ్లి సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు టి. సునీల్ రెడ్డి, పారపల్లి నాగేశ్వరరావు, కట్టా శేఖర్, పరిశ పుల్లయ్య, రాయల నర్సింహారావు, రంగారావు, దుర్గాభవాని, రాజేష్, మోదుగు వేలాద్రి, కొణిదెన శ్రీనివాస్, సుబ్బయ్య, వేణు, వెంగళరావు, నాగిరెడ్డి, మల్లెల రవీంద్ర, యలమద్ది వెంకటేశ్వర్లు, బిక్కు వెంకటరమణ, వెంకటపతిరాజు, ఉషశ్రీ, తాళ్లూరి శ్రీకాంత్, గఫూర్, శ్రీధర్, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## పరిశ్రమల అనుమతుల్లో జాప్యం ఉండొద్దు

తిరస్కరించిన దరఖాస్తులకు స్పష్టమైన కారణాలు ఉండాలి

రూ. 2.58 కోట్ల పారిశ్రామిక ప్రోత్సాహకాలకు ఆమోదం

కలెక్టర్ దివాకర టిఎస్




ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : జిల్లాలో పరిశ్రమల స్థాపనకు సంబంధించిన అనుమతుల మంజూరులో ఎలాంటి జాప్యం జరగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి టిజి ఐపాస్ సమావేశంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పాల్గొని సంబంధిత అధికారులతో కలిసి పరిశ్రమల స్థాపనకు సంబంధించిన దరఖాస్తులు, అనుమతుల మంజూరు, పారిశ్రామిక ప్రోత్సాహకాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనకు అవసరమైన అనుమతులను నిర్ణీత గడువు లోగా మంజూరు చేయాలని అనవసర జాప్యం లేకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. గత సమావేశం నుంచి 28 కొత్త యూనిట్లు, 64 రకాల అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోగా వాటిలో 32 అనుమతులను నిర్ణీత సమయంలో మంజూరు చేసినట్లు తెలిపారు. అనుమతుల మంజూరులో సాంకేతిక సమస్యలు తలెత్తితే సంబంధిత శాఖల అధికారులు సమన్వయం చేసుకుని వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు. అనుమతుల్లో జాప్యం జరిగితే అందుకు గల కారణాలను తప్పనిసరిగా లిఖిత పూర్వకంగా నమోదు చేయాలన్నారు. తిరస్కరించే దరఖాస్తుల విషయంలో కూడా స్పష్టమైన కారణాలను నమోదు చేయాలన్నారు. డిఐసిసి సమావేశంలో మొత్తం 22 యూనిట్లకు వివిధ పారిశ్రామిక ప్రోత్సాహకాల క్రింద రూ.2,58,18,743 మంజూరుకు ఆమోదం లభించింది. పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం కల్పిస్తున్న ప్రోత్సాహకాలను అర్హులైన పారిశ్రామిక వేత్తలకు సకాలంలో అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.ఈ సమావేశంలో జిఎం ఇండస్ట్రీస్ ప్రవీణ్‌కుమార్, ఎల్డిఎం రవిప్రసాద్, ఆర్‌డివో శ్రీనివాసరావు, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి ముజాహీద్, ఇండస్ట్రీస్ ఎడి నకుల్‌రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎఐటియుసి పోస్టర్ ఆవిష్కరణ




ప్రజాపక్షం/ ఖమ్మం : ఎఐటియుసి రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను గురువారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో ఎఐటియుసి నాయకులు విడుదల చేశారు. ఎఐటియుసి రాష్ట్ర మహాసభలు సెప్టెంబరు 6, 7, 8 తేదీల్లో కరీంనగర్‌లో జరగనున్నాయి. మహాసభలకు సంబంధించిన పోస్టర్ అనంతరం ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు మాట్లాడుతూ కార్మిక హక్కుల కోసం వందేళ్లుగా సమరశీల పోరాటాలు నిర్వహించిన చరిత్ర ఎఐటియుసికి ఉందన్నారు. స్వాతంత్ర్యానికి పూర్వం, స్వాతంత్ర్య అనంతరం అనేక ఉద్యమాలకు ఎఐటియుసి నేతృత్వం వహించి అనేక హక్కులను సాధించిందన్నారు. మారిన పరిస్థితుల్లో హక్కుల పునరుద్దరణ, కనీస వేతనాల చట్టం అమలు, ఉద్యోగ భద్రత, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్‌లపై మహాసభలో చర్చించి పోరాట కార్యాచరణ రూపొందించుకోనున్నట్లు నర్సింహారావు తెలిపారు. పోస్టర్ విడుదల కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బిజి క్లెమెంట్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రావి శివరామకృష్ణ, తోట రామాంజనేయులు, కార్యనిర్వహక అధ్యక్షుడు గాదె లక్ష్మి నారాయణ, కోశాధికారి ఏనుగు గాంధీ, ఎఐటియుసి నాయకులు సిహెచ్ సీతామహాలక్ష్మి, పగడాల మల్లేష్, నిమ్మటూరి రామకృష్ణ, పేరబోయిన మోహన్‌రావు, కార్యదర్శులు రమేష్, శ్రీను, బోడా వీరన్న, వీరునాయక్ తదితరులు పాల్గొన్నారు.

## 29న మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం ప్రారంభం

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ అంకిత్



ప్రజాపక్షం/మణుగూరు: అశ్వాపురం మండలంలోని మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం 29న ప్రారంభించనున్న నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లలో నిమఘ్నమయ్యారు. ఈ కార్యక్రమానికి భారీ, మధ్యతరహా నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి హాజరుకానున్నారు. సీతారామా ప్రాజెక్టుకు అనుసంధానంగా నిర్మించిన మారెళ్ల పాడు ఎత్తిపోతల పథకం పనులను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లతో కలిసి గురువారం పరిశీలించారు. ముందుగా ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు భద్రాద్రి జిల్లా చేరుకునే అశ్వాపురం మండలంలోని బిజి కొత్తూరు ప్రాంతంలోని హెలిపాడ్ ప్రాంతాన్ని నిశితంగా పరిశీలించారు. ఈ ప్రాంతంలో కొనసాగుతున్న పనులపై సలహాలు, సూచనలు అదికారులకు తెలియ జేశారు. అదేవిధంగా మంత్రులు ప్రారంభించనున్న సీతారామ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కాలువల పనుల్లో మారెళ్లపాడు ఎత్తి పోతల పథకం కెనాల్, గొందిగూడెం జి.కొత్తూరు పల్లె ప్రకృతి ముందుగల ప్రాంతంలోని సభా స్థలాన్ని పరిశీలించారు. ఈ క్రమంలో అక్కడ కొనసాగుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. పథకం ప్రారంభోత్సవ సందర్భంగా పనులతీరు, మంత్రుల పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడారు. మంత్రుల పర్యటనఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు చేపట్టాలని, ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్నీ వసతులు కల్పించాలని పేర్కొన్నారు. సీతారామ ప్రాజెక్టును పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకువచ్చి రైతులకు సాగునీరు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ అన్నారు. జిల్లా కలెక్టర్ వెంట నీటి పారుదల శాఖ డిఇ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సిసి వసూళ్ల దందా

ఎమ్మెల్యే, డిఎస్‌పిని ఆశ్రయించిన బాధితులు

ప్రజాపక్షం/భద్రాచలం : భద్రాచలం ఎమ్మెల్యే డా.తెల్లం వెంకట్రావు సిసిగా పనిచేస్తున్న కల్యాణ్ ఉద్యోగాల పేరిట వసూళ్ల దందాకు తెరలేపాడు. బిటిపిఎస్, కెటిపిఎస్, ఐటిసిపిలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నమ్మబలికి సుమారు 40 మంది నుండి రూ.6 కోట్లకు పైగా వసూళ్లు చేసినట్లు తెలుస్తోంది. దీనిపై పలువురు బాధితులు గురువారం స్థానిక ఎమ్మెల్యే డా.తెల్లం వెంకట్రావుతో సహా డిఎస్‌పిని అరుణ్ కుమార్‌ను ఆశ్రయించారు. దీనిపై డిఎస్‌పిని వివరణ కోరగా బాధితులు కలిసిన మాట వాస్తవమే అని దీనిపై పూర్తి విచారణ చేపట్టిన అనంతరం కేసు నమోదు చేస్తామని తెలిపారు. వివరాల ప్రకారం ఎమ్మెల్యే సిసిగా పనిచేస్తున్న కల్యాణ్ 100 మంది నుండి ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ నమ్మ బలికి డబ్బులు వసూళ్లు చేశాడు. తెలంగాణాతో సహా ఆంధ్రప్రాంతానికి చెందిన పలువురి నుండి ఈ మొత్తం వసూళ్లు చేసినట్లు తెలుస్తోంది. కాగా ఈ మధ్య కాలంలో మణుగూరు చెందిన ఓ వ్యాపారి కూడా సుమారు రూ.40 లక్షల వరకు ఉద్యోగాల పేరిట ఇవ్వగా ఎంతకీ ఉద్యోగాలు రాకపోవడంతో కల్యాణ్‌పై ఒత్తిడి తేవడంతో దశల వారీగా రూ.20 లక్షల వరకు ముట్టు చెప్పినట్లు తెలుస్తోంది. మిగతా డబ్బులు చెల్లిస్తానని చెప్పిన కల్యాణ్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకుని అందుబాటులో లేకుండా పోవడంతో ఒక్కొక్కరిగా బాధితులు వెలుగులోకి వస్తున్నారు. ఇప్పటికి కేవలం కొంతమంది బాధితుల వరకే బయటకు వచ్చారని, మిగితా వారు కూడా బయటకు వచ్చే అవకాశముంది.

# కారు ఢీకొని పారిశుద్ధ్య కార్మికురాలు మృతి

కార్మిక సంఘాల ఆందోళన




ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : కారు ఢీకొని పారిశుద్ధ్య కార్మికురాలు మృతిచెందిన ఘటన ఖమ్మం నగరంలో చోటు చేసుకుంది. గురువారం తెల్లవారు జామున ఖమ్మం అంబేడ్కర్ సెంటర్ సమీపంలోని జమ్మిబండ వద్ద విధులు నిర్వహిస్తున్న మామిడాల నాగమణి (50)ని కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందింది. కారు డ్రైవర్ పరారయ్యాడు. విషయం తెలుసుకున్న మున్సిపల్ కార్మిక సంఘాలు ఆందోళనకు దిగాయి. నాగమణి కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళనను నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ కార్మిక సంఘాల నేతలు మాట్లాడుతూ గతంలో ఖమ్మంలో వివిధ సందర్భాల్లో తొమ్మిది మంది కార్మికులు మృతిచెందారని వారికి ఎటువంటి న్యాయం చేయలేదని నాగమణి కుటుంబానికైనా న్యాయం చేయాలని అప్పటి వరకు ఆందోళనను విరమించేది లేదని స్పష్టం చేశారు. కార్మికుల, కార్మిక సంఘాల ఆందోళన నేపథ్యంలో డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు ఘటనా స్థలానికి చేరుకుని కార్మిక సంఘాల నాయకులతో చర్చించారు. సమస్యను కమిషనర్ అభిషేక్ అగస్త్య దృష్టికి తీసుకెళ్లారు. వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించడంతో పాటు రూ. 5 లక్షలు ఆర్థిక సాయం అందిస్తామని తక్షణ సాయంగా రూ. 25వేలు అందిస్తామని హామీ ఇచ్చారు. దీనికి సమ్మతించిన కార్మిక సంఘాల నాయకులు నెల రోజుల్లో కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించకపోతే తిరిగి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రావి శివరామకృష్ణ, తోట రామాంజనేయులు, టియుసిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జి. రామయ్య, వివిధ కార్మిక సంఘాల నాయకులు బుర్రి ఉపేందర్, నకిరికంటి కృష్ణ, శ్రీను, దొడ్డా నర్సింహారావు, నారాయణ, గురవయ్య, జయరాజు, జెఏసి చైర్మన్ బుర్రి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రజాపక్షం Telugu National Daily


# ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి కృషి

### మహాధర్నాలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

**ప్రజాపక్షం/హనుమకొండ :** ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని మహాధర్నాలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. హనుమకొండ జిల్లా ఉద్యోగ సంఘాల జేఏసీ అధ్యక్షులు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట జరిగిన మహాధర్నాలో ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, అంగన్వాడి సిబ్బంది, ఆశ వర్కర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ మహాధర్నా కార్యక్రమానికి విచ్చేసిన స్థానిక శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలన్నీ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం కొరకు కృషి చేస్తున్నామని, ముఖ్యమంత్రికి సమస్యలన్నీ తెలుసునని, ఆర్థిక పరిస్థితి బాగాలేదని, త్వరలోనే ఉద్యోగుల సమస్యలన్నీ పరిష్కారం చేసే దిశలో ముఖ్యమంత్రి కృతనిశ్చయంతో ఉన్నారని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారం కొరకు అవసరమనుకుంటే ముఖ్యమంత్రి దగ్గరికి మిమ్మల్ని తీసుకొని వెళతాను అని అన్నారు. ఓపిక గా ఉంటే సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని పేర్కొంటూ మీ అందరి ఆశీర్వాదంతో ప్రభుత్వం ఏర్పాటయిందని, త్వరలోనే ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సంబంధించిన శుభవార్త వింటారని పేర్కొన్నారు.మహాధర్నా శిబిరానికి విచ్చేసి ఉద్యోగులకు సంఘీభావం తెలపడానికి మాజీ మంత్రివర్యులు హరీష్ రావు, దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, మాజీ శాసనసభ్యులు వినయ భాస్కర్, ధర్మారెడ్డి, రాజయ్య, సతీష్‌కుమార్ విచ్చేయడం జరిగింది. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ మూడు సంవత్సరాలు అయినా ఉద్యోగుల సమస్యలు ఒక్కటి కూడా తీరలేదని, మేనిఫెస్టోలో పెట్టిన ఉద్యోగుల సమస్యలు అలాగే ఉండిపోయాయని అన్నారు. అధికారంలోకి రాగానే పాత పెన్షన్ పునరుద్ధరణ చేస్తామని, మెరుగైన పిఆర్ సి అందిస్తామని అన్నారని, అధికారం లోకి వచ్చి మూడు సంవత్సరాలు అయినా ఉద్యోగుల ఆరు డీఎలు పెండింగ్ లో ఉన్నాయని, ముఖ్యంగా హెల్త్ కార్డ్ సమస్యలు పరిష్కారం కావడం లేదని దానితో ఉద్యోగులు ముఖ్యంగా పెన్షనర్లు వారి కుటుంబ సభ్యులు చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రానున్న అసెంబ్లీ సమావేశంలో ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని ఉద్యోగుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు ప్రభుత్వాన్ని నిలదీస్తామని అ న్నారు. జిల్లా జేఏసీ చైర్మన్ ఆకుల రాజేందర్ మాట్లాడుతూ



ప్రభుత్వం ఉద్యోగుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి పిఆర్సి రిపోర్టు తెప్పించుకుని వెంటనే మెరుగైన పిఆర్సి ఇవ్వాలని, పెండింగ్ లో ఉన్న ఆరు డిఎ లని వెంటనే విడుదల చేయాలని, మేనిఫెస్టోలో పెట్టిన విధంగా పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధారించాలని డిమాండ్ చేశారు. ఎన్ఆర్ జిఎస్, అంగన్వాడి, ఆశ వర్కర్లు, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అన్నారు. మహా ధర్నా అనంతరం జేఏసీ నేతలు జిల్లా కలెక్టర్ చాహత్ బజ్ పాయ్ ఐఏఎస్ కి ఉద్యోగుల సమస్యల వినతి పత్రం అందించారు.ఈ కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ ఆకవరపు శ్రీనివాస్ కుమార్, డిటిఎఫ్ రాష్ట ప్రధాన కార్యదర్శి లింగారెడ్డి, జేఏసీ నేతలు బైరీ సోమయ్య, పనికెల రాజేష్, డాక్టర్ ప్రవీణ్, రవీందర్ రాజు, పెండెం రాజు, కొమురయ్య, కట్కూరి శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, తిరుపతి, కామగోని రాంబాబు, వేమూరి రాంబాబు, కొండం రవి ప్రకాష్, విజయ్ కుమార్, సరస్వతి, వెంకట్రామిరెడ్డి, సర్వర్ హుస్సేన్, గోపాలరెడ్డి, ధర్మరాజు, భాస్కర్, కిరణ్ గౌడ్, రాజేష్, శ్యాం సుందర్,రాము నాయక్, పావని, గోపి కృష్ణ,శ్రీ జ్యోతి, జయంతి, రాజమౌళి, రాజేష్ ఖన్నా, రాజీవ్, ప్రణయ్, పృథ్వి, శృతి తదితరులు పాల్గొన్నారు.

## హనుమకొండ కలెక్టరేట్ వద్ద ఉద్రిక్తత

### మాజీ మంత్రి హరీష్ రావు అరెస్టు



**ప్రజాపక్షం/హనుమకొండ:** హనుమకొండ కలెక్టరేట్ వద్ద ఉద్యోగుల మహాధర్నాకు సంఘీభావం తెలిపి తిరిగి వెళ్తున్న బిఆర్ఎస్ పార్టీ మాజీ మంత్రి హరీష్ రావును పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ కార్య కర్తలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ పూర్తిగా స్తంభించింది. ఈ సందర్భంగా హరీష్ రావు ను స్థానిక సుబేదారి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఆయనతోపాటు మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు ను అరెస్ట్ చేసేందుకు పోలీసులు ప్రయత్నించగా, ఆయన పోలీసు వాహనంలో ఎక్కేందుకు నిరాకరించారు. సుబేదారి కలెక్టరేట్ నుంచి సమీపంలోని పోలీస్ స్టేషన్ వరకు కాలినడకన ముందుకు సాగారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నడిచారు. హరీశ్రావుకు మద్దతుగా భారీగా జనం తరలిరావడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది.హనుమకొండ కలెక్టరేట్ నుంచి సుబేదారి పోలీస్ స్టేషన్ వరకు కాలినడకన వచ్చిన మాజీ మంత్రి హరీశ్ రావు అస్వస్థతకు గురయ్యారు. ఆయన వెంట గులాబీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో పోలీసులు, కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. స్టేషన్లోకి చేరుకున్న హరీశ్ రావు కుర్చీలో కూర్చుని కొద్దిసేపు శ్వాస తీసుకున్నారు. హరీష్ రావు వెంట దాస్యం వినయ్ భాస్కర్, మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్,ఎర్రబెల్లి దయాకర్ రావు,మాజీ ఎమ్మెల్యే చల్ల ధర్మారెడ్డి తదితరులు ఉన్నారు.

## జిల్లాలో భూరీ-సర్వే పనులను వేగవంతం: కలెక్టర్



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** జిల్లాలో భూ దార్ కార్డుల జారీ కోసం చేపట్టిన రీసర్వే పనులను వేగవంతం చేయడంతో పాటు, 22ఏ నిషిద్ధ భూముల పై అర్జీలు, భూభారతి, సాదా బైనామా, రెవెన్యూ సదస్సుల దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆర్‌డీఓలు, తహసీల్దార్లు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ, ఈ నెల 31న రెవెన్యూ శాఖ మంత్రి ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి రెవెన్యూ, హౌసింగ్ అంశాలపై సమీక్ష సమావేశం జరగనున్నందున అధికారులు పూర్తి సమాచారంతో సన్నద్ధంగా ఉండాలని సూచించారు. జిల్లాలో గుర్తించిన 70 గ్రామాల్లో రీసర్వే ప్రక్రియను నిబంధనల మేరకు పక్కాగా చేపట్టాలని, క్షేత్రస్థాయిలో ఖచ్చితమైన కొలతలు నిర్వహించి పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. రీసర్వేకు సంబంధించిన ప్రభుత్వ ఎస్ ఒపి లను అధికారులు పూర్తిగా అధ్యయనం చేసి అమలు చేయాలని తెలిపారు. అలాగే, 22ఏ నిషిద్ధ భూముల జాబితాలో నమోదైన ప్రభుత్వ, అటవీ, నీటిపారుదల, సింగరేణి తదితర భూములను నిబంధనల ప్రకారం పరిశీలించి అవసరమైన సవరణలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం చేయరాదని, తిరస్కరించే దరఖాస్తులకు స్పష్టమైన కారణాలను నమోదు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. భూ రికార్డుల సవరణ ప్రక్రియను పారదర్శకంగా, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, భూపాలపల్లి, కాటారం ఆర్డీఓలు హరికృష్ణ, రవీందర్, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కుసుమ కుమారి, సబ్ రిజిస్ట్రార్ బాలకిషన్, అన్ని మండలాల తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం



**ప్రజాపక్షం/శాయంపేట:** పేదల సంక్షేమమే కోసమే నూతన స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేపడుతున్నట్లు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పేర్కొన్నారు. శాయంపేట మండల పరిధిలోని గట్లకానిపర్తి, శాయంపేట, పెద్దకోడెపాక గ్రామాల్లో ఏర్పాటు చేసిన రైతు వేదికల ప్రాంగణంలో భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు నూతన స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గట్లకానిపర్తి, నర్సింహులపల్లి, శాయంపేట, పత్తిపాక, కాట్రపల్లి, మైలారం, పెద్దకోడెపాక, గోవిందాపూర్, కొప్పుల గ్రామాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు కార్డులను అందజేశారు. అనంతరం పెద్దకోడెపాక గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో తహశీల్దార్ ఆర్. ప్రవీణ్ కుమార్ తో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా భద్రతకు, పారదర్శకతకు పెద్దపీట ప్రభుత్వం పెద్దపీట వేస్తుదన్నారు. అత్యాధునిక సెక్యూరిటీ ఫీచర్లతో రూపొందించిన ఈ స్మార్ట్ రేషన్ కార్డులు అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఒక బలమైన గుర్తింపు కార్డుగా ఉపయోగపడతాయని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహశీల్దార్ ఆర్. ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో పణీంద్ర, తహసీల్దార్ ప్రవీణ్, వ్యవసాయ శాఖ అధికారి, సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## బాలల హక్కుల పరిరక్షణపై అవగాహన




**ప్రజాపక్షం/వెంకటాపురం(నూగురు):** వెంకటాపురంలోని కస్తూర్బా బాలికల హాస్టల్ లో కాఫెడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాలికల హక్కుల పరిరక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందించడం, స్వీయరక్షణ నైపుణ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి ఉపాధ్యాయుడు సూర్యనారాయణ మాట్లాడుతూ బాలికల తమ హక్కులపై పూర్తి అవగాహన కలిగి ఉండడంతో పాటు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సమస్యలు ఎదురైనప్పుడు భయపడకుండా తల్లితండ్రులు, ఉపాధ్యాయులుల, నమ్మకమైన పెద్దవారిని సంప్రదించాలని సూచించారు. కేర్ అండ్ షేర్ భావనతో బాలికలు ఒకరినొకరు గౌరవించుకోవడం, సమస్యలను పరస్పరం పంచుకోవడం అవసరమైన సమయంలో సాయం చేయడం వంటి అంశాలను వివరించారు. బాలికల భద్రత, గౌరవం, హక్కుల పరిరక్షణకు సమాజంలో ప్రతి ఒక్కరు బాధ్యతగా వహించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జి.హన్మంత్, యానిమేటర్లు ఇందిర, ఉష, పద్మ, ప్రశాంత్ తో పాటు కస్తూర్బా పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రత్యేక సమగ్ర ఓటరు సర్వేపై వార్డు సభను పరిశీలించిన కలెక్టర్



**ప్రజాపక్షం/వరంగల్ :** వరంగల్ పట్టణంలోని ఖిలా వరంగల్, చింతల్ ప్రాంతంలోని మున్సిపల్ కమిటీ హాలులో ప్రత్యేక ఓటరు సమగ్ర సర్వేపై నిర్వహించిన వార్డు సభను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద గురువారం ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా వార్డు సభలో చేపడుతున్న సర్ ప్రక్రియ, ఓటర్లకు కల్పిస్తున్న అవగాహన, ఓటరు జాబితాలో పేర్ల పరిశీలన, అభ్యంతరాలు, సవరణలకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తమ ఓటరు వివరాలను పరిశీలించుకుని, ఏవైనా తప్పులు ఉంటే నిర్ణీత ఫాంల ద్వారా సవరణలు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. సర్ ప్రక్రియపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ వార్డు సభ పరిశీలనలో జిల్లా కలెక్టర్ వెంట ఖిలా వరంగల్ తహసిల్దార్ ఇక్బాల్ ఉన్నారు.

## 22ఎ కింద నమోదైన భూముల వివరాలు వెంటనే సమర్పించాలి

**ప్రజాపక్షం/జనగామ:** 22ఏ కింద నమోదైన వ్యవసాయ, వ్యవసాయేతరే భూముల వివరాలు వెంటనే సమర్పించాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్‌కుమార్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వయించగా అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బెన్షాలోమ్‌తో కలిసి మాట్లాడారు. భూ భారతి డేటా ఆధారంగా ఎక్కడైనా 22 ఎ విస్తీర్ణంలో తేడాలు వస్తే వాటిని భూ భారతి పోర్టల్‌లోనే పరిష్కరించాలన్నారు. వ్యవసాయ, వ్యవసాయేతర భూముల్లో 22 ఎ కింద నమోదు అయిన భూముల్ని నిర్ణీత ప్రొఫార్మాలో తహశీల్దార్ల నుండి సేకరించాలన్నారు. ఇందు కోసం ప్రమాణిక కార్యాచరణ విధానం అమలు చేయాలని, ఎస్ఆర్ఓలో వచ్చిన ఫిర్యాదులను ఏ రోజుకు ఆ రోజే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంచుకొని ఆ గ్రామంలో సమగ్రంగా భూముల రీ సర్వే నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని, వాటి సత్ఫలితాల ఆధారంగా అన్ని గ్రామాల్లో రీ సర్వే చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సరేవ అండ్ ట్యాండ్ ఏడి మన్యంకొండ, డీ సెక్షన్ సూపరిండెంట్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## జెన్ ఉద్యమస్ఫూర్తితో సమస్యలపై యువత పోరాడాలి

### ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రి




**ప్రజాపక్షం/మహబూబాబాద్:** అఖిల భారత యు వజన సమాఖ్య (ఏఐవైఎఫ్) మహబూబాబాద్ 4 వ జిల్లా మహాసభ సిపిఐ జిల్లా కార్యాలయం వీరభవన్ లో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆబోతు అశోక్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి అఖిలభారత యువజన సమాఖ్య తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రి ముఖ్యఅతిథిగా హాజరైన ఏఐవైఎఫ్ జెండాను ఎగరవేసి అనంతరం జరిగిన జిల్లా మహాసభలో మాట్లాడుతూ ఇటీవల ఢిల్లీలో జరిగిన జెంజి ఉద్యమ స్ఫూర్తితో యువత సమస్యలపై పోరాడాలి అన్నారు. దేశవ్యాప్తంగా యువత స్వచ్ఛందంగా ఢిల్లీలో 20 రోజుల పాటు ఆందోళన చేస్తే దేశ ప్రధాని నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వం దిగివచ్చి యువత పోరాటానికి వెంటనే కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను రాజీనామా చేయించారన్నారు. ఇది దేశ యువత విజయమని, ఇదే స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా అఖిల భారత యువజన సమాఖ్య కార్యకర్తలు శ్రేణులు భవిష్యత్తులో ఉద్యమాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని 2014లో అధికారంలోకి వచ్చిన మోడీ సర్కార్ ఉద్యోగాల మాట మరిచి కేవలం ఆదానీ అంబానీలకే దేశ సంపద దోచిపెడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఎన్నికల్లో ఇచ్చిన హామీలు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయకుండా ఆలస్యం చేస్తుందనీ నిరుద్యోగ యువకులకు 5వేల నిరుద్యోగ భృతి అన్నారని, రాష్ట్రంలో యువతీ యువకుల కోసం అఖిల భారత యువజన సమాఖ్య ఉద్యమిస్తుందన్నారు. ఈ మహాసభలో సిపిఐ జిల్లా కార్యదర్శి మాజీ ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నేత బి విజయ సారథి మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య కై యువత ఉద్యమించాలని, ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయాలని జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని దానికి ఏఐవైఎఫ్ శ్రేణులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభలో సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయసారథి, అజయ్ సారధి రెడ్డి, కుమార్, అశోక్, ప్రవీణ్, శ్రావణ్, వెంకన్న, నరసింహాలక్ష్మి, పాండురంగ చారి ,సందీప్, కేదాసు రమేష్, వివిధ మండలాల పట్టణనాయకులు పాల్గొన్నారు.

## బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఐ ఛలో డిల్లీ

### సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి




**ప్రజాపక్షం/హనుమకొండ:** కేంద్ర బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సెప్టెంబర్ 1న సిపిఐ ఛలో డిల్లీ కార్యక్రమం తలపెట్టిందని, సెప్టెంబర్ 1న జరిగే ఛలో డిల్లీని విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి పిలుపునిచ్చారు. గురువారం హనుమకొండ మండలంలోని గుండ్ల సింగారం సురవరం సుధాకర్ రెడ్డి నగర్ లోని ముఖ్య కార్యకర్తల సమావేశం సిపిఐ మండల సహాయ కార్యదర్శి గుంటీ రాజేందర్ అధ్యక్షతన జరుగగా ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి తోట బిక్షపతి హాజరై మాట్లాడుతూ దేశంలో మార్పు కోసం సిపిఐ పోరాటం సాగిస్తోందని అన్నారు. బీజేపీ 12 ఏళ్ల పాలనలో ప్రజలకు ఉపయోగకరమైన ఒక మంచి పని చేయలేక పోయిందని, ధరలను అరికట్టడంలో, ఉద్యోగాల కల్పనలో విఫలమైందని అన్నారు. దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసిందని, సాధారణ పౌరులను తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టిందని, రైతాంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యము చేసి కనీస మద్దతు ధరకు చట్టబద్ధమైన హామీ ఇవ్వడంలో విఫలమయ్యారని, రైతు సంక్షేమాన్ని దెబ్బతీశారని, ఉపాధి హామీని నిర్వీర్యం చేశారని అన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశంలో ఆగస్టు 6 నుండి 14 వరకు దేశ వ్యాప్తంగా సిపిఐ ప్రచార జాత పాదయాత్ర నిర్వహించడం జరిగిందని, పాద యాత్ర జాతల ద్వారా ప్రతి గ్రామంలో కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ప్రజలకు వివరించడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా సెప్టెంబర్ 1వ తేదీన లక్షలాది మందితో సిపిఐ ఛలో ఢిల్లీ పిలుపునివ్వడం జరిగిందని అన్నారు. సెప్టెంబర్ 1న జరిగే ఛలో డిల్లీ కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ హనుమకొండ మండల కార్యదర్శి ఎన్ ఎ స్టాలిన్, నాయకులు పూజారి అమృతయ్య, కోడపాక బాబు, దామోదర్, కేతపాక ప్రసాద్, తాటికంటి మమత, గుంటీ రజిత పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు

### కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/గణపురం:** గణపురం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో నిర్వహించిన సర్ ప్రత్యేక గ్రామసభకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై, సర్ ప్రక్రియ, డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాలో గుర్తించిన అనామలీస్, నో మ్యాపింగ్ కేసులు, నోటీసులు జారీ, విచారణ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం సూచనల మేరకు ప్రతి గ్రామంలో, పట్టణ ప్రాంతాల్లోని ప్రతి వార్డులో ప్రత్యేక గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో గత రెండు నెలలుగా సర్ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. సర్‌లో భాగంగా బూతు స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్ళి ఎన్యుమరేషన్ ఫారాలను అందించాలని, 2002 నాటి సర్ ఓటర్ల జాబితాతో మ్యాపింగ్ ప్రక్రియ చేపట్టి ఫారాలను పూర్తి చేసినట్లు తెలిపారు. అనంతరం డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను ప్రచురించినట్లు వివరించారు. డ్రాఫ్ట్ జాబితాలో ప్రధానంగా నో మ్యాపింగ్, అనామలీస్ అనే రెండు రకాల సమస్యలను గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. 2002 సర్ జాబితాతో మ్యాపింగ్ కాని ఓటర్లను నో మ్యాపింగ్ కేటగిరీగా, ఓటరు పేరు, ఇంటిపేరు, పుట్టిన తేదీ, తండ్రి పేరు తదితర వివరాల్లో వ్యత్యాసాలను అనామలీస్‌గా గుర్తించినట్లు చెప్పారు. ఈ కేటగిరీల్లో ఉన్న ఓటర్లకు సంబంధిత బిఎల్ఓల ద్వారా నోటీసులు జారీ చేస్తామని, నోటీసు అందుకున్న వారు రసీదుపై సంతకం చేసి బిఎల్‌ఓకు అందజేయాలని సూ చించారు. నోటీసులో పేర్కొన్న తేదీ, సమ యం, ప్రదేశంలో జరిగే విచారణకు హాజ రై, అవసరమైన ఆధారాలను సమర్పించాలని కోరారు. విచారణ గ్రామ పంచాయతీ, ఎంపిడిఓ లేదా తహసీల్దారు కార్యాలయంలో నిర్వహించే అవకాశం ఉంటుందని, సంబంధిత వివరాలు నోటీసులో స్పష్టంగా పేర్కొంటామని తెలిపారు. ఓటర్ల వయస్సు, పుట్టిన తేదీ తదితర వివరాలను నిర్ధారించేందుకు అవసరమైన గుర్తింపు పత్రాలు, తల్లిదండ్రులకు సంబంధించిన ఆధారాలను సమర్పించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ప్రస్తుతం 1945 అనామలీస్, 1551 నో మ్యాపింగ్ కేసులు ఉన్నట్లు ఆయన వెల్లడించారు. సర్ ప్రక్రియ విజయవంతంగా పూర్తయ్యేందుకు ప్రజలు, రాజకీయ పార్టీలు, బిఎల్ఓలు, బిఎల్ఏలు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, రాజేశ్వరరావు, శ్రీనివాస్, పాల్గొన్నారు.

## ప్రజలకు మరింత మెరుగైన సేవలే లక్ష్యం



**ప్రజాపక్షం/గూడూరు:** మహబూబాబాద్ నియోజకవర్గంలోని గూడూరు మండల కేంద్రంలో స్మార్ట్ కార్డులు పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గూడూరు గ్రామపంచాయతీలో నిర్వహించిన ఈకార్యక్రమానికి డిప్యూటి తహశీల్ధార్ కోమల అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ హాజరై లబ్దిదారులకు స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత సులభంగా పారదర్శకంగా అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. స్మార్ట్ కార్డులు ద్వారా ప్రజలకు ప్రభుత్వ పథకాలు సేవలు మరింత సులభంగా పొందే అవకాశం కలుగుతుందని తెలిపారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వేగంగా ముందుకు తీసుకెళ్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజలకు ఉయోగపడే ప్రతి కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయడంలో స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులు భాగస్వాములు కావాలని కోరారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో విడుతలైన డ్రాఫ్ట ఓటరు జాబితాలో అర్హులైన ఓటర్ల పేరు లేకుంటే ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే మురళినాయక్ తెలిపారు.పేరు చేర్చుకోవడానికి ఫారం 6 ద్వారా తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా ప్రస్తుతం ఓటు హక్కులను కోల్పోతే భవిష్యత్తులో తిరిగి ఓటు హక్కును పోందడం 20 సంవత్సరాల వరకు కష్టమయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈకార్యక్రమం లో ఆర్ఐ భరత్ ఉపసర్పంచ్ చంటి స్వామి గ్రా మ కార్యదర్శి తిరుమల గూడూరు గ్రామపంచాయతీ పాలకవర్గం నాయకలు ప్రజలు పాల్గోన్నారు.

## కలెక్టర్ తెచ్చిన కొత్త యాప్‌ను రద్దు చేయాలి



**ప్రజాపక్షం/జనగామ:** ఐసిడిఎస్‌లో జనగామ జిల్లా కలెక్టర్ తీసుకొచ్చిన కొత్త రకమైన శిశు మహిళా సంవృద్ధి యాప్‌ను రద్దు చేయాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి జయలక్ష్మి డిమాండ్ చేశారు. సిఐటియు, అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్ఫర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వయించారు. అనంతరం అడిషన్ కలెక్టర్ బెన్షాలోమ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సంరద్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌హెచ్‌టిఎస్ కేంద్ర ప్రభుత్వ ఓషన్ ట్రాకర్ ఆఫ్ ద్వారా ఐసిడిఎస్‌లోని అంగన్‌వాడీ సేవలు అందిస్తున్నారని ఒకే రకమైన పనిని మూడు యాప్ చేయడం అంటే పని భార పెరగడమేనని జిలీల్లా కలెక్టర్ కొత్త రకమైన యాప్ తీసుకొచ్చి అంగన్‌వాడీల నిజాయితీని తప్పు పట్టే విధంగా, అవినీతిపరులుగా చిత్రీకరించే ప్రయత్నం జరుగుతుందన్నారు. ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్‌హెచ్‌టిఎస్, పోషన్ ట్రాకర్ 2 యాప్‌లను అంగన్‌వాడీ ఉదోయగులకు ఇచ్చారన్నారు. కొత్త యాప్‌ను జిల్లా కలెక్టర్ తీసుకురావడం సరియైంది కాదన్నారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరు కలెక్టరేట్ ముందు ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షులు సుంచు విజేందర్, అంజూమ్, జిల్లా ఉపాధ్యక్షులు పి బిక్షం, కొమ్ము మంగ, జి అమరావతి, సహాయ కార్యదర్శి ఎర్రవెల్లి సంతోష, వినోద, గందమల్ల జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ పంపిణీ పారదర్శకంగా జరిగే విధంగా చూడాలి: సిపిఐ వినతి

**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** మండలంలోని తమ్మడపల్లి జి గ్రామంలో రేషన్ పంపిణి పారదర్శకంగా జరిగే విధంగా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సీపీఐ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల తహశీల్దార్‌కి సీపీఐ గ్రామ కమిటీ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి వర్గ సభ్యులు, గ్రామ కార్యదర్శి వడ్లకొండ సుధాకర్ మాట్లాడుతూ గ్రామంలో రేషన్ కార్డు దారులకు రేషన్ పంపిణి తూకంలో వ్యత్యాసం, సమయ పాలన పాటించకుండా రేషన్ షాపుకు తిప్పుతూ కార్డు దారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు తక్షణమే స్పందించి రేషన్ పంపిణీలో అవకతవకలు లేకుండా సమయ పాలన పాటించే విధంగా తగు చర్యలు తీసుకోవాలన్నారు. లేదంటే సీపీఐ ఆధ్వర్యంలో ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వేల్పుల పెదరాములు, అజయ్, విష్ణు, బిక్షపతి, రాములు,పాల్గొన్నారు.

## హైవేపై కూలిన భారీ వృక్షం..



**ప్రజాపక్షం / రామడుగు :** కరీంనగర్ జగిత్యాల జాతీయ ప్రధాన రహదారిపై గురువారం భారీ వృక్షం ఆకస్మాత్తుగా కూలిపోవడంతో ట్రాఫిక్ జామ్ అయి కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ఈ సంఘటన మూలంగా గంటసేపు ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. వెంటనే గ్రామస్థుల ద్వారా విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ ఎలకపల్లి దేవమ్మ పాలకవర్గ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకొని పోలీసుల సహాయంతో కూలిన భారీ వృక్షాన్ని జెసిబితో తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు. దీంతో ప్రయాణీకులు ఊపిరి పీల్చుకున్నారు. సమయస్ఫూర్తితో యుద్ధ ప్రాతిపదికన రహదారిపై కూలిన భారీ వృక్షాన్ని తొలగించిన సర్పంచ్, వార్డు సభ్యులకు పోలీసులకు ప్రయాణికులతోపాటు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యార్థులు వేధింపులకు గురైతే నిర్భయంగా ఫిర్యాదు : ఎస్పీ

**ప్రజాపక్షం/ముస్తాబాద్:** జిల్లాలో విద్యార్థుల భద్రతను బలోపేతం చేయడమే లక్ష్యంగా జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆదేశాల మేరకు జిల్లా షీ టీమ్ ఆధ్వర్యంలో విద్యాసంస్థల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముస్తాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అవునూరు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకి అవగాహన కల్పించి , వేధింపులకు గురైతే వెంటనే నిర్భయంగా షీ టీమ్ నెంబర్ 87126 56425 కు ఫిర్యాదు చేయాలని, నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఫిర్యాదుదారుల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని షీ టీమ్‌అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ ఎస్ఐలు ప్రమీల,రవి , సిబ్బంది శ్రీలత, ప్రియాంక,శ్రీనివాస్‌తో పాటు పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పక్కాగా భూముల రీ సర్వే వివరాలు నమోదు: అదనపు కలెక్టర్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** భూ భారతి కింద భూములు రీ సర్వే వివరాలు పక్కాగా నమోదు చేయాలని అదనపు కలెక్టర్ గద్దం నగేష్ ఆదేశించారు.ఇల్లంతకుంట మండలం సిరికొండ గ్రామంలో భూ భారతి కింద రోవర్ యంత్రంతో భూముల రీ సర్వే పనులు కొనసాగుతుండగా, గురువారం అదనపు కలెక్టర్ క్షేత్రస్థాయిలో రెవెన్యూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, అటవీ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. సర్వే వివరాలు ఎలా తీసుకుంటారో పరిశీలించి.. అడిగి తెలుసుకున్నారు. అదనపు కలెక్టర్ గద్దం నగేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలో భూ భారతి కింద భూములు రీ సర్వే పనులు పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామంలో సర్వే పై రైతులకు ముందుగా సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాస్, తహసీల్దార్ సురేష్ అధికారులు సిబ్బంది ఉన్నారు.

## 'ఆల్ఫోర్స్' ఇ–టెక్నోలో రాఖీ వేడుకలు



**ప్రజాపక్షం / కొత్తపల్లి :** కొత్తపల్లిలోని ఆల్ఫోర్స్ ఇ – టెక్నో పాఠశాలలో ముందస్తు రాఖీ పౌర్ణమి వేడుకలు గురువారం అట్టహాసంగా నిర్వహించారు. రక్షాబంధన్ వేడుకలకు ముఖ్య అతిథిగా విద్యా సంస్థల అధినేత డా. వి.నరేందర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ భారతదేశంలో రక్షాబంధన్ పండగకు ప్రత్యేకత ఉందని మత సామరస్యాన్ని పెంపొందిస్తుందని తెలుపడంతోపాటు సోదరభావాన్ని పెంపొందిస్తుందన్నారు. వేడుకలలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేకంగా నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## కథలాపూర్‌లో అక్రమ మద్యం పట్టివేత



**ప్రజాపక్షం/కథలాపూర్ :** ఎక్సైజ్ అధికారులు భారీగా అక్రమ మద్యాన్ని తాండ్రియాల ఎక్స్ రోడ్డు వద్దచేపట్టిన తనిఖీలో పట్టుకున్నారు.ఎక్సైజ్ సిఐ వినోద్ రాథోడ్ తెలిపిన వివరాల ప్రకారం..ఇతర రాష్ట్రాల నుంచి తెలంగాణకు తరలిస్తున్న మద్యం స్వాధీనం చేసుకున్నామని, ప్రత్యేకంగా తయారు చేసిన వాహనంలో మద్యం తరలిస్తున్నారని తెలిపారు.మహారాష్ట్రలోని దాద్రా నగర్ హవేలీ,డామన్ దయ్యూ నుంచి ఈ మద్యాన్ని తెలంగాణకు తరలిస్తున్నట్లు తేలింది. అక్కడ రూ.2.80 లక్షల విలువ చేసే ఈ మద్యం, తెలంగాణలో రూ.6.98 లక్షలు ఉంటుందని తెలిపారు.బెల్ట్ షాపులే టార్గెట్గా ఈ దందా సాగుతోందని అన్నారు.మహారాష్ట్రలోని భివాండికి చెందిన ప్రవీణ్ పై ఎక్సైజ్ అధికారులు ఆధ్వర్యంలో నిఘా పెట్టి పట్టుకోవడం జరిగింది.

## సోదరి,సోదరుల అనురాగానికి ప్రతీక రక్షాబంధన్: మాజీ మంత్రి హరీష్‌రావు




**ప్రజాపక్షం/ సిద్దిపేట:** అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయత, అనుబంధానికి ప్రతీకగా నిలిచే పవిత్రమైన రక్షా బంధన్ పర్వదినం సందర్భంగా మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు గారు సిద్దిపేట జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.. ఈ సందర్భంగా మాట్లాడుతూ మానవ సంబంధాల్లోని పవిత్రమైన సహోదరభావాన్ని బలోపేతంచేసే పండగ రక్షా బంధన్ (రాఖీ పండగ) అని అన్నారు... సోదరభావంతో ప్రేమానురాగాలతో ప్రతి సంవత్సరం శ్రావణమాసం పౌర్ణమి నాడు, రాఖీలు కట్టుకుంటూ జరుపుకునే రాఖీ పండుగ, భారతీయ సంస్కృతీ సాంప్రదాయాల్లో అనాది నుంచి కొనసాగుతున్న గొప్ప ఆచారమని పేర్కొన్నారు.

## రజాకార్లను గడగడలాడించిన గడ్డ 'వీరబైరాన్‌పల్లి'

జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి

✲ 125 మంది అమరవీరుల త్యాగం చిరస్మరణీయం

**ప్రజాపక్షం/ సిద్ధిపేట/ మద్దూర్ :** రజాకార్ల రాక్షసత్వాన్ని ఎదిరించి 125 మంది ప్రాణత్యాగం చేసిన వీర బైరాన్‌పల్లి పోరాట చరిత్ర తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిందని జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆ మహనీయుల త్యాగఫలం భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. గురువారం బైరాన్‌పల్లిలో నిర్వహించిన అమరవీరుల స్మరణ దినోత్సవంలో పాల్గొని అమరవీరులకు ఘన నివాళులర్పించారు. 1948 ఆగస్టు 27న రజాకార్ల దాడిలో అమరులైన 125 మంది వీరుల త్యాగాలను ఎమ్మెల్యే స్మరించుకున్నారు. ఆయుధాలతో వచ్చిన నిజాం సైన్యాలను కారం పొడి, కట్టెలు, స్వయంగా తయారు చేసుకున్న మందుగుండు సామగ్రితో ఎదుర్కొన్న బైరాన్‌పల్లి ప్రజల ధైర్యసాహసాలు చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినవని అన్నారు. బైరాన్‌పల్లి పోరాటం చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు సైతం రక్షణగా నిలిచిందని పేర్కొన్నారు.



### అమరవీరుల కుటుంబాలకు ఘన సన్మానం

అమరవీరుల కుటుంబ సభ్యులతో పాటు తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న యోధులను ఘనంగా సన్మానించారు. బైరాన్‌పల్లి పోరాట చరిత్రను సేకరించి పుస్తక రూపంలో తీసుకొచ్చిన డాక్టర్ చందా రామయ్యను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. బైరాన్‌పల్లి పేరును 'వీర బైరాన్‌పల్లి'గా మార్చేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తానని పల్లా రాజేశ్వర్‌రెడ్డి హామీ ఇచ్చారు. గ్రామాన్ని చారిత్రక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడంతో పాటు శిథిలావస్థకు చేరిన బురుజును పునరుద్ధరించి స్మారక చిహ్నంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. గ్రామ అభివృద్ధికి వసతులకు ఆరు నెలల్లో నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానన్నారు.

### దేశవ్యాప్తంగా విద్యార్థులకు బైరాన్‌పల్లి చరిత్ర

వీర బైరాన్‌పల్లి పోరాట చరిత్రను తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా విద్యార్థులకు తెలిసేలా పాఠ్యాంశంగా చేర్చేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. అమరవీరుల కుటుంబాలకు తగిన గౌరవం, సహాయం అందేలా ప్రభుత్వంపై పోరాడతానన్నారు. 'అమరవీరుల రక్తంతో తడిసిన ఈ పవిత్ర గడ్డ.. భావితరాలకు పోరాట స్ఫూర్తిని అందించాలి' అని పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆకాంక్షించారు.

## కొండ్ర ప్రమీల సేవలు మరువలేనివి

సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సిపిఐ నాయకురాలు కొండ్ర ప్రమీల సేవలు మరువలేనివని ఆమె మరణం పార్టీకి తీరని లోటు అని సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం అన్నారు. గురువారం రోజున ఎఐటి యుసి సీనియర్ నాయకులు కామ్రేడ్ కొండ్ర సత్యనారాయణ సతీమణి కామ్రేడ్ కొండ్ర ప్రమీల అనారోగ్యం తో బాధపడుతూ గురువారం తన స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ప్రమీల మరణ వార్త విని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి ప్రమీల పార్థివ దేహం పై పూలమాలలు వేసి నివాళులర్పించారు.ప్రమీల మృతి బాధాకరమని,వారి మృతి పట్ల సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి సంతాపం వ్యక్తం చేస్తుందని, వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్నానని స్వామి పేర్కొన్నారు. నివాళులు అర్పించిన వారిలో సిపిఐ నాయకులు కే కనకరాజ్, గౌతమ్ గోవర్ధన్, ఎం ఏ గౌస్,కందుకూరి రాజారత్నం, స్వామి ,రామలింగం, జోసెఫ్ సిపిఐ ప్రజా సంఘాల నాయకులు కన్నం లక్ష్మీ నారాయణ,ఏజ్జ రాజయ్య,తదితరులు ఉన్నారు.

## లక్ష్య సాధనకు కృషి, పట్టుదల అవసరం

జగిత్యాల రూరల్ సిఐ సుధాకర్

**ప్రజాపక్షం/జగిత్యాల :** కృషి పట్టుదల ఉంటే మనం అనుకున్న లక్ష్యాన్ని సాధించగలుగుతామని జగిత్యాల రూరల్ సిఐ దామెర సుధాకర్ అన్నారు.వాల్మీకి ఆవాసం సేవా భారతి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత పోలీసు శిక్షణ శిబిరాన్ని రూరల్ సిఐ సుధాకర్ సందర్శించి అభ్యర్థులకు పలు సూచనలు చేశారు. ప్రణాళికాబద్ధంగా చదవడంతో పాటు శారీరక కార్యక్రమాలను నిరంతరంగా కొనసాగించినట్లయితేనే పోటీ పరీక్షలో విజయం సాధించగలుగుతారని వివరించారు.ఈ మూడు నెలల కాలంలో ఎలాంటి ఆకర్షణలకు లోను కాకుండా ఉద్యోగం సాధించాలనే పట్టుదల ఉండాలన్నారు. పోలీసు వృత్తి అనేది సమాజంలో ఒక బాధ్యత గల ఉద్యోగం అని దీన్ని సాధించడానికి శారీరక శ్రమతో పాటు విషయ పరిజ్ఞానం, క్రమశిక్షణ కఠోర పరిశ్రమ కూడా అవసరమని తెలిపారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో వాల్మీకి



ఆవాసం ద్వారా హైదరాబాద్ స్థాయిలో శిక్షణనిస్తున్నారని దీన్ని సద్వినియోగం చేసుకొని పోలీసు ఉద్యోగం సాధించాలని ఆకాంక్షించారు. దేశ సేవ,సమాజ సేవ చేయాలనే ఉద్దేశంతో శిక్షణ పొందడానికి వచ్చిన యువకులు క్రమశిక్షణతో,ప్రణాళికాబద్ధంగా చదువుకొని లక్ష్యాన్ని సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో సేవా భారతి జిల్లా అధ్యక్షులు ఎస్పి సుబ్రహ్మణ్యం, వాల్మీకి ఆవాస కార్యదర్శి మదన్మోహన్రావు, కమిటీ సభ్యులు సంపూర్ణ చారి, చంద్రశేఖర్, బొమ్మెర సత్యనారాయణ, సురేష్ ,సుమన్ ,తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ





**ప్రజాపక్షం/రుద్రంగి /వేములవాడ/రాజన్న సిరిసిల్ల :** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గ పరిధిలోని రుద్రంగి మండల కేంద్రంలో అర్హులైన లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ గురువారం స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ప్రజా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. నూతనంగా అందిస్తున్న స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అర్హులైన లబ్ధిదారులకు మరింత పారదర్శకంగా, వేగవంతంగా, సులభంగా సంక్షేమ ఫలాలు అందుతాయని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రతి పేద కుటుంబానికి అండగా ఉంటామని ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

### ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణంలో శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప దేవస్థాన ట్రస్టు ఆధ్వర్యంలో 5 రోజులగా నిర్వహిస్తున్న కోటి కుంకుమ అర్చన, ఉచిత సామూహిక సత్యనారాయణ వ్రత కార్యక్రమాల్లో రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, ట్రస్టు సభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను సన్మానించారు. ప్రజలందరూ ఆధ్యాత్మిక భావనతో, భక్తిశ్రద్ధలతో కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని విప్ ఆకాంక్షించారు.

## వేగంగా రీసర్వే పనులు పూర్తి : కలెక్టర్

**ప్రజాపక్షం /ఇబ్రహీంపట్నం :** భూ సర్వే రీ సర్వే పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం బర్థిపూర్‌లో నాన్ కెడస్ట్రాల్, ఎంజాయ్‌మెంట్ రీ సర్వే పనులను జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.రీ సర్వేను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆర్డిఒనరసింహారావు,తహసీల్దార్ వరప్రసాద్ రెవెన్యూ అధికారులు,సర్వేయర్లు పాల్గొన్నారు.

### పారదర్శకంగా ఓటర్ల జాబితా సవరణ

ఓటర్ల జాబితా సవరణ పారదర్శకంగా నిబంధనల మేరకు జరగాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ అన్నారు.ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద గురువారం నిర్వహించిన ఎస్ఐఆర్ ముసాయిదా గ్రామసభలో కలెక్టర్ పాల్గొని ఓటర్ల జాబితా పరిశీలన ప్రక్రియను సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూఅర్హులైన ఏ ఒక్క ఓటరు పేరు తొలగిపోకుండా జాగ్రత్త వహించాలని, మరణించిన, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిన వారి వివరాలను నిబంధనల ప్రకారం తొలగించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వరప్రసాద్, ఎంపిడిఒ సిహెచ్.గణేష్, ఎంపిఒ రామకృష్ణ రాజు, స్థానిక సర్పంచ్ బద్దం గోపి, ఉప సర్పంచ్ నాంపల్లి రమేష్,విండో చైర్మన్ జిల్లాల పవన్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ శ్రీకాంత్ రెడ్డి, మేజర్ పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ గౌడ్,గ్రామ పరిపాలన అధికారి తిరుపతి, బిఎల్ఒలు,అధికారులు,ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## వరదవెల్లి దత్త క్షేత్రానికి బోట్ పునః ప్రారంభం

ఎమ్మెల్యే డా.మేడిపల్లి సత్యం

**ప్రజాపక్షం / గంగాధర :** బోయినపల్లి మండలం వరదవెల్లి గ్రామంలోని శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయానికి నిత్య పూజలు, భక్తుల దర్శనాల కోసం బోట్ సౌకర్యాన్ని చొప్పదండి శాసన సభ్యుడు డా.మేడిపల్లి సత్యం గురువారం పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోట్‌లో ప్రయాణించి ఆలయానికి చేరుకొని అనంతరం శ్రీ దత్తాత్రేయ స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మిడ్ మానేరు జలాశయం బ్యాక్ వాటర్‌తో ఆలయం చుట్టూ నీరు చేరడంతో భక్తులు దర్శనానికి ఇబ్బందులు పడుతున్నారని గ్రహించి బోట్ సేవలను పునరద్ధరించారు. గతంలోనూ భక్తుల దర్శనం కోసం బోట్‌సౌకర్యం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. బోట్ సౌకర్యం పునః ప్రారంభం కావడంతో ఆలయంలో నిత్య పూజలు సక్రమంగా కొనసాగడంతో పాటు స్వామివారిని దర్శించుకునే భ



క్తులకు ప్రయాణ సౌకర్యం కలగనుంది. భక్తుల భద్రతకు అవసరమైన లైవ్ జాకెట్లు తదితర రక్షణ ఏర్పాట్లతో బోట్‌లో ఎమ్మెల్యే ప్రయాణించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాశస్త్యాన్ని భక్తుల విశ్వాసాలను దృష్టిలో ఉంచుకొని దత్తాత్రేయ స్వామి ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, ఆలయ నిర్వాహకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కు ప్రాధాన్యతను గుర్తించాలి

జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్

**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రధానమైన ఆయుధమని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు ప్రాధాన్యతను గుర్తించి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ లో భాగస్వాములు కావాలని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అన్నారు.ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ గ్రామంలో గురువారం నిర్వహించిన ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై గ్రామసభలో ఎమ్మెల్యే పా



ల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగిత్యాల నియోజకవర్గంలో సుమారు 81 వేల ఓట్లు నమోదు కాలేదని వారు తెలిపారు.ప్రజాప్రతినిధులు, అధికారులు బాధ్యత తీసుకుని ఓటరు మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆయన అధికారులకు సూచించారు.ఓటరు జాబితాలో తమ పేరు లేకపోతే ప్రజలు సంబంధిత ధ్రువపత్రాలను బూత్ స్థాయి అధికారులకు (బిఎల్ఒలకు) అందజేసి ఓటరుగా నమోదు చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గజంగి నందయ్య శ్రీనివాస్, రెవెన్యూ డివిజనల్ అధికారి మధుసూదన్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి విజయలక్ష్మి, మండల రెవెన్యూ అధికారి రామ్మోహన్,మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దామోదర్ రావు,ఉప సర్పంచ్ బాలే శ్రీనివాస్,వార్డు సభ్యులు,మాజీ సర్పంచ్ ప్రభాకర్,మాజీ ఉప సర్పంచ్ మహేష్, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నరేష్, నాయకులు,ప్రజలు,పాల్గొన్నారు.

## ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

ఉద్యోగుల మహాధర్నాకు మాజీ మంత్రి జీవన్ రెడ్డి సంఘీభావం

**ప్రజాపక్షం/జగిత్యాల :** ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని లేకుంటే ,డిమాండ్లు సాధించేవరకు పోరాటాన్ని ఉదృతం చేయాలనీ బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీమంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి ఉద్యోగులకు పిలుపునిచ్చారు.జిల్లా ఉద్యోగ జెఎసి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం జిల్లా కలెక్టరేట్ ఎదుట చేపట్టిన మహా ధర్నా శిబిరాన్ని మాజీ మంత్రి, బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి సందర్శించి సంఘీభావం తెలిపారు. ఆయనతో పాటు కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్,తొలి జెడ్పి చైర్పర్సన్ దావా వసంతలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. పిఆర్‌సిఅనేది ఇంక్రిమెంట్ కాదని, మార్కెట్ ధరలకు అనుగుణంగా ఇవ్వాల్సి ఉండగా,పిఆర్‌సి తో పాటు 6 డిఎలు పెండింగ్‌లో పెట్టడం బాధాకరమన్నారు.ఒపిఎస్ అమలుపై శాసన మండలిలో తాను మాట్లాడానని, ఉద్యోగులు చెల్లిస్తున్న 10 శాతం, ప్రభుత్వం చెల్లిస్తున్న 10 శాతం ఎటు పోతుందో చెప్పాలన్నారు. జాబ్ క్యాలెండర్ జాడ లేదని, 17 వేల ఉద్యోగాలు భర్తీ చేసి 70 వేలు భర్తీ చేశామని



గొప్పలు చెప్పుకుంటున్నారని తెలిపారు. విశ్రాంత ఉద్యోగులను రోడ్ల మీదకు తెచ్చిన ఈ ప్రభుత్వానికి చీకటి రోజులు తప్పవని చెప్పారు.కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతూ రాబోయే బిఆర్ఎస్ సర్కారులో మొదటి సంతకం ఉద్యోగుల సమస్యల పరిష్కారంపైనేకెసిఆర్ పెడతారని ఉద్యోగులకు బిఆర్ఎస్ ఎల్లప్పుడూ అండ గా ఉంటుందని ఆయన తెలిపారు.దావ వసంత మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు.ధర్నాలో టిఎన్‌జిఒఅధ్యక్షుడు నాగేందర్ రెడ్డి,పిఆర్‌టియు జిల్లా అధ్యక్షుడు బోయినిపెల్లి ఆనందరావు, కార్యదర్శి యాళ్ల అమర్నాథ్ రెడ్డి,నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు క్యారంగుల అరుణ,ఉమ్మడి నారాయణ,చిర్ర సతీష్,భైరం హరికిరణ్,అన్ని శాఖల ఉద్యోగులు, ఉన్నారు.

## ఉద్యోగుల సమస్యల పరిష్కారానికే మహా ధర్నా

తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ బొంకూరి శంకర్, కన్వీనర్ తూము రవీందర్ పటేల్

**ప్రజాపక్షం/పెద్దపల్లి:** ప్రజా ప్రభుత్వం ఏర్పడి మూడు సంవత్సరాలు కావస్తున్న తమ సమస్యలను పరిష్కరించడంలో కాలయాపన చేస్తుందని, తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ, టిఎన్‌జిఒస్ పిలుపుమేరకు గురువారం రోజున పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు భారీ ధర్నా నిర్వహించారు.జిల్లా నలుమూలల నుంచి భారీ సంఖ్యలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కార్మికులు తరలివచ్చి ఉద్యమానికి తమ సంఘీభావాన్ని తెలియజేశారు.ఈ సందర్భంగా చైర్మన్ బొంకూరి శంకర్, కన్వీనర్ తూము రవీందర్,జిల్లా కార్యదర్శి ఐరెడ్డి సందీప్ రెడ్డి లు మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం ఇకనైనా సానుకూలంగా స్పందించాలని డిమాండ్ చేశారు.పిఆర్‌సి అమలు,పెండింగ్‌లో ఉన్న ఆరు డిఎలు విడుదల, సిపిఎస్ రద్దు చేసి ఒపి ఎస్ పునరుద్ధరణ, పెండింగ్ బిల్లుల చెల్లింపు,హెల్త్ కార్డుల సమర్థవంతమైన అమలు, ఉపాధ్యాయుల బదిలీలు,పదోన్నతులు, జిఒ25 సవరణ, జిఒ190 అమలు వంటి ప్రధాన సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఉద్యమం ఎవరికీ వ్యతిరేకం కాదని,ఉద్యోగుల హక్కుల సాధన కోసమేనని, ఈ రోజు ప్రదర్శించిన ఐక్యత సెప్టెంబర్ 1న నిర్వహించే పెన్షన్ విద్రోహ దినం, అలాగే రాష్ట్రవ్యాప్త తదుపరి ఉద్యమ కార్యక్రమాలకు మరింత బలాన్నిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో టిఎన్‌జిఒరాష్ట్ర నాయకుడు సందీప్ రావు, టిఎన్‌జి ఒఅసోసియేట్ అధ్యక్షుడు గోపు అనిత,కోశాధికారి కొమురయ్య, జిల్లా సంఘ బాధ్యులు,జిల్లా అధికారుల సంఘం అధ్యక్షుడు ప్రవీణ్ రెడ్డి,పెన్షనర్స్ సంఘం కార్యదర్శి రాజంరాజు,సురేందర్, పి ఆర్ టి యు అధ్యక్ష, కార్యదర్శులు జి కృష్ణమూర్తి,కానుగంటి శ్రీనివాస్, టీఎస్ యుటిఎఫ్ అధ్యక్ష,కార్యదర్శులు కే కుమారస్వామి, కాంపెల్లి లక్ష్మణ్, ఎస్ టి యు అధ్యక్ష, కార్యదర్శులు ఎన్ సంతోష్,ఎం సతీష్, డిటిఎఫ్ అధ్యక్ష,కార్యదర్శులు రామ్ కిషన్ రావు, సంతోష్ రెడ్డి,టి ఆర్ టి ఎఫ్ అధ్యక్ష,కార్యదర్శులు జి శ్రీనివాస్,కే సంతోష్ కుమార్,టిపిటిఎఫ్ అధ్యక్ష,కార్యదర్శులు సిహెచ్ పోచయ్య,పరుశరాములు,టి పి టి యు రాష్ట్ర బాధ్యులు సారయ్య,మహేందర్,ఆర్ యు పి పి అధ్యక్ష,కార్యదర్శులు సత్తు కనకయ్య,సమీ ఉల్లా ఖాన్, టి ఎస్ టియు అధ్యక్ష,కార్యదర్శులు,పిఇ టివి అధ్యక్ష, కార్యదర్శులు, బిటిఎఫ్ అధ్యక్షులు ,,జిల్లాలోని టిఎన్ జిఒస్ అన్ని శాఖల అధ్యక్ష కార్యదర్శులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ విద్యార్థుల ధర్నాలో ఉద్రిక్తత

**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్:** పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తును అగమ్య గోచరం చేసే జిఒ నెంబర్ 97ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం బిఆర్ఎస్వి ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ విద్యార్థులు కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయం వద్దకు చేరుకున్న విద్యార్థి సంఘం నాయకులు పాలిటెక్నిక్ విద్యార్థులు నినాదాలతో నిరసన తెలిపారు. విద్యార్థి సంఘం నాయకులు గేటు దూకి గేట్ లాక్ ఓపెన్ చేయడంతో ఒక్కసారిగా విద్యార్థులు లోపలికి చొచ్చుకుపోయారు. పోలీసులు ఆపే ప్రయత్నం చేసినప్పటికీ విద్యార్థులు ఒక్కసారిగా పరిగెత్తుకు వచ్చి కలె



క్టర్ కార్యాలయం లోపలికి వెళ్లి కలెక్టర్ చాంబర్ వద్ద ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం నాయకులు, విద్యార్థులు మాట్లాడుతూ తమ చదువుల కోసం తమ భవిష్యత్తు కోసం ప్రశ్నిస్తే అరెస్టులు చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్వి నాయకులు , తదితరులు పాల్గొన్నారు.

# ఖర్గే సభా ప్రాంగణంలో 'శుద్ధీకరణ'కు సమర్ధన

ఉత్తరాఖండ్ బిజెపి అధ్యక్షుడిపై కాంగ్రెస్ విమర్శలు



న్యూఢిల్లీ : ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సభ నిర్వహించిన ప్రాంగణంలో జరిగిన 'శుద్ధీకరణ' కార్యక్రమాన్ని రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు మహేంద్ర భట్ సమర్థించారని కాంగ్రెస్ ఆరోపించింది. అంటరానితనాన్ని సమర్థించినందుకు ఆయనపై చర్యలు తీసుకుంటారా? అని బిజెపిని ప్రశ్నించింది. ప్రతిపక్షాల విమర్శలను తోసిపుచ్చుతూ భట్ మాట్లాడుతూ.. మతపరమైన ప్రదేశంలో చేయకూడని నినాదాలతో ఆ ప్రాంగణం అపవిత్రమైందని చెప్పినట్లు సమాచారం. భట్ వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోను కాంగ్రెస్ మీడియా, ప్రచార విభాగం అధిపతి పవన్ ఖేరా 'ఎక్స్'లో పంచుకున్నారు. 'ఖర్గే జీ సభ తర్వాత హల్ద్వానీలో జరిగిన శుద్ధీకరణ కార్యక్రమం దురదృష్టకరమని నడ్డా జీ చెప్పినా ప్రయోజనం లేదు. వివక్ష ఆర్ఎస్ఎస్‌బిజెపిల నరనరాల్లో రక్తంలా ప్రవహిస్తోంది' అని ఖేరా విమర్శించారు. ఇప్పుడు ఉత్తరాఖండ బిజెపి అధ్యక్షుడే ఆ శుద్ధీకరణను సమర్థించారని ఆయన అన్నారు.

'21వ శతాబ్దంలోనూ దళితులు ఇలాంటి అమానవీయ ఆచారాలకు గురవుతుండటం విషాదకరం. దేశంలోని ప్రముఖ దళిత నాయకుల్లో ఒకరైన, రాజ్యసభలో ప్రతిపక్ష నేత అయిన వ్యక్తికే ఇలా జరిగితే.. సాధారణ దళితుల రోజువారీ పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు' అని ఖేరా పేర్కొన్నారు. 'తమ రాష్ట్ర అధ్యక్షుడే బహిరంగంగా అంటరానితనాన్ని సమర్థించిన నేపథ్యంలో బిజెపి ఆయనపై చర్యలు తీసుకుంటుందా? మోదీ ఆయనను పదవి నుంచి తొలగిస్తారా? అలా చేయకపోతే దళితుల పట్ల ఐక్యత, గౌరవం గురించి మోదీ చేస్తున్న గొప్ప ప్రసంగాలు మరో రాజకీయ ప్రదర్శన మాత్రమే' అని ఖేరా వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధి, సోషల్ మీడియా విభాగం అధిపతి సుప్రియా శ్రీనతే కూడా భట్ వ్యాఖ్యల వీడియోను 'ఎక్స్'లో పంచుకున్నారు. 'హల్ద్వానీలో కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే సభ తర్వాత జరిగిన శుద్ధీకరణ కార్యక్రమాన్ని భట్ సమర్థిస్తున్నారు'' అని ఆమె పేర్కొన్నారు. 'ఇదే అసలైన బిజెపి. దళితుల పట్ల వారి మనసుల్లో ఉన్న ద్వేషం ఇదే. మిగతాదంతా కేవలం మాటలకే పరిమితం' అని శ్రీనతే విమర్శించారు.

హల్ద్వానీలోని సభా ప్రాంగణంలో జరిగిన 'శుద్ధీకరణ'ను కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ గత వారం తీవ్రంగా ఖండించిన విషయం తెలిసిందే. ఈ ఘటన పూర్తిగా ఆమోదయోగ్యం కాదని పేర్కొంటూ, ప్రధాని నరేంద్ర మోదీ మౌనంగా ఉండటాన్ని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ప్రశ్నించారు. ఈ అంశంపై మోదీ క్షమాపణ చెప్పాలని సిడబ్ల్యుసి డిమాండ్ చేసిందని ఆయన తెలిపారు. 'లక్షలాది మంది సమక్షంలో నేను ఉత్తరాఖండ్‌కు వెళ్లి ప్రసంగిస్తే, రెండు రోజుల తర్వాత మీరు శుద్ధీకరణ కార్యక్రమం నిర్వహిస్తారు. అందుకే మీరు మత వ్యతిరేకులు' అని ఖర్గే వ్యాఖ్యానించారు. ఈనెల 8న ఖర్గే హల్ద్వానీలోని రాంలీలా మైదానంలో బహిరంగ సభలో ప్రసంగించారు. ఆ సభ జరిగిన ప్రాంగణంలోనే శుద్ధీకరణ కార్యక్రమం నిర్వహించినట్లు ఆరోపణలు వచ్చాయి. శుద్ధీకరణ కార్యక్రమం నిర్వహించిన శ్రీరామ్ సేనకు బిజెపితో సంబంధాలు ఉన్నాయని ఉత్తరాఖండ్ కాంగ్రెస్ అధ్యక్షుడు గణేశ్ గోదియాల్ ఆరోపించారు. అయితే అధికార బిజెపి ఈ ఆరోపణను ఖండించింది.

**నేపాల్ వరద బాధితులకు కేంద్రం సాయం అందించాలి**

**బెంగళూరు:** నేపాల్‌లో సంభవించిన తీవ్ర వరదల్లో నష్టపోయిన వారికి కేంద్ర ప్రభుత్వం తక్షణ సాయం అందించాలని ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కోరారు. ఈ విపత్కర పరిస్థితుల్లో దేశం మొత్తం ఐక్యంగా నిలవాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. వరదల్లో ప్రాణాలు కోల్పోయిన వారి మృతిపై తీవ్ర విచారం వ్యక్తం చేసిన రాజ్యసభలో ప్రతిపక్ష నేత ఖర్గే, ఈ అంశంపై ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాస్తానని తెలిపారు. 'నేపాల్‌లో భారీ విషాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో పలువురు భారతీయులు ప్రాణాలు కోల్పోయారు. తీర్థయాత్రలు, పర్యటనల కోసం అక్కడికి వెళ్లిన వందలాది మంది మరణించారు. ఈ ఘటన మనందరినీ తీవ్రంగా కలచివేసింది. ఈ కష్టకాలంలో మనమంతా కలిసికట్టుగా నిలవాలి' అని ఖర్గే గురువారం విలేకరులతో మాట్లాడుతూ అన్నారు.

## ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థిని హత్య

**న్యూఢిల్లీ:** ఢిల్లీ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ ఓపెన్ లెర్నింగ్ (ఎస్ఓఎల్)లో రెండో సంవత్సరం చదువుతున్న 21 ఏళ్ల విద్యార్థినిని పశ్చిమ ఢిల్లీలోని తిలక్ నగర్‌లో ఆమె ఇంట్లోనే పలుమార్లు కత్తితో పొడిచి హత్య చేశారు. ఆమె మరో వ్యక్తితో మాట్లాడిందనే ఆగ్రహంతో ఈ హత్య జరిగి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితుడిని 26 ఏళ్ల ఇమ్రాన్‌గా గుర్తించారు. అతడు పరారీలో ఉండగా, అతని కోసం పోలీసులు 15కు పైగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. పోలీసుల దర్యాప్తు ప్రకారం.. వేరే సామాజిక వర్గానికి చెందిన బాధితురాలికి ఇమ్రాన్‌తో సుమారు ఏడాదిన్నరగా పరిచయం ఉంది. గతంలో జిమ్ ట్రైనర్‌గా పనిచేసిన అతడు ప్రస్తుతం నిరుద్యోగిగా ఉన్నాడు. ఆమె మరో వ్యక్తితో మాట్లాడుతున్నందుకు గత రెండు నెలలుగా ఇమ్రాన్ ఆగ్రహంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. బుధవారం ఆమె ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో అక్కడికి వెళ్లిన అతడితో వాగ్వాదం జరిగింది. అనంతరం కత్తితో దాడి చేసి పరారైనట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. సిసిటివి దృశ్యాల్లో నిందితుడు సాయంత్రం 5.40 గంటల సమయంలో భవనంలోకి ప్రవేశించినట్లు కనిపించింది. రాత్రి 7.24 గంటలకు పోలీసులకు సమాచారం అందింది. ఇంటి పనిమనిషి రెండో అంతస్తులో గాయాలతో పడి ఉన్న విద్యార్థినిని గుర్తించి కుటుంబ సభ్యులకు తెలిపింది. ఆసుపత్రికి తరలించగా, అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. బాధితురాలి సోదరుడి ఫిర్యాదుతో హత్య కేసు నమోదు చేశారు. నిందితుడి ఆచూకీపై పోలీసులకు కీలక సమాచారం లభించిందని, త్వరలోనే అతడిని అరెస్టు చేస్తామని అధికారులు తెలిపారు. నిందితుడు, బాధితురాలు వేర్వేరు సామాజిక వర్గాలకు చెందినవారు కావడంతో పోలీసులు ఆ ప్రాంతంలో భద్రతను పెంచారు. ఘటనకు ముందు, తర్వాత నిందితుడి కదలికలను తెలుసుకునేందుకు సిసిటివి దృశ్యాలను పరిశీలిస్తున్నారు.

## రూ.36 వేల కోట్ల 'షుగర్ స్కామ్'కు కేంద్ర ప్రభుత్వ సహకారం

కాంగ్రెస్ ఆరోపణ



**న్యూఢిల్లీ:** పండుగల సీజన్‌లో చక్కెర ధరలు పెరగడంతో నిల్వదారులు, బ్లాక్ మార్కెట్ వ్యాపారులకు లాభం చేకూర్చేలా మోదీ ప్రభుత్వం రూ.36 వేల కోట్ల చక్కెర కుంభకోణానికి సహకరిస్తోందని కాంగ్రెస్ గురువారం ఆరోపించింది. ఢిల్లీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రణదీప్ సూర్జేవాలా మాట్లాడుతూ, దేశంలో చక్కెర కొరత ఏర్పడే అవకాశం ఉందని ప్రభుత్వానికి ఏప్రిల్‌లోనే తెలుసని, అయినప్పటికీ చర్యలు తీసుకోకుండా మౌనంగా ఉండటంతో కిలో చక్కెర ధర రూ.40 నుంచి రూ.75కు పెరిగిందని ఆరోపించారు. ఆగస్టు నుంచి నవంబర్ మధ్య దేశంలో సుమారు 1.2 కోట్ల టన్నుల చక్కెర వినియోగం ఉంటుందని, ఈ పరిస్థితుల్లో వినియోగదారులు కిలోకు కనీసం మరో రూ.30 అదనంగా చెల్లించాల్సి వస్తుందని ఆయన అన్నారు. 'దసరా, దీపావళి వేడుకల సమయంలో ప్రజలు పెరిగిన చక్కెర ధరల భారాన్ని మోయాల్సి వస్తుంది. 1.2 కోట్ల టన్నుల చక్కెరపై కిలోకు రూ.30 అదనపు భారం పడితే రూ.36 వేల కోట్ల మొత్తం నిల్వదారులు, బ్లాక్ మార్కెట్ వ్యాపారులకు నేరుగా చేరుతుంది. అధికారంలో ఉన్న వారితో ఇంతకంటే పెద్ద కుంభకోణం ఏముంటుంది?' అని సూర్జేవాలా ప్రశ్నించారు. ఉత్పత్తి తగ్గడం, నిల్వలను దారి మళ్లించడం వల్ల పండుగల సమయంలో చక్కెర ధరలు పెరిగాయని ఆయన ఆరోపించారు. ఇది లాభాపేక్ష వ్యాపారులు, బ్లాక్ మార్కెట్ వ్యాపారుల ద్వారా ప్రజలను బహిరంగంగా దోచుకోవడానికి మోదీ ప్రభుత్వం రూపొందించిన కొత్త వ్యూహమని విమర్శించారు. చక్కెర ధరలు పెరగడం వల్ల మధుమేహం తగ్గుతుందని, పెట్రోల్‌లో చక్కెర కలిపారని బిజెపి నేతలు ప్రజలకు సలహాలు ఇస్తున్నారని సూర్జేవాలా ఎద్దేవా చేశారు. రైతులకు గిట్టుబాటు ధరలు లభించకపోవడంతో చెరకు సాగు తగ్గిందని, వ్యవసాయ అభివృద్ధిపై ప్రభుత్వం చేస్తున్న వాదనలు క్షేత్రస్థాయిలో విఫలమయ్యాయని అన్నారు. 2025 నవంబర్ నుంచి 2026 జులై వరకు చెరకు నిల్వల్లో 32 శాతాన్ని ఈ20 ఇంధన ఉత్పత్తికి వినియోగించారని, దీనివల్ల మార్కెట్‌లో ప్రజలకు అందుబాటులో ఉన్న చక్కెర నిల్వలు తగ్గాయని సూర్జేవాలా పేర్కొన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా కుటుంబంలోని ప్రతి సభ్యుడికి 500 గ్రాముల చక్కెరను సబ్సిడీ ధరకు అందించే పాత పథకాన్ని పునరుద్ధరించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## విస్తరిస్తున్న భారత్–జర్మనీ ఆర్థిక సంబంధాలు

సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్




**న్యూఢిల్లీ:** భారత్, జర్మనీ మధ్య ఆర్థిక సంబంధాలు గణనీయంగా, వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో అంతర్జాతీయ వాణిజ్యంలో పరస్పర విశ్వాసం మరింత కీలకమవుతోందని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ (సిజెఐ) సూర్యకాంత్ అన్నారు. వివాదాలను వేగంగా, నిష్పక్షపాతంగా పరిష్కరించే బలమైన మధ్యవర్తిత్వ (ఆర్బిట్రేషన్) వ్యవస్థ విశ్వసనీయ వాణిజ్య వాతావరణాన్ని నిర్మించగలదని ఆయన పేర్కొన్నారు. జర్మనీలోని బెర్లిన్‌లో జరిగిన ఇండో–జర్మన్ ఆర్బిట్రేషన్ కాన్క్లేవ్‌లో సిజెఐ ప్రసంగించారు. వాణిజ్య కార్యకలాపాల్లో వివాదాలు సహజమేనని, వాటి ఉనికి వల్ల వ్యాపార భాగస్వాముల మధ్య విశ్వాసం దెబ్బతిన్నట్లు భావించాల్సిన అవసరం లేదని అన్నారు. వివాదాలు తలెత్తినప్పుడు వ్యాపార సంబంధాలకు నష్టం కలగకుండా వాటిని పరిష్కరించే విశ్వసనీయ న్యాయ వ్యవస్థ ఉండటం ముఖ్యమని చెప్పారు. భారత్‌లో జర్మనీ పెట్టుబడులు కీలక రంగాల్లో విస్తరిస్తున్నాయని, అదే సమయంలో భారతీయ కంపెనీలు జర్మనీ మార్కెట్‌లోకి మరింతగా ప్రవేశిస్తున్నాయని సూర్యకాంత్ తెలిపారు. మౌలిక వసతులు, సాంకేతిక ఒప్పందాలు, జాయింట్ వెంచర్లు, దీర్ఘకాలిక సరఫరా ఒప్పందాలు, సరిహద్దులు దాటి పెట్టుబడులు పెరుగుతున్న కొద్దీ ఒప్పందాలు కూడా సంక్లిష్టంగా మారుతున్నాయని చెప్పారు. సమర్థవంతమైన ఆర్బిట్రేషన్ సంస్థలు, నైపుణ్యం కలిగిన మధ్యవర్తులు, అవసరమైన సందర్భాల్లో మాత్రమే జోక్యం చేసుకునే న్యాయస్థానాలు ఈ వ్యవస్థకు అవసరమని సిజెఐ అన్నారు. కోర్టుల జోక్యం వల్ల మధ్యవర్తిత్వ ప్రక్రియ ఆలస్యం కాకూడదని స్పష్టం చేశారు. భారత్ ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ సెంటర్, ముంబై సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్, నాని పాల్ఖివాలా ఆర్బిట్రేషన్ సెంటర్ వంటి భారత సంస్థలు జర్మన్ ఆర్బిట్రేషన్ సంస్థలు, ముఖ్యంగా డిఐఎస్‌తో సహకారాన్ని పెంచుకోవచ్చని ఆయన సూచించారు. ఇరు దేశాల ఆర్బిట్రేషన్ సంస్థలు సంయుక్త కార్యక్రమాలు, న్యాయ నిపుణుల మార్పిడి, శిక్షణ, పరిశోధన, వృత్తిపరమైన కార్యక్రమాలను నిర్వహించాలని సూర్యకాంత్ సూచించారు. ఇలాంటి సహకారం వల్ల రెండు దేశాల న్యాయ వ్యవస్థలపై అవగాహన పెరిగి, సరిహద్దులు దాటి వ్యాపారం చేసే సంస్థలకు మరింత నమ్మకం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

## చక్కెర ధరల పెరుగుదలపై విజయవర్గీయ అనుచిత వ్యాఖ్యలు

సిపిఐ (ఎం) ఆగ్రహం



**భోపాల్:** చక్కెర ధరల పెరుగుదలపై మధ్యప్రదేశ్ మంత్రి కైలాశ్ విజయవర్గీయ అనుచిత వ్యాఖ్యలు చేశారని సిపిఐ(ఎం) ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆయన వ్యాఖ్యలు బాధలో ఉన్న ప్రజల గాయంపై ఉప్పు చల్లినట్లుగా ఉన్నాయని, బిజెపి అసలు వైఖరిని బయటపెట్టాయని విమర్శించింది. బుధవారం విజయవర్గీయ మాట్లాడుతూ చక్కెర ధరలు మరింత పెరగాలని, వృద్ధులు, 40 ఏళ్లు పైబడిన వారు పూర్తిగా చక్కెర తీసుకోవడం మానేయాలని సూచించారు. ప్రస్తుతం 90 శాతం మంది ప్రజలు స్వీట్లను ఇష్టపడటం లేదని, తాను కూడా వాటికి దూరంగా ఉంటానని చెప్పారు. రాఖీ పండుగ సమయంలో చక్కెర ధరలు పెరగడం, దీనిపై విజయవర్గీయ చేసిన వ్యాఖ్యలు ప్రజల మనోభావాలను దెబ్బతీశాయని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జస్వందర్ సింగ్ అన్నారు. విజయవర్గీయ పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిగా ప్రభుత్వ ప్రతినిధి కూడా కావడంతో ఆయన వ్యాఖ్యలను వ్యక్తిగత అభిప్రాయంగా చూడలేమని, అవి ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వ అధికారిక వైఖరిగా భావించాల్సి ఉంటుందని అన్నారు. ఇప్పటివరకు ముఖ్యమంత్రి లేదా బిజెపికి చెందిన మరే నాయకుడూ విజయవర్గీయ వ్యాఖ్యలను ఖండించలేదని సింగ్ పేర్కొన్నారు. మత, మెజారిటీ భావోద్వేగాలను ఉపయోగించి సామాజిక విభజనకు బిజెపి ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. 'ప్రజల సమస్యలపై బిజెపిప్రభుత్వానికి పట్టింపు లేదు. బ్లాక్ మార్కెట్ వ్యాపారులు, నిల్వదారులకు అది దగ్గరగా ఉందనే విజయవర్గీయ వ్యాఖ్యలు మరింత స్పష్టం చేశాయి' అని సింగ్ అన్నారు. పెట్రోల్‌లో ఇథనాల్ కలపడం పెంచిన కేంద్ర విధానం చక్కెర ధరలను పెంచుతోందని, దీనివల్ల ప్రజలపై అదనపు ఆర్థిక భారం పడుతోందని ప్రతిపక్ష పార్టీలు కేంద్రాన్ని విమర్శిస్తున్నాయి. అయితే దేశీయ అవసరాలకు సరిపడా చక్కెర నిల్వలు ఉన్నప్పటికీ పరిశ్రమ ధరలు పెంచుతోందని ప్రభుత్వం పేర్కొంటూ ఈ ఆరోపణలను తోసిపుచ్చింది.

## రాయ్‌పూర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మరో ప్రశ్నాపత్రం లీక్




**రాయ్‌పూర్:** రాయ్‌పూర్‌లోని రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఇందిరా గాంధీ కృషి విశ్వవిద్యాలయం (ఐజికెవి)లో బిఎస్‌సి అగ్రికల్చర్ మరో ప్రశ్నపత్రం లీక్ అయిందన్న ఆరోపణలపై పోలీసు దర్యాప్తు జరపాలని విశ్వవిద్యాలయం కోరింది. ఇప్పటికే బిఎస్‌సి అగ్రికల్చర్‌కు సంబంధించిన రెండు సబ్జెక్టుల ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయన్న ఆరోపణలతో వాటి పరీక్షలను రద్దు చేశారు. తాజా ఘటనలో ఆగస్టు 19న 28 వ్యవసాయ కళాశాలల్లో నిర్వహించిన ఎబిపి5121 (ఫండమెంటల్స్ ఆఫ్ జెనెటిక్స్) పరీక్ష ప్రశ్నాపత్రం లీక్ అయిందన్న ఆరోపణలు వచ్చాయి. ఒక జాతీయ హిందీ దినపత్రికలో ఈ విషయంపై కథనం ప్రచురించడంతో ఘటన వెలుగులోకి వచ్చిందని విశ్వవిద్యాలయం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఆ పత్రికకు చెందిన ఓ జర్నలిస్టు ప్రశ్నలు, సమాధానాలతో కూడిన పిడిఎఫ్‌ను వాట్సాప్ ద్వారా విశ్వవిద్యాలయ సమాచార, ప్రజా సంబంధాల అధికారికి పంపినట్లు తెలిపింది. ఈ వ్యవహారంపై విచారణ జరిపేందుకు విశ్వవిద్యాలయం ఐదుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసింది. ప్రాథమిక విచారణలో భాగంగా కమిటీ ఒక వ్యవసాయ కళాశాలకు పంపిన, అనంతరం విశ్వవిద్యాలయానికి తిరిగి వచ్చిన ప్రశ్నాపత్రాల కవర్లను పరిశీలించింది. ఫండమెంటల్స్ ఆఫ్ జెనెటిక్స్ ప్రశ్నాపత్రం ఉన్న కవర్‌తో పాటు మరి కొన్ని కవర్లలోనూ చేర్పులు జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించామని విశ్వవిద్యాలయం బుధవారం తెలిపింది. గతంలో పోలీసులు దర్యాప్తు చేసిన ప్రశ్నపత్రం లీక్ కేసులో కనిపించిన ఆనవాళ్లతో ఇవి సారూప్యత కలిగి ఉన్నాయని పేర్కొంది. వార్తాపత్రిక కథనం, లీక్ అయినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రశ్నలుసమాధానాలతో కూడిన పిడిఎఫ్, అసలు ప్రశ్నపత్రం, విచారణ కమిటీ నివేదిక ప్రతులను తెలిబందా పోలీసులకు విశ్వవిద్యాలయం అందజేసింది. ఫిర్యాదు అందిందని, ఈ వ్యవహారంపై దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. ఐజికెవి పరీక్షలకు సంబంధించి వరుసగా ప్రశ్నపత్రాలు లీక్ అయ్యాయన్న ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో తాజా ఘటన చోటుచేసుకుంది. ఈనెల 22న ఐజికెవి ప్రశ్నపత్రం లీక్ కేసులో ఛత్తీస్‌గఢ్‌లోని దుర్గ్ జిల్లాకు చెందిన ఓ ప్రైవేటు కళాశాల ప్రొఫెసర్‌తో పాటు ఐదుగురు విద్యార్థులను పోలీసులు అరెస్టు చేశారు. రెండో సంవత్సరం బిఎస్‌సి అగ్రికల్చర్‌లోని ఎంటమాలజీ పరీక్ష ప్రశ్నపత్రం లీక్ అయిన విషయం ఆగస్టు 20న పరీక్ష ప్రారంభమయ్యే ఉదయం వెలుగులోకి రావడంతో ఆ పరీక్షను రద్దు చేశారు. అలాగే, ప్రత్యేక ప్రశ్నపత్రం లీక్ కేసులో పోలీసుల దర్యాప్తు అనంతరం ప్రశ్నపత్రం లీక్ అయినట్లు నిర్ధారణ కావడంతో ఈనెల 7న నిర్వహించిన బిఎస్‌సి అగ్రికల్చర్ మొదటి సంవత్సరం ప్లాంట్ పాథాలజీ పరీక్షను ఐజికెవి ఈనెల 24న రద్దు చేసింది.

## మీ అభిప్రాయం ఏమిటి?

ఢిల్లీ అల్లర్ల కేసులో అతర్ ఖాన్ బెయిల్ పిటిషన్‌పై ఢిల్లీ పోలీసుల స్పందన కోరిన సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ :** ఈశాన్య ఢిల్లీలో 2020 ఫిబ్రవరిలో జరిగిన అల్లర్ల వెనుక ఉన్నట్లు ఆరోపిస్తున్న ''విస్తృత కుట్ర''కు సంబంధించిన ఉగ్రవాద నిరోధక చట్టం యుఎపిఎ కేసులో అతర్ ఖాన్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై ఢిల్లీ పోలీసుల స్పందనను సుప్రీంకోర్టు కోరింది. జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ విపుల్ ఎం. పంచోలీలతో కూడిన ధర్మాసనం.. బెయిల్ నిరాకరిస్తూ ఢిల్లీ హైకోర్టు జూలై 7న ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ అతర్ ఖాన్ దాఖలు చేసిన అప్పీలుపై పోలీసులకు నోటీసులు జారీ చేసింది. 'నోటీసు జారీ చేయండి. ఎనిమిది వారాల తర్వాత విచారణకు జాబితా చేయండి' అని ధర్మాసనం పేర్కొంది. ఈ కేసులో బెయిల్ నిరాకరిస్తూ ట్రయల్ కోర్టు జనవరి 29న ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ అతర్ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. అల్లర్ల సమయంలో మరణాలకు దారితీసే కుట్రలో అతర్ 'స్థానిక స్థాయి కార్యకర్త మాత్రమే కాదు.. 'ప్రధాన కుట్రదారుల్లో ఒకరు' హైకోర్టు పేర్కొంది. అతర్ తరపు న్యాయవాది వాదిస్తూ.. ఆయన 'స్థానిక స్థాయి సహాయకుడు' మాత్రమేనని, ఇప్పటికే ఆరేళ్లుగా జైలులో ఉన్నారని తెలిపారు. ఇదే కేసులో సమాన పరిస్థితుల్లో ఉన్న సహ నిందితులకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసిందని కూడా పేర్కొన్నారు. అయితే సహ నిందితుల బెయిల్ పిటిషన్లపై సుప్రీంకోర్టు చేసిన పరిశీలనలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు.. అతర్ పాత్రకు, బెయిల్ పొందిన నిందితుల పాత్రకు 'స్పష్టమైన తేడా' ఉందని తేల్చింది. ఇతరులు వాట్సాప్ గ్రూప్‌లో హింసకు తావులేని నిరసనలను సూచించినప్పటికీ, అతర్ హింసాత్మక నిరసనలకు పాల్పడాలన్న లక్ష్యాన్ని కొనసాగించాడని, చివరకు మరణాలకు కారణమయ్యే స్థాయికి వెళ్లాడని రక్షిత సాక్షి ఇచ్చిన వాంగ్మూలంతో సహా పలు ఆధారాలు సూచిస్తున్నాయని హైకోర్టు తెలిపింది. మరణాలు, ప్రైవేటు ప్రభుత్వ ఆస్తుల విధ్వంసానికి అతర్ ప్రాథమికంగా బాధ్యుడిగా ఉన్నట్లు ఆధారాలు ఉన్నందున యుఎపిఎ చట్టం 1967లోని సెక్షన్ 43డి(5) కింద బెయిల్‌కు ఉన్న కఠిన నిబంధనలను ఆయన కేసు అధిగమించలేదని హైకోర్టు అభిప్రాయపడింది. 2020 జూలైలో అతర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. 2020 ఫిబ్రవరి అల్లర్లకు సంబంధించి ''ప్రధాన సూత్రధారుల్లో'' ఒకరిగా అతడిపై యుఎపిఎ కింద కేసు నమోదు చేశారు. ఆ అల్లర్లలో 53 మంది మరణించగా, 700 మందికి పైగా గాయపడ్డారు.

## 29 నుంచి ప్రధాని విదేశీ పర్యటన

ఉజ్బెకిస్థాన్, కిర్గిజిస్థాన్‌లో నాలుగు రోజుల పర్యటన

**న్యూఢిల్లీ :** ప్రధాని నరేంద్ర మోదీ శనివారం నుంచి నాలుగు రోజుల పాటు ఉజ్బెకిస్థాన్, కిర్గిజిస్థాన్‌లో పర్యటించనున్నారు. ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయడంతో పాటు కిర్గిజిస్థాన్ రాజధాని బిష్కెక్‌లో జరిగే షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఒ) వార్షిక సదస్సులో ఆయన పాల్గొంటారు. పర్యటన మోదీ మొదట ఈనెల 29, 30 తేదీల్లో ఉజ్బెకిస్థాన్ రాజధాని తాష్కెంట్‌లో పర్యటిస్తారు. వివిధ రంగాల్లో భారత్–ఉజ్బెకిస్థాన్ సంబంధాలను మరింత విస్తరించే మార్గాలపై అక్కడ చర్చిస్తారని విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఉజ్బెకిస్థాన్ పర్యటన అనంతరం మోదీ బిష్కెక్‌కు వెళ్లి రెండు రోజుల పాటు ఎస్‌సిఒ సదస్సులో పాల్గొంటారు. ప్రాంతీయ భద్రతా పరిస్థితుల్లో వస్తున్న మార్పులు, ఉగ్రవాదం, తీవ్రవాదం తదితర అంశాలపై సదస్సులో విస్తృతంగా చర్చ జరిగే అవకాశం ఉంది. ఎస్‌సిఒ వేదికగా భద్రత, అనుసంధానం, అవకాశాలకు సంబంధించి భారత ప్రాధాన్యాలను మోదీ వివరించనున్నారు. చైనా అధ్యక్షుడు షీ జిన్ పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, పాకిస్థాన్ ప్రధాని షెహ్‌బాజ్ షరీఫ్ తదితర నేతలు సదస్సుకు హాజరయ్యే అవకాశం ఉంది. ఎస్‌సిఒ ఏర్పాటై 25 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ సదస్సు జరుగుతోంది. భారత్ 2017లో ఈ సంస్థలో పూర్తిస్థాయి సభ్యదేశంగా చేరింది. ఉగ్రవాదం, వేర్పాటువాదం, తీవ్రవాదాన్ని ఎదుర్కోవడమే ఎస్‌సిఒ ప్రధాన లక్ష్యాల్లో ఒకటని విదేశాంగ శాఖ కార్యదర్శి (పశ్చిమ) సిబి జార్జ్ తెలిపారు. సదస్సు సందర్భంగా మోదీ పలువురు ఎస్‌సిఒ దేశాల నేతలతో ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించనున్నారు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో కూడా ఆయన భేటీ అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కిర్గిజిస్థాన్‌లో జరుగుతున్న ఆరో ప్రపంచ నోమాడ్ గేమ్స్ ప్రారంభోత్సవానికి కూడా మోదీ హాజరుకానున్నారు. మధ్య ఆసియా దేశాల సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించే ఈ కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఉజ్బెకిస్థాన్‌లో మోదీ పర్యటన ప్రధానంగా ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై దృష్టి సారిస్తుంది. అధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయెవ్ ఆహ్వానం మేరకు మోదీ తాష్కెంట్‌లో పర్యటిస్తున్నారు. ప్రధానిగా ఆయన ఉజ్బెకిస్థాన్‌కు వెళ్లడం ఇది నాలుగోసారి. మిర్జియోయెవ్‌తో ప్రతినిధుల స్థాయి చర్చలు జరిపే మోదీ, వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, డిజిటల్ అనుసంధానం, ఇంధనం, విద్య, ప్రజల మధ్య సంబంధాలు వంటి రంగాల్లో సహకారాన్ని సమీక్షించనున్నారు. తాష్కెంట్‌లోని లాల్ బహదూర్ శాస్త్రి స్మారకాన్ని, తాష్కెంట్ స్టేట్ యూనివర్సిటీ ఆఫ్ ఓరియంటల్ స్టడీస్‌లోని మహాత్మా గాంధీ కేంద్రాన్ని కూడా మోదీ సందర్శించే అవకాశం ఉంది.

## గండక్ నది నీటిమట్టం తగ్గుముఖం

సంబంధిత అధికారి వెల్లడి



**పాట్నా :** నేపాల్‌లో సంభవించిన ఆకస్మిక వరదల కారణంగా ఉప్పొంగిన గండక్ నది నీటి మట్టం గురువారం తగ్గుముఖం పట్టిన కారణంగా, ఉత్తర బిహార్‌లోని లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఉపశమనం లభించింది. ఈ విషయాన్ని అధికారి ఒకరు వెల్లడించారు. పొరుగుదేశంతో సరిహద్దును పంచుకునే రాష్ట్రంలోని అత్యధిక ఉత్తర జిల్లా అయిన పశ్చిమ చంపారన్‌లోని వాల్మీకి నగర్ వద్ద ఉన్న గండక్ బ్యారేజీ నుంచి నీటి విడుదల కూడా నదీ వ్యవస్థలో నీటి మట్టం తగ్గడంతో తగ్గిందని ఆ అధికారి తెలియజేశారు. నేపాల్ నుంచి వచ్చిన వరద నీరు గండక్ నదిలోకి ప్రవేశించి బ్యారేజీని చేరడంతో, ఉధృతిని నియంత్రించడానికి సంబంధిత అధికారులు బుధవారం 36 గేట్లు అన్నింటినీ తెరిచి బిహార్‌ను అప్రమత్తం చేశారు. 'వాల్మీకి నగర్ బ్యారేజీ నుంచి నీటి విడుదల బుధవారం రాత్రి 11గంటలకు 1.50లక్షల క్యూసెక్కుల నుంచి గురువారం ఉదయానికి 1.04లక్షల క్యూసెక్కులకు తగ్గింది. వాల్మీకీ నగర్ వద్ద గండక్ బ్యారేజీ నుంచి బుధవారం రాత్రి 11గంటలకు 1.50లక్షల క్యూసెక్కుల గరిష్ఠ స్థాయికి చేరుకుంది. ఆ తర్వాత నీటి మట్టం తగ్గడం ప్రారంభమైంది' అని నీటి వనరుల శాఖ గురువారం విడుదల చేసిన ప్రకటన తెలిపింది. గండక్ నది నీటిమట్టం తగ్గుతున్న ధోరణి కనిపించిందని సంబంధిత అధికారి చెప్పారు. 'అయితే, నేపాల్‌లోని దేవ్‌ఘాట్ ప్రాంతంలో అర్ధరాత్రి కురిసిన వర్షం కారణంగా నీటిమట్టం మళ్లీ పెరగడం ప్రారంభమైంది' అని ఆయన పేర్కొన్నారు. ఇప్పటివరకు కట్టలపై ఎలాంటి ప్రతికూల ప్రభావం పడలేదని, అయితే, జలవనరుల శాఖ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, అప్రమత్తంగా ఉందని అధికారి వివరించారు. గంగా నది నీటిమట్టం కూడా తగ్గుముఖం పడుతున్నప్పటికీ, కొన్ని చోట్ల 1–2 సెంటీ మీటర్ల స్వల్ప పెరుగుదల నమోదయ్యే అవకాశం ఉందని మరో అధికారి చెప్పారు. పరిస్థితిని జలవనరుల శాఖ నిశితంగా గమనిస్తోందని, అవసరమైన అన్ని వరద నివారణా చర్యలను అమలు చేస్తున్నదని ఆయన వివరించారు.పరిస్థితిని సమీక్షించేందుకు బిహార్ ముఖ్యమంత్రి సమ్రాట్ చౌదరి బుధవారం ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ప్రత్యయ అమృత్, ఇతర ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు.సంబంధిత అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన అన్ని చర్యలను తక్షణమే చేపట్టాలని, పరిస్థితిపై నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించినట్లు సంబంధిత అధికారి ఈ విషయాన్ని వెల్లడించారు. 'ఈ ఏడాది బ్యారేజీ నుంచి అత్యధికంగా 2.24 లక్షల క్యూసెక్కుల నీటిని 2026 జులై 14న విడుదల చేయగా, సెప్టెంబరు 28, 2024న 5.625లక్షల క్యూసెక్కుల నీటి విడుదల నమోదైంది.అందువల్ల పరిస్థితి సాధారణంగానే ఉంటుంది' అని భావిస్తున్నాం అని ఆయన చెప్పారు. బ్యారేజీ వద్ద, కట్టల వెంబడి, కంట్రోల్ రూమ్‌లో అన్ని బృందాలు అప్రమత్తంగా ఉన్నాయని ఆయన చెప్పారు. సున్నితమైన ప్రాంతాలలో జిల్లా యంత్రాంగాలు పబ్లిక్ అడ్రస్ సిస్టమ్‌ల ద్వారా సకాలంలో హెచ్చరికలు జారీ చేస్తున్నాయని ఆ అధికారి తెలియజేశారు.

# రాబోయే మూడు రోజుల్లో భారీ వరద ప్రమాదం

## కైలాస్ యాత్రకు వెళ్ళిన భారత సంతతి జంట అదృశ్యం



భారత ఎన్ఆర్ఐ జంట దీపక్ దంపతులు అమెరికాలోని టెక్సాస్ నుండి కైలాష్ యాత్రకు వెళ్ళారు. ఆయన 60వ జన్మదిన వేడుకల సందర్భంగా వెళ్ళిన దీపక్ దంపతులు ఈ జల ప్రళయం విరుచుకుపడటానికి కొద్ది నిమిషాల ముందే అమెరికాలో ఉన్న వారిద్దరి కుమార్తెలకు ఆశ్చర్య,శ్రేయా ఆహ్లాదంతో మాట్లాడారు. తర్వాత వారి జాడ తెలియరాలేదు. దీంతో వారు అమెరికా అధికారులను కలిసినప్పటికీ వారికి సరైన సమాచారం తెలియడంలేదు. తల్లిదండ్రులకోసం ఈ ఒంటరి బాలికలిద్దరూ తీవ్ర ఆందోళనలో ఉన్నారు.గురువారం రాత్రికి అందిన సమాచారం ప్రకారం, ఖిల్తాన్ ప్రాంతం నుండి 108 మృతదేహాలు,నవాల్‌పరాసి ఈస్ట్ నుండి 62 మృతదేహాలు,ధాడింగ్ నుండి 27 మృతదేహాలు,గోర్ఖా నుండి 20 మృతదేహాలు,రసువా నుండి 17 మృతదేహాలు, నవాల్‌పరాసి వెస్ట్ నుండి 15మృతదేహాలు,నువాకోట్ నుండి 12 మృతదేహాలు, తనలూన్ నుండి తొమ్మిది మృతదేహాలను స్వాధీనం చేసుకున్నట్లు నేపాల్ పోలీసు అధికార ప్రతినిధి అబి నారాయణ్ కాఫ్లా చెప్పారు. ఇదిలా ఉండగా 800 మంది ప్రజలు కూడా వరద ప్రమాద ప్రాంతాలలో చిక్కుకుపోయారు. వీరిలో అనేకమంది గాయపడి ఉన్నారు.భోటేకోషి నదికి గల లెండే ఉపనదిలో మంచుఖండం విరిగి అడ్డంగా పడింది. దీంతో నది ప్రవాహం దారితప్పి గ్రామాలపై పడింది. మొదట ఈ మంచుఖండం చైనా-నేపాల్ సరిహద్దుల్లో ఉన్న రసువాగధి సమీపంలోని తిమురే ప్రాంతాన్ని ధ్వంసం చేసింది.


## 2015లో కూడా నేపాల్‌లో ఇదే విపత్తు




నేపాల్‌లో బుధవారం జరిగిన ఘోర జల విపత్తు దృశ్యాలను చూసి ప్రపంచ ప్రజలు విస్తుపోతున్నారు. భీతిగొలిపే ఈ దృశ్యాలు భవిష్యత్ పర్యావరణ విపత్తులను తలచుకుంటే ఏం జరుగుతుందోనన్న ఆందోళన రేకెత్తిస్తున్నాయి. 2015లో కూడా ఇదేవిధంగా విపత్తు నేపాల్‌లో సంభవించింది. ఈ విపత్తులు ఒకేవిధంగా పోలి ఉన్నాయి. అనాడు నేపాల్‌లో వచ్చిన విపత్తు వల్ల లాంగ్ టాంగ్ గ్రామం పూర్తిగా ధ్వంసమైంది. ఆనాటి భూకంపం ప్రభావంవల్ల భారీ హిమపాతం,మంచు పెద్ద పెద్ద బండరాళ్ళు ఈ గ్రామంమీద పడ్డాయి. గ్రామం పూర్తిగా ఆనవాళ్ళు లేకుండా పోయింది. ఇప్పుడు కూడా అదేవిధంగా దాదాపు ఏడు తీవ్ర ప్రాంత జిల్లాలో పరీవాహక ప్రదేశాలను,అక్కడి జనావాసాలను హిమపాత విస్ఫోటనం దెబ్బతీయగా, మూడు జిల్లాలలో గ్రామాలు ప్రధానంగా తుడిపెట్టుకుపోయాయి.

**బీజింగ్:** నేపాల్‌లో కొత్తగా ఏర్పడిన ఆనకట్ట వల్ల రాబోయే మూడు రోజుల్లో సరికొత్త వరద ముప్పు పొంచి ఉందని చైనా గురువారంనాడు నేపాల్‌కు హెచ్చరిక చేసింది. నేపాల్‌లోని దోలాన్ ఖోలా,పురేప త్సాంగ్పో నదీ సంగమ ప్రాంతంలో కొత్తగా ఒక ఆనకట్ట లాగా సరస్సు ఏర్పడిందని, దీనివల్ల రాబోయే మూడు రోజుల్లో ప్రమాదం పొంచి ఉందని పేర్కొంది. బుధవారం జరిగిన జల విలయం తర్వాత మరో 30 లక్షల క్యుబెక్కుల నీరు ఆనకట్టలా ఏర్పడిన ఈ సరస్సులోకి ప్రవహించే అవకాశం ఉందని, దీనివల్ల భారీ వరద ప్రమాదం పొంచి ఉందని చైనా హెచ్చరించింది. కొత్తగా ఏర్పడిన ఈ సరస్సుకు 20 లక్షల క్యుబెక్కుల నీటిని నిల్వ చేయగల సామర్థ్యం ఉందని, ఈ సరస్సు ఇప్పటికే పొంగిపొర్లుతోందని, కొత్తగా మళ్ళీ 30 లక్షల క్యుబెక్కుల నీరు అదనంగా వస్తే పెను విలయం సంభవిస్తుందని సరస్సుకు గండిపడే ప్రమాదం ఉందని హెచ్చరిక జారీ చేసింది. గురువారం ఉదయం నాటికి ఈ సరస్సు పరిమాణం 20 లక్షల క్యుబెక్కుల నీటితో పొంగిపొర్లుతోందని చైనా జలవనరుల మంత్రిత్వశాఖ అంచనావేసింది.కొత్తగా ఏర్పడిన ఈ సరస్సు తీరుతెన్నులను చైనా జలవనరులశాఖ,నిపుణులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఈ ప్రమాదాన్ని నివారించే మార్గాలను అన్వేషిస్తున్నారు.అత్యవసర చర్యలను పరిశీస్తున్నారు.చెన్,పురుషే అనే రెండు నదులు టిబెట్‌లో పుడతాయి. ఈ రెండు నదులు నేపాల్‌లో ప్రవేశిస్తాయి. నేపాల్‌లో ప్రవేశించే ముందుగా ఈ రెండు నదులూ ఏకమై ఒకేనదిగా అవిర్భవించి ప్రవహిస్తుంది. దీనిని నేపాలీయులు భోటేకోషీ నది అని నామకరణం చేశారు.ఈ సంగమ ప్రాంతం నుండీ భోటేకోషి అనేక జిల్లాల మీదుగా ప్రవహిస్తుంది. భోటేకోషికి దిగువన ఉన్న త్రిశూలీ ఉపనది ఉంది.గురువారంనాడు రసూలీ వద్ద భోటేకోషి నదిని వరద ముంచెత్తింది. తర్వాత అది తిమురే,స్యాప్రుబేసి ప్రాంతాల మీదుగా ఉద్ధృతంగా ప్రవహించి అనేక రహదారులు,వంతెనలు,గ్రామాలను ధ్వంసం చేసింది.మంచుఖండం విరిగి పడటంతో లెండే ఉపనది ఉప్పొంగిందని,శిలలు విరిగిపడి నీటితో కలిసి దూసుకువచ్చాయని ఈ కారణంగా తిమూరే వద్ద భారీ వరద భోటేకోషీ నది మీదుగా త్రిశూలీ నదిలోకి ప్రవేశించిందని నేపాల్ ప్రకృతి వైపరీత్యాల నియంత్రణ,నిర్వహణా సంస్థ (ఎన్‌డిఆర్ఆర్ఎంఎ) ఇప్పటికే ఒక ప్రకటన చేసింది.

### నేపాల్‌కు చైనా హెచ్చరిక







కాలిఫోర్నియాకు చెందిన సాఫ్ట్‌వేర్‌ఇంజనీరు, అమెరికా సిటిజన్ సజీపా నేపాల్ వరద ప్రవాహంలో కొట్టుకుపోయారు. ఆయన జాడ తెలియరాలేదు.ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈసా ఫౌండేషన్ ఆర్గనైజేషన్ ద్వారా ఒక బృందంతో కలిసి మొట్టమొదటిసారి ఆయన నేపాల్ పర్యటనకు వచ్చారు. ఆయన పర్యటన చివరకు అత్యంత విషాదకరంగా ముగిసింది.

## నేపాల్‌కు ఐదు మిలియన్ పౌండ్లు బ్రిటన్ సహాయం



భయానక సంక్షోభంలో చిక్కుకున్న నేపాల్‌లో సహాయ చర్యల నిమిత్తం ఐదు మిలియన్ పౌండ్లు సహాయంఅందిస్తున్నట్లు బ్రిటన్ ప్రధాన మంత్రి ఆండీ బర్న్‌హామ్ గురువారం ప్రకటించారు. నేపాల్ విషాదానికి సంబంధించి బయట పడుతున్న వీడియోలు,చిత్రాలు,వాస్తవాలు అత్యంత విషాదకరంగా ఉన్నాయని సౌత్‌వేల్స్ పర్యటనలో ఉన్న ఆండీబర్న్‌హామ్ వ్యాఖ్యానించారు. నేపాల్ పర్యటనలో ఉన్న 33 మంది బ్రిటీష్ పౌరులు ఈ మెరుపు వరదల్లో గల్లంతయ్యారు. బాధితులకు సహాయం అందజేసేందుకు కాన్సులేట్‌ను ఆ దేశానికి పంపిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ వరదల్లో కొట్టుకుపోయిన బ్రిటన్ పౌరుల కుటుంబాలకు ఈ విషాద సమయంలో అండగా ఉంటామని, వారికి అన్నివిధాల సహాయం అందజేస్తామని చెప్పారు.

## తుడిచిపెట్టుకుపోయిన చైనా–నేపాల్ సరిహద్దు భవనం

**కాఠ్మండు:** భయానకమైన వరద ఉద్ధృతి కారణంగా చైనా–నేపాల్ సరిహద్దుల్లో నిర్మించిన భూ సరిహద్దు తనిఖీ రక్షణ భవనం పూర్తిగా కొట్టుకుపోయింది. టిబెట్ అటానమస్ రీజియన్‌లో ఉన్న ఈ సరిహద్దు చెక్ పాయింట్‌ను గిరాంగ్ పోర్ట్ లేదా భూసరిహద్దు దాటివెళ్ళే చెకింగ్ పాయింట్ అని పిలుస్తారు. ఈ చెక్ పాయింట్ పూర్తిగా బురదమట్టితో పూడుకుపోయింది. మౌలిక సదుపాయాలన్నీ ధ్వంసమయ్యాయి.ఈ పరిస్థితుల్లో త్రిశూల్‌లో మిలిటరీ ట్రైనింగ్ సెంటర్‌ను నిరాశ్రయులైన బాధిత ప్రజల కోసం తాత్కాలిక ఆవాస శిబిరంగా మార్చారు.సర్వస్వం కోల్పోయిన బాధితులకు ఆశ్రయం కల్పించారు.అనేక మంది భారతీయ కుటుంబాలు విషాదంలో మునిగి ఉన్నాయి. చైనా–నేపాల్ మధ్య చైనా అటానమస్ రీజియన్ గిరాంగ్ కౌంటీలో 1990లో నిర్మించిన గిరాంగ్ భూ సరిహద్దు ప్రాంతం ఇరు దేశాల వాణిజ్యానికి,పర్యాటకుల రాకపోకలకు అత్యంత కీలకమైనది. ఈ సరిహద్దులమీదుగా ఈ ఏడాది మొదటి ఆరునెలలో 1,00,000 మంది పర్యాటకులు రెండు దేశాలమధ్యా రాకపోకలు సాగించారు. చైనా–నేపాల్ మధ్య ఈ ఏడాదిలో 30 శాతం వ్యాపార వలావాదేవీలు,రవాణా కార్యకలాపాలన్నీ ఈ సరిహద్దుల చెకింగ్ పాయింట్ బిల్డింగ్ దగ్గర నుండే జరిగాయి. సర్వేలైన్స్ కెమెరాల్లో నాటకీయమైన ఈ ప్రకృతి విలయ ఘట్టాలు రికార్డు అయ్యాయి. దీంతో సోషల్ మీడియాలో చైనీయులు ప్రశ్నలమీద ప్రశ్నలు గుప్పిస్తున్నారు. ఇంత కీలకమైన గిరాంగ్ పోర్టును ఎందుకు అస్థిరమైన,అత్యంత ఇరుకైన లోతైన లోయ ప్రాంతంలో నిర్మించిందని ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. ఐతే పురాతన చారిత్రక ఆధారాలకు అనుగుణంగా చైనా–నేపాల్ మధ్య ఉన్న ఏకైక రాకపోకల మార్గం ఈ లోయ ప్రాంతం నుండే ఉంది. ఉవ్వెత్తున విరుచుకుపడిన జల విలయ దృశ్యాలు వైరల్ అవుతూ నెటిజన్లను సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తున్నాయి.





## ఆర్థిక యుద్ధంలో శత్రువులను ఓడిస్తాం

### ఇరాన్ స్పీకర్ ఘాలిబాఫ్

**టెహ్రాన్:** ఆర్థిక యుద్ధంలో శత్రువులను ఇరాన్ జయిస్తుందని ఆ దేశ పార్లమెంటు స్పీకర్ మహ్మద్ బాఘెర్ ఘాలిబాఫ్ సంపూర్ణ విశ్వాసం వ్యక్తం చేశారు. అమెరికా–ఇజ్రాయెల్ దేశాలతో ఇరాన్ పూర్తిస్థాయి యుద్ధంలో ఇరాన్ నిమగ్నమై ఉందన్నారు. ఇరాన్‌లోని ప్రజలు,సకల ఇస్లామిక్ వ్యవస్థలు, ప్రైవేటు వ్యాపారశక్తులు ప్రభుత్వం వెంట ఉన్నాయని, దేశం ఐక్యంగా పనిచేస్తోందని చెప్పారు. ప్రభుత్వ పనివారం ఆగస్టు 24తో మొదలైన సందర్భంగా గురువారం ఆయన ఒక సందేశం ఇస్తూ, శత్రుదేశం అమెరికా మనదేశంపై 'ఆపరేషన్ ఎక znమిక్ ఔట్‌కాస్ట్'ను ప్రారంభించిన నేపథ్యంలో జాతీయ ఐక్యతను పునరుద్ఘాటించారు. సకల వ్యవస్థలూ ప్రస్తుత సవాళ్ళను అధిగమించాలని కోరారు.

## ఢిల్లీలో కీలక సమావేశం

(మొదటి పేజీ తరువాయి)

వివరించింది. తక్కువ విద్యుత్ వ్యయంతో, దీర్ఘకాలికంగా రాష్ట్రానికి ప్రయోజనం కలిగేలా ప్రాజెక్టును నిర్మించాలన్నదే తెలంగాణ ప్రభుత్వ ప్రధాన వాదన. సీడబ్ల్యూపీఆర్ఎస్ అధ్యయనాల ప్రకారం జలమట్టం పెంపుతో అదనపు ముంపు పరిమితంగానే ఉంటుందని కూడా ప్రభుత్వం కేంద్రం దృష్టికి తీసుకెళ్లింది. వెనుకబడిన, కరవు ప్రభావిత ప్రాంతాలకు సాగునీరు అందించే ఈ కీలక ప్రాజెక్టును త్వరగా కార్యరూపంలోకి తీసుకురావాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం కేంద్రం, మహారాష్ట్రతో వరుసగా సంప్రదింపులు కొనసాగిస్తోంది.

## సిగ్గుచేటు

(మొదటి పేజీ తరువాయి)

ఇందిరాపార్క్ ధర్నాచౌక్‌లో మహాధర్నా నిర్వహించారు. యూనియన్ అధ్యక్షుడు కె. ఏసురత్నం అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో ముఖ్యఅతిథిగా కూనంనేని సాంబశివరావు, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాలరాజ్, కార్యదర్శి బి. వెంకటేశం, యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి, ఆఫీస్ బేరర్స్ పి.వెంకటయ్య, బొడ్డుపల్లి కిషన్, కమతం యాదగిరి, ఎండి ఉస్మాన్, ఎం. మద్దిలేటి, కమలమ్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ జిహెచ్ఎంసిని మూడు కార్పొరేషన్లుగా విభజించిన నేపథ్యంలో మల్కాజిగిరి, సైబరాబాద్ కార్పొరేషన్లలో మున్సిపల్ కార్మికులకు తక్కువ వేతనాలు చెల్లించడం అన్యాయమన్నారు. రెండో పిఆర్‌సిని అమలు చేయడంతో పాటు జిహెచ్ఎంసిలో చెల్లిస్తున్న వేతనాలను వారికి కూడా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మున్సిపల్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, పర్మినెంట్ చేయడంతోపాటు నెలకు రూ.26 వేల కనీస వేతనం అమలు చేయాలని కోరారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే రాష్ట్రంలోని కార్మిక సంఘాలు ఐక్యమై బలమైన పోరాటాలు నిర్వహించాలని కూనంనేని పిలుపునిచ్చారు. ఎస్. బాలరాజ్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు చెందిన మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు తక్షణమే కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇండ్లు, వితంతు, వృద్ధాప్య పింఛన్ల వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వారికి వర్తింపజేయాలని కోరారు. వనంపల్లి జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, డ్రైవర్లు, వాటర్ సప్లయ్ సిబ్బంది, శానిటరీ జవాన్లు, ఇన్‌స్పెక్టర్లు, ఎన్ఎంఆర్ కార్మికుల వేతనాలను తగ్గించి చెల్లిస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తక్షణమే స్పందించి పాత పద్ధతిలోనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. కార్మికులు విధి నిర్వహణలో లేదా అనారోగ్యంతో మృతి చెందినా, 60 ఏళ్లు నిండిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి మానవతా దృక్పథంతో ఉద్యోగం కల్పించాలని యూనియన్ అధ్యక్షుడు కె. ఏసురత్నం కోరారు. ధర్నాలో యూనియన్ నాయకులు వై. శ్రీనివాస్, అజయ్, సతీష్, టి. ఆనంద్, కౌసర్ బి, మహేందర్, తిరుపతి, అశోక్, నరసింహులు, యాదగిరి, రామ్‌చందర్, కిరణ్, ప్రభాకర్, రమేష్‌తోపాటు పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

## జాడ తెలియని 1300 మంది

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నారు. సైనికులు,పోలీసులు గాలింపు చర్యల ద్వారా గడచిన 24 గంటల్లో 350 మందిని కాపాడారు.బురదమట్టిలో కూరుకుపోయిన సజీవులైన పర్యాటకులను సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. సురక్షితంగా బయటపడినవారిలో 50 మంది విదేశీయులు ఉండగా అందులో 30 మంది భారతీయులు సహా ఎనిమిదిమంది చైనీయులు,ఎనిమిదిమంది కొరియన్లు,ఇద్దరు అమెరికన్లు,ఇద్దరు ఇటాలియన్లు ఉన్నారు. కాగా నేపాల్–టిబెట్ జల ప్రళయంలో 288 మంది భారతీయులు జాడ తెలియకుండా పోయారని భారత విదేశీ వ్యవహారాలమంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ప్రకటించారు. మరో 200 మంది భారత జాతీయులు దిక్కుతోచనిస్థితిలో టిబెట్‌లో స్తంభించిపోయారని, వారిని భారత్‌కు తరలించాల్సి ఉందని చెప్పారు.అదేవిధంగా కైలాస్ యాత్రకు వెళ్ళిన 21 మంది భారతీయులను కాపాడినట్లు చెప్పారు. మొదట రసువా జిల్లాలో భోషేకోటీ నదిలో మంచుఖండం ఒక్క రసువా ప్రాంతంలోనే 160 మంది మరణించారు.కాగా నువాకోట్ జిల్లాలో వరద ప్రభావిత ప్రాంతాలలో నేపాల్ ప్రధానమంత్రి బాలేంద్ర షా గురువారం పర్యటించి బాధితులను పరామర్శించారు. వారికి భరోసా ఇచ్చారు.

## ఆధునిక ధాన్య సైలోలు

(మొదటి పేజీ తరువాయి)

చేపట్టాలని సూచించారు. గురువారం పౌర సరఫరాల సంస్థ కార్యకలాపాలపై సీనియర్ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ సైలోల నిర్మాణం, నిర్వహణలో మహిళా స్వయం సహాయక సంఘాలను పెద్ద ఎత్తున భాగస్వాములను చేయాలని మంత్రి స్పష్టం చేశారు. తద్వారా మహిళా సంఘాలకు ఆర్థిక అవకాశాలు కల్పించడంతో పాటు రాష్ట్ర ఆహార భద్రతకు అవసరమైన శాశ్వత మౌలిక వసతుల నిర్మాణంలో వారిని భాగస్వాములను చేయవచ్చని తెలిపారు.పెరుగుతున్న ధాన్యం సేకరణకు అనుగుణంగా శాస్త్రీయ నిల్వ సామర్థ్యాన్ని విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. మెరుగైన సాగునీటి వసతులు, సాగు విస్తీర్ణం పెరగడం, కనీస మద్దతు ధరకు ప్రభుత్వం ధాన్యం సేకరిస్తుండటంతో ప్రతి ఏడాది కొనుగోళ్లు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. భవిష్యత్ అవసరాలను కేవలం సంప్రదాయ గోదాములతో తీర్చడం సాధ్యం కాదని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఆటోమేటెడ్ హ్యాండ్లింగ్, యాంత్రిక రవాణా, శాస్త్రీయ సంరక్షణ, డిజిటల్ పర్యవేక్షణ వంటి అత్యాధునిక సాంకేతికతతో కూడిన నిల్వ నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయాలని సూచించారు. తేమ, పురుగులు, ఇతర కారణాలతో ధాన్యం నష్టపోకుండా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని ఆదేశించారు.ప్రస్తుతం పౌర సరఫరాల సంస్థ, తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ, కేంద్ర గిడ్డంగుల సంస్థ, ఎఫ్‌సిఐ, వ్యవసాయ మార్కెట్ కమిటీలు, ప్రైవేటు గోదాముల ద్వారా నిల్వ సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని మంత్రి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థకు సుమారు 6 లక్షల మెట్రిక్ టన్నుల సొంత నిల్వ సామర్థ్యం ఉన్నప్పటికీ, ప్రతి సీజన్‌లో భారీగా సేకరిస్తున్న ధాన్యానికి ఇతర సంస్థలు, అద్దె గోదాములపై ఆధారపడాల్సి వస్తోందన్నారు. రైతుల నుంచి ప్రభుత్వ పరంగా ధాన్యం సేకరణ పెరుగుతున్న నేపథ్యంలో నిల్వలకు కొరత కారణంగా ఒత్తిడి ఏర్పడుతోందన్నారు. ఈ ఏడాది రబీ సీజన్‌లో పౌర సరఫరాల సంస్థ 90 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం సేకరించేందుకు సిద్ధమైందని, తక్షణ అవసరాల కోసం సుమారు 12 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వకు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.భారీగా పెరుగుతున్న ధాన్యం సేకరణకు, అందుబాటులో ఉన్న శాశ్వత శాస్త్రీయ నిల్వ సామర్థ్యానికి మధ్య అంతరాన్ని తగ్గించేందుకు కొత్త సైలోల నిర్మాణం అత్యవసరమన్నారు.ధాన్యం నిల్వల వేలం ప్రక్రియపైనా మంత్రి సమీక్షించిన మంత్రి తదుపరి విడత వేలానికి ముందే లాట్ పరిమాణాలు, బిడ్డింగ్ నిబంధనలు, వేలం వేదికలను ఖరారు చేయాలని అధికారులను ఆదేశించారు. వేలంలో పారదర్శకత, ఏకరూపత, విస్తృత భాగస్వామ్యం ఉండేలా తెలంగాణ ఈప్రొక్యూర్‌మెంట్ వంటి ప్రభుత్వ వేదికలను వినియోగించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు.

**మిల్లర్ల బకాయిల వసూళ్లకు తక్షణం చర్యలు:** డిఫాల్టర్ కస్టమ్ రైస్ మిల్లర్ల నుంచి రావాల్సిన పూర్తి బకాయిలను వసూలు చేసేందుకు పటిష్ట కార్యాచరణ రూపొందించాలని మంత్రి ఆదేశించారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాలు, ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా బకాయిల వసూలు వ్యూహాన్ని అమలు చేయాలని అధికారులకు సూచించారు. డిఫాల్టర్లపై న్యాయపరమైన, విజిలెన్స్, పరిపాలనాపరమైన చర్యలు చేపట్టేటప్పుడు ప్రజాధనాన్ని తిరిగి రాబట్టడమే ప్రధాన లక్ష్యంగా ఉండాలని స్పష్టం చేశారు.సమీక్ష సమావేశంలో పౌర సరఫరాల అదనపు సంచాలకులు రోహిత్ సింగ్‌తో పాటు ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

## పెంచకండి

(మొదటి పేజీ తరువాయి)

కోరారు. '2026 ఏప్రిల్ 16, 17 తేదీల్లో మీరు చేసినట్లుగా మరోసారి బలవంతంగా నిర్ణయాన్ని అమలు చేయడానికి ప్రయత్నించవద్దు' అని ఆయన ప్రధానిని ఉద్దేశించి అన్నారు. లోక్‌సభ స్థానాల సంఖ్యను ప్రస్తుత స్థాయిలో కొనసాగించడం, మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయడం వంటి డిమాండ్లను కాంగ్రెస్ గతంలోనూ ముందుకు తెచ్చింది. ఈ నెల ప్రారంభంలో ఆమోదించిన తీర్మానంలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఈ రెండు డిమాండ్లపై తన నిబద్ధతను మరోసారి స్పష్టం చేసింది. మహిళా రిజర్వేషన్ల అమలుకు డీలిమిటేషన్‌తో ముడిపడిన బిల్లుకు ప్రతిపక్షాలు మద్దతు ఇవ్వాలని ప్రధాని చేసిన విజ్ఞప్తిని ఒక 'నాటకం'గా కాంగ్రెస్ అభివర్ణించింది. ప్రధాని ఏకైక లక్ష్యం 'మహిళా రిజర్వేషన్ కాదు.. మోదీ సంరక్షణ' అని ఆరోపించింది. ఏప్రిల్ 17న జరిగిన బడ్జెట్ సమావేశాల్లో డీలిమిటేషన్ ఆధారంగా లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల్లో మహిళలకు రిజర్వేషన్లు అమలు చేసే రాజ్యాంగ సవరణ బిల్లును దిగువ సభ తిరస్కరించింది. ఓటింగ్‌లో పాల్గొన్న 528 మంది ఎంపిలలో 298 మంది బిల్లుకు అనుకూలంగా, 230 మంది వ్యతిరేకంగా ఓటు వేశారు. బిల్లుకు రాజ్యాంగ సవరణకు అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీ అంటే 352 ఓట్లు అవసరం.

## కొత్త హంగులు

(మొదటి పేజీ తరువాయి)

లిమిటెడ్ ఆధ్వర్యంలో మీర్ ఆలం ట్యాంక్ అభివృద్ధి పనులు సాగుతున్నాయి. చెరువు పునరుజ్జీవనం, చెరువు పరిసర ప్రాంతాలు, అందులోని ఐలాండ్‌ల అభివృద్ధి, చెరువుపై ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం ఈ మూడు ప్రధాన అంశాలపై సమగ్ర ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. మీర్ ఆలం చెరువులోకి మురుగు నీరు చేరకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని సిఎం అధికారులను సందర్శన సందర్భంగా ఆదేశించారు. చెరువు నుంచి మూసీ నదిలోకి వరద నీరు సాఫీగా వెళ్లేలా నాలాలను విస్తరించాలని సూచించారు. చెరువు పునరుజ్జీవనంతో పాటు నీటి నాణ్యతను మెరుగుపరచడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు.

**వాటర్ స్పోర్ట్స్ డిజైన్**

మీర్ ఆలం చెరువులో వాటర్ స్పోర్ట్స్ నిర్వహించేలా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని సిఎం సూచించారు. అవసరమైన సాంకేతిక, పర్యావరణ, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా బోటింగ్, జల క్రీడలు, అడ్వెంచర్ కార్యకలాపాలకు అవకాశాలను పరిశీలించాలన్నారు. దీంతో యువతతో పాటు కుటుంబాలకు కూడా ఆకర్షణీయమైన వినోద కేంద్రంగా మీర్ ఆలం చెరువు మారుతుందని అభిప్రాయపడ్డారు. చెరువు చుట్టూరా ఫుడ్ కోర్టులు, పచ్చని పార్కులు, విశ్రాంతి ప్రదేశాలు, కుటుంబ వినోద సదుపాయాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. చిన్నారుల కోసం ప్రత్యేక ఆట స్థలాలు, వినోద, కార్యకలాపాల కేంద్రాలను కూడా అభివృద్ధి చేయాలన్నారు. పాదచారులకు అనుకూలంగా వాకింగ్, పబ్లిక్ స్పేస్‌లను తీర్చిదిద్దడంతో పాటు రాకపోకల సౌకర్యాన్ని మెరుగుపరచనున్నారన్నారు.

**ఐలాండ్లకూ కొత్త రూపు**

మీర్ ఆలం చెరువులో ఉన్న ఐలాండ్లను అభివృద్ధి చేయాలని సిఎం సూచించారు. ప్రకృతి ఆధారిత విశ్రాంతి కేంద్రాలు, గ్లాంపింగ్ (టెంట్లు వేయడం), ఇతర పర్యాటక కార్యకలాపాలకు ఈ ప్రాంతాన్ని వినియోగించుకునే అవకాశాలను అధికారులను పరిశీలించాలని చెప్పారు. వెడ్డింగ్, ఈవెంట్ డెస్టినేషన్‌ల ఏర్పాటుకు కూడా ప్రణాళికలు సిద్ధం చేసే అంశంపై దృష్టి సారించాలన్నారు. నాణ్యమైన పర్యాటక, వినోద సదుపాయాల అభివృద్ధిలో పిపిపి విధానంలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహించి ఉపాధి అవకాశాలు కల్పించాలని వెల్లడించారు.

**జూ పార్కుతో సమగ్ర పర్యాటక అనుసంధానం**

సమీపంలోని నెహ్రూ జూలాజికల్ పార్కుతో మీర్ ఆలం ట్యాంక్ అభివృద్ధిని అనుసంధానం చేయాలని అధికారులకు సిఎం దిశానిర్దేశం చేశారు. జూ పార్క్ సందర్శన, ప్రకృతి, చెరువు అందాలు, కుటుంబ వినోదం అన్నీ ఒకే పర్యాటక అనుభవంగా అందించడమే లక్ష్యంగా ఉండాలని చెప్పారు. ట్యాంక్ పునరుజ్జీవనం, పరిసర ప్రాంతాలు, ఐలాండ్‌ల అభివృద్ధికి సంబంధించిన డిపిఆర్ ప్రస్తుతం రూపుదిద్దుకుంటుందన్నారు.

**సస్పెన్షన్ బ్రిడ్జి పనుల్లో 50 శాతం పురోగతి**

మీర్ ఆలం ట్యాంక్‌పై నిర్మిస్తున్న ఐకానిక్ బ్రిడ్జి పనులు కూడా పురోగతిలో ఉన్నాయి. 2026 ఆగస్టు 27 నాటికి లక్ష్యంగా పెట్టుకున్న 544 పైల్స్‌లో 273 పూర్తయ్యాయి. అంటే 50.18 శాతం పనులు పూర్తయ్యాయి. 62 పైల్ క్యాప్స్‌లు 28 పూర్తికాగా, 45.16 శాతం పురోగతి నమోదైంది. 62 పియర్‌కమ్‌పియర్ క్యాప్స్‌లో ఇప్పటివరకు ఆరు పూర్తయ్యాయి. విమానాశ్రయానికి సమీపంలో ఉన్న మిర్ ఆలం చెరువును పర్యాటకులను ఆకర్షించేలా అభివృద్ధి చేయాలని సిఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా సూచించారు. ''చారిత్రక మీర్ ఆలం చెరువు, పచ్చని పరిసరాలు, నెహ్రూ జూ పార్కు సమీపం, ఐలాండ్‌లు, వాటర్ స్పోర్ట్స్, కుటుంబ వినోదం, ఫుడ్ కోర్టులు, ఐకానిక్ సస్పెన్షన్ బ్రిడ్జితో మీర్ ఆలం ట్యాంక్‌కు సరికొత్త గుర్తింపు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యం. సమగ్ర అభివృద్ధి పూర్తయితే హైదరాబాద్ నగరవాసులతో పాటు దేశ, విదేశీ పర్యాటకులను ఆకర్షించే ప్రముఖ పర్యాటక కేంద్రంగా మీర్ ఆలం ట్యాంక్ మారనుంది. కుటుంబం మొత్తం ఒకే చోట రోజంతా ప్రకృతి, వినోదం, జలక్రీడలు, విశ్రాంతిని ఆస్వాదించేలా మీర్ ఆలం చెరువును తీర్చిదిద్దనున్నారు'' అని ప్రభుత్వం ప్రకటించింది.

## భయపెట్టి ఆపలేరు

(మొదటి పేజీ తరువాయి)

నిష్పాక్షికతపై తీవ్ర ఆందోళనను రేకెత్తించిందన్నారు. బిజెపి పాలిత ఉత్తర్‌ప్రదేశ్‌లో సిపిఐ కార్యకర్తల ఇళ్ళకు పోలీసులు అర్ధరాత్రి సైతం వెళ్ళి ఒత్తిడి తీసుకువస్తున్నారని, బద్లావ్ జరూరీ హై ర్యాలీలో సిద్ధమవుతున్న వారిని భయపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఇలాంటి ఒత్తిళ్ళు సిపిఐ ప్రచారాన్ని ఆపలేదని, ఢిల్లీకి చేరుకోవాలన్న సిపిఐ కార్యకర్తలు, మద్దతుదారుల సంకల్పం మరింత దృఢంగా మారిందని రాజా స్పష్టం చేశారు. శాంతియుత ప్రజాస్వామ్య జన సమీకరణను అడ్డుకుంటే, సంఘటిత శక్తి, నిరసన, అసమ్మతి వ్యక్తం చేసే హక్కును పరిరక్షించుకోవాల్సిన ప్రాముఖ్యతను మరింత బలపడుతుందన్నారు.

**ఏకతాటిపై విభిన్న వర్గాల ప్రజలు**

ప్రస్తుత పాలన తీరుతో విసిగి వేసారిన భారతదేశంలోని విభిన్న వర్గాలను 'బద్లావ్ జరూరీ హై' ర్యాలీ ఏకతాటిపైకి తీసుకువస్తోంది రాజా అన్నారు. భారతదేశానికి రాజకీయ మార్పు, పాలన దిశలో మార్పు అవసరమని సిపిఐ విశ్వసిస్తోందన్నారు. పార్లమెంటును జవాబుదారీ సంస్థగా పునరుద్ధరించడం, సమాఖ్యవాదాన్ని బలోపేతం చేయడం, రాజ్యాంగ హక్కులను పరిరక్షించడం, ప్రభుత్వ విద్య, ఆరోగ్య సంరక్షణలో పెట్టుబడులు పెట్టడం, సామాజిక, ఆర్థిక న్యాయానికి హామీ ఇవ్వడం, కార్మికులు, రైతులను రక్షించడం, భారతదేశ సంస్థలు మతతత్వ భావజాలానికి అతీతంగా ఉండేలా చూడటం అందులో భాగమని తెలిపారు. ఆర్ఎస్ఎస్–బిజెపి ప్రభుత్వం ప్రచారం, మతపరమైన విభజన, భయం, సంస్థాగత ఒత్తిడి ద్వారా ప్రజల ఆకాంక్షలను అణచివేయలేదని రాజా అన్నారు. విద్యార్థుల ఆగ్రహం, రైతులు, కార్మికుల డిమాండ్లు, దళితులు, ఆదివాసుల పోరాటాలు, మైనారిటీల ఆందోళనలు, ప్రజాస్వామ్య జవాబుదారీతనం కోసం చేస్తున్న డిమాండ్‌లన్నీ కూడా మార్పు కోసం చేస్తున్న విస్తృత డిమాండ్‌లలో భాగమేనని వివరించారు. దేశవ్యాప్తంగా యువత, విద్యార్థులు, మహిళలు, కార్మికులు, రైతులు, మైనారిటీలు, ప్రజాస్వామ్యవాదుల మద్దతు సిపిఐకి ఉందని, 'బద్లావ్ జరూరీ హై' సందేశాన్ని మరింత ఎక్కువ మందికి చేరవేయడం, ప్రజాస్వామ్య ప్రతిఘటనను బలోపేతం చేయడం, రాజకీయ ప్రత్యామ్నాయాన్ని నిర్మించడం ఇప్పుడు మనందరి కర్తవ్యమని పేర్కొన్నారు. సెప్టెంబర్ 1న రామ్‌లీలా మైదాన్‌లో జరిగే ర్యాలీ, మత, కార్పొరేట్ ప్రయోజనాల కంటే ప్రజలకు, ప్రజాస్వామ్యానికి, సామాజిక న్యాయానికి, రాజ్యాంగానికి ప్రాధాన్యతనిచ్చే ప్రభుత్వం కావాలన్న ప్రజల డిమాండ్‌కు ఒక శక్తివంతమైన వ్యక్తీకరణ కానుందని ధీమా వ్యక్తం చేశారు. 'బద్లావ్ జరూరీ హై' ప్రచారాన్ని ప్రారంభించి, ఒక రాజకీయ ప్రత్యామ్నాయం కోసం సిపిఐ దేశవ్యాప్తంగా ప్రజలను సమీకరిస్తోందని వెల్లడించారు.

**ఆన్‌లైన్‌లో 'బద్లావ్ జరూరీ హై' బుక్‌లెట్‌లు**

'బద్లావ్ జరూరీ హై' కార్యక్రమానికి ప్రచారంతో పాటు విస్తృతమైన రాజకీయ అవగాహన కార్యక్రమం కూడా చేపట్టామని, ఇందులో భాగంగా 'బద్లావ్ జరూరీ హై' బుక్‌లెట్‌లను ప్రచురించామని రాజా తెలిపారు. వాటిల్లో డి. రాజా రచించిన 'ఎన్నికల సంస్కరణలు', 'మహిళా రిజర్వేషన్', అమర్‌జీత్ కౌర్ రచించిన 'కార్మికుల హక్కులే మానవ హక్కులు', 'బిజెపి మహాద్రోహం: కనీస మద్దతు ధరకు చట్టపరమైన హామీ', 'రామ మందిర చందా చోరీ : 1949 నుంచి నేటి వరకు కొనసాగుతోంది' అనే అంశాలపై బుక్‌లెట్‌లను సిపిఐ నాయకత్వంతో పాటు కేంద్ర ఎన్నికల మాజీ కమిషనర్ డాక్టర్ ఎస్.వై. ఖురైషీ, ప్రొఫెసర్ నందితా నారాయణ్, ఆప్ ఎంపి సంజయ్ సింగ్, కేరళ మాజీ రెవెన్యూ మంత్రి కె. రాజన్, ఢిల్లీ కార్యకర్తలు వంటి ప్రముఖులు విడుదల చేశారు. దళితులు, ఇతర అణగారిన వర్గాలపై వివక్ష, గిరిజన హక్కులు, కార్పొరేట్ల ద్వారా అడవుల ఆక్రమణ, వివక్ష వంటి అంశాలకు సంబంధించిన మరో రెండు ప్రచురణలు శుక్రవారం విడుదల కానున్నాయని తెలిపారు. ఇవి సిపిఐ వెబ్‌సైట్ cpofindia.com లో అందుబాటులో ఉంటాయని రాజా చెప్పారు.

## విజయాన్ని అడ్డుకున్న సోనాల్ దినుష..

# డ్రాగా ముగిసిన కొలంబో టెస్టు

శ్రీలంకతో రెండో టెస్ట్‌లో టీమిండియాకు అనూహ్య ఫలితం ఎదురైంది. విజయం ఖాయమనుకున్న మ్యాచ్ డ్రాగా ముగిసింది. సోనాల్ దినుషా(264 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సులతో 133 నాటౌట్) అజేయ శతకంతో టీమిండియా విజయవకాశాలను దెబ్బతీసాడు. మరో వైపు ఓటమి తప్పదనుకున్న మ్యాచ్‌లో సోనాల్ దినుషా, టెయిలెండర్ల అద్వితీయమైన బ్యాటింగ్ ప్రదర్శనతో శ్రీలంక డ్రాతో గట్టెక్కింది. దాంతో ఈ రెండు టెస్ట్ సిరీస్‌ను భారత్ 1–0తో కైవసం చేసుకుంది. 229/6 ఓవర్‌నైట్ స్కోర్‌తో ఆఖరి రోజు ఆటను ప్రారంభించిన శ్రీలంక రెండో ఇన్నింగ్స్‌ను 154 ఓవర్లలో 429/9 స్కోర్ వద్ద డ్రా చేసింది. రెండో ఇన్నింగ్స్ ఆడేందుకు తగిన ఓవర్లు లేకపోవడంతో.. శుభ్‌మన్ గిల్ షేక్ హ్యాండ్ ఇచ్చి డ్రాకు అంగీకరించాడు.

**జిడ్డు బ్యాటింగ్‌తో...** సోనాల్ దినుషా అజేయ శతకంతో పాటు పసింధు సూర్యబండార(173 బంతుల్లో 10 ఫోర్లు, సిక్స్తో 92), కామిందు మెండీస్(92 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సులతో 55), కేశర నువాంత(150 బంతుల్లో 4 ఫోర్లతో 46) విలువైన పరుగులు చేశారు. భారత బౌలర్లలో మానవ్ సుతార్(3/121), రవీంద్ర జడేజా(3/94) మూడేసి వికెట్లు తీయగా.. ప్రసిధ్ కృష్ణ, మహమ్మద్ సిరాజ్, సారాన్ష్ జైన్ తలో వికెట్ తీసారు.



తొలి సెషన్లోనే ఫలితం తేలుతుందని భారత్ భావించగా.. సోనాల్ దినుషా, కేశర నువాంత అడ్డుగోడగా నిలిచారు. భారత బౌలర్ల సహనానికి పరీక్షగా నిలిచారు. 32 ఓవర్ల పాటు బ్యాటింగ్ చేసిన ఈ ఇద్దరూ.. తొలి సెషన్‌లో 100 పరుగులు జోడించారు. దాంతో శ్రీలంక 329/6 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది.

**సెంచరీతో చెలరేగిన దినుషా..** రెండో సెషన్‌లో కేశర నువాంత ఔటవ్వడంతో ఏడో వికెట్‌కు నమోదైన 112 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. ఆ వెంటనే ప్రభాత్ జయసూర్య కూడా ఔటవ్వడంతో భారత శిభిరంలో ఆశలు చిగురించాయి. కానీ లాహిరు కుమారతో కలిసి సోనాల్ దినుషా ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. జిడ్డుగా ఆడిన ఈ జోడీ.. భారత బౌలర్ల సహనాన్ని దెబ్బతీసింది. 383/8 స్కోర్‌తో శ్రీలంక టీ బ్రేక్‌కు వెళ్లింది. ఆఖరి సెషన్లోనూ ఇదే ప్రదర్శనను కొనసాగించిన శ్రీలంక 400 పరుగుల మార్క్‌ను అందుకుంది. 196 బంతుల్లో దినూషా సెంచరీ పూర్తి చేసుకున్నాడు. 90 బంతులాడిన లాహిరు కుమారను జడేజా ఔట్ చేసినా ఫలితం లేకపోయింది. అసితా ఫెర్నాండో(0 నాటౌట్) కలిసి దినుషా మరో 10 ఓవర్లు ఆడగా.. శ్రీలంక డిక్లేర్ చేసింది. శుభ్‌మన్ గిల్ వెంటనే షేక్ హ్యాండ్ ఇచ్చి డ్రాకు అంగీకరించాడు. వర్షం అంతరాయం, పిచ్ బ్యాటింగ్కు అనుకూలంగా మారడం, భారత ఆటగాళ్ల ఆత్మవిశ్వాసం లోపించడం.. గిల్ సేన విజయాన్ని అడ్డుకున్నాయి.

**సంక్షిప్త స్కోర్లు....**

భారత్ తొలి ఇన్నింగ్స్ 503/9 డిక్లేర్డ్ (దేవదత్ పడిక్కల్ 117, ధ్రువ్ జురెల్ 115 నాటౌట్)

శ్రీలంక తొలి ఇన్నింగ్స్ 290 ఆలౌట్(పసిందు సూర్యబండార 80, సోనాల్ దినుషా 103)

శ్రీలంక రెండో ఇన్నింగ్స్ 429/9డిక్లేర్డ్(పసిందు సూర్యబండార 92, కామిందు మెండీస్ 55, సోనాల్ దినుషా 133 నాటౌట్)

## అండర్–19లో ఆర్యవీర్ సెహ్వాగ్.. వికెట్ కీపర్‌గా ద్రవిడ్ వారసుడు

భారత దిగ్గజాల వారసులు అంతర్జాతీయ క్రికెట్ వైపు వేగంగా దూసుకొస్తున్నారు. జూనియర్ స్థాయిలో అదగొడుతున్న రాహుల్ ద్రవిడ్, వీరేంద్ర సెహ్వాగ్ కుమారులు అండర్–19 జట్టులోకి వచ్చేశారు. ఇటీవల నిలకడగా రాణిస్తున్న అన్వయ్ ద్రవిడ్, ఆర్యవీర్ సెహ్వాగ్‌లు ఆస్ట్రేలియా తో వన్డే సిరీస్‌కు ప్రకటించిన బృందంలో చోటు దక్కించుకున్నారు. టీమిండియా మాజీ క్రికెటర్లు రాహుల్ ద్రవిడ్, వీరేంద్ర సెహ్వాగ్‌ల కుమారులు అండర్19 స్క్వాడ్‌కు ఎంపికయ్యారు. సెప్టెంబర్ లో ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్ కోసం సెలెక్టర్లు ద్రవిడ్ పెద్దబ్బాయి అన్వయ్ ద్రవిడ్, వీరూ పెద్ద కుమారుడు ఆర్యవీర్ సెహ్వాగ్‌లను తీసుకున్నారు వికెట్ కీపర్‌గా అన్వయ్ తన స్థానాన్ని పదిలం చేసుకోగా.. ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లో దంచేస్తున్న ఆర్యవీర్ అండర్19 స్క్వాడ్‌లోకి మొదటి సారి ఎంపికయ్యాడు. యువ భారత్‌కు లక్ష్య రాయచందని కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు.



ఆసీస్‌తో సెప్టెంబర్18న వన్డే సిరీస్ మొదలవ్వనుంది. అలానే.. రెండు మల్టీ డే మ్యాచ్‌లకు ప్రత్యేక స్క్వాడ్‌ను ప్రకటించింది బిసిసిఐ. ఈ మ్యాచుల్లో టీమిండియాకు యశబర్ధన్ సింగ్ చౌహన్ నాయకత్వం వహించనున్నాడు.

భారత వన్డే స్క్వాడ్(వన్డే సిరీస్ కోసం) : లక్ష్య రాయచందని(కెప్టెన్), యశబర్ధన్ సింగ్ చౌహన్(వైస్ కెప్టెన్), రజత్ బఘేల్(వికెట్ కీపర్), ఆర్యవీర్ సెహ్వాగ్, వీ.కే.వినీత్ కుషగ్ర ఓఘా, అర్జున్ రాజ్‌పుత్, మానల్ చౌహన్, అన్వయ్ ద్రవిడ్(వికెట్ కీపర్), వి.యశ్వీర్ యాదవ్, శవిన్ వినోద్, మోహిత్ ఉల్వా, చిగురుపాటి వెంటకట, కావ్య పటేల్.

## పోటీ కోసం జికె

(గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న వారికోసం)

## తెల్లబొగ్గ అని దీనిని అంటారు

- వర్ధమానుడు ఎక్కడ జన్మించాడు?
  కుంద గ్రామం
- భారతీయులకు ఉన్నతోద్యోగాలను ఇచ్చుటకు నిరాకరించినది?
  కారన్ వాలీస్
- ఓడలు నీటిపై తేలియాడటానికి కారణం ఏమిటి?
  ఉత్ప్లవన సూత్రం
- దక్షిణ భారతదేశ నదులలో పెద్దది
  గోదావరి
- థర్మామీటర్ వాడు ద్రవం?
  పాదరసం
- హైదరాబాద్ ఎన్ని మీటర్ల ఎత్తులో ఉంది?
  600
- జైన తీర్థంకరులందరూ ఏ వంశానికి చెందిన వారు?
  క్షత్రియ
- రైలు మార్గాలు మనదేశంలో ప్రవేశపెట్టబడిన సంవత్సరం?
  1853
- జైనుల 22వ తీర్థంకరుడు ఎవరు?
  అరిష్టనేమి
- ప్రస్తుతం రాజ్యాంగం ద్వారా పౌరులకు గల ప్రాథమిక హక్కులు:
  6
- విద్యుత్ బల్బును కనుగొన్నది:
  ఎడిసన్
- జాతీయాభివృద్ధి మండలి అధ్యక్షుడు:
  ఆర్థికశాఖామంత్రి
- గోవర్ధన్ చిత్రకారుడు ఎవరి ఆస్థానంలో ఉండేవాడు?
  జహంగీర్
- శూన్యంలో ధ్వనివేగం:
  శూన్యం
- నెహ్రూ ప్రభుత్వం జాతీయం చేసింది:
  జీవిత బీమా సంస్థలను
- ప్రపంచంలో ఎక్కువ అభివృద్ధి చెందిన ఖండం:
  ఉత్తర అమెరికా
- డాన్యూబ్ నది ఈ దేశం గుండా ప్రవహించదు
  ఫ్రాన్స్
- రాష్ట్రంలో అత్యవసర పరిస్థితి ఏర్పడినప్పుడు యదార్థ పాలకుడయ్యేవారు
  గవర్నర్
- భారత రిజర్వు బ్యాంకు స్థాపింపబడిన సంవత్సరం:
  1935
- ఈ ద్రవం ఉత్తమ ఉష్ణవాహకము:
  పాదరసం
- హైడ్రాలిక్ యంత్రాలు ఏ సూత్రంపై ఆధారపడి పనిచేస్తాయి?
  పాస్కల్
- ఈ రాష్ట్రంలో ముందుగా క్రైస్తవ మిషనరీలు కొత్త పాఠశాలలను స్థాపించారు?
  మద్రాసు
- అజీవక శాఖకు నాయకుడు ఎవరు?
  గోసాల మస్కరిపుత్ర
- భారతదేశంలో ఎక్కువ దూరం ప్రయాణించే రైలు?
  హిమసాగర్ ఎక్స్‌ప్రెస్
- ప్రపంచాన్ని చుట్టి వచ్చిన



  ఇంగ్లాండ్ యాత్రికుడు
  ఫ్రాన్సిస్ డ్రేక్
- ద్వీపకల్ప నదులలో పెద్దది:
  గోదావరి
- ఈజిప్టు గుండా ప్రవహించుచున్న నది:
  నైల్
- నల్లమందు యుద్ధాలు ఈ రెండు దేశాల మధ్య జరిగాయి:
  చైనా–ఇంగ్లాండ్
- ప్రపంచ ఆర్థిక మాంద్యం:
  1929
- 1931లో జపాన్ ఈ దేశాన్ని ఆక్రమించింది:
  మంచూరియా
- ప్రపంచంలో 'గేదెపాలు' ఉత్పత్తిలో ప్రథమ స్థానంలో ఉన్న దేశం ఏది?
  భారత్
- జాతీయ వరద నియంత్రణ కార్యక్రమం ప్రవేశపెట్టిన సంవత్సరం ఏది?
  1954
- 'నీలి విప్లవం' దేనికి సంబంధించినది?
  చేపలు
- కేంద్ర బడ్జెట్ ఏ రోజున ప్రతిపాదింపబడును?
  ఫిబ్రవరి నెలలో ఆఖరి పని దినమున
- ప్రపంచంలో 'ఉల్లి' ఉత్పత్తిలో భారతదేశ స్థానం
  2వ స్థానం
- మానవ శరీరములో ఉన్న అమైనో అమ్లాల సంఖ్య
  26
- చిన్న పరిశ్రమలు ఉత్పత్తి చేసేవి
  బ్యాగులు
- గులాబీ విప్లవం' దేనికి సంబంధించినది?
  రొయ్యలు మరియు మాంసం
- జెమినికి గల తెలుగు పేరు
  కన్య
- గ్రేట్ బేర్ అనగా...
  నక్షత్ర మండలం
- మన దేశానికి రాజ్యాధినేత...
  రాష్ట్రపతి
- విదేశీ మారక నిల్వల సంరక్షణ కర్త
  రిజర్వు బ్యాంకు
- ప్రజాస్వామ్యం అనే పదం ఈ భాష నుండి తీసుకోబడినది :
  గ్రీకు
- వాతావరణ పీడనాన్ని కొలిచే సాధనం ఏది?
  బారోమీటరు
- తలసరి ఆదాయం పెరగాలంటే జాతీయాదాయం పెరుగుదలతో పాటు జనాభా?
  తగ్గాలి
- బ్రిటీషు పరిపాలన ప్రారంభమవటంలో బాగా నష్టపోయిన వారు?
  చేనేత పనివారు
- పాల స్వచ్ఛతను కనుక్కోవడానికి ఉపయోగించే పరికరం ఏది?
  లాక్టోమీటరు
- శక్తిని విడుదల చేయు భూకంపాలు:
  విరుపాకారక భూకంపాలు
- తెల్లబొగ్గు అని దీనిని అంటారు:
  జలవిద్యుత్

# యువశక్తిని నిర్వీర్యం చేస్తున్న పాలకులు

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు
ఎం.బాల్ నరసింహ్మ

యువత డిమాండ్లకు
ప్రభుత్వాలు సమాధానం చెప్పాలి
ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
కల్లూరు ధర్మేంద్ర



**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** యువ శక్తిని నిర్వీర్యం చేస్తూ పాలకులు యువజన రంగాన్ని విస్మరిస్తున్నారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి సభ్యుడు ఎం.బాల్ నరసింహ్మ ఆరోపించారు. పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో ఎఐవైఎఫ్ నాగర్‌కర్నూల్ జిల్లా 3వ మహాసభ జిల్లా అధ్యక్షులు దేశమోని ఆంజనేయులు అధ్యక్షతన గురువారం జరిగింది. మహాసభలకు ముఖ్య అతిథిగా బాల్ నర్సింహ్మ హాజరై ఎఐవైఎఫ్ జెండాను ఆవిష్కరించారు. మహాసభలో ఆయన మాట్లాడుతూ పేపర్ లీకులు జరిగినప్పుడు ప్రశ్నిస్తే నేరమా? ఉద్యోగాల కోసం పోరాడితే నేరమా? అని పాలకులను ప్రశ్నించారు. యువత ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వకుండా వారిపై కేసులు పెట్టడం, పోలీసుబలాన్ని ప్రయోగించడం తగదన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో ఉపాధి, విద్య, వైద్యం, సామాజిక భద్రతను యువత హక్కుగా అమలు చేయాలని ఈమహాసభ డిమాండ్ చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగాన్ని బలోపేతం చేసి ఖాళీ పోస్టులను భర్తీ చేయడంతో పాటు పేపర్ లీకులకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉద్యోగ నియామకాలను వేగవంతం చేసి ప్రతి ఖాళీకి స్పష్టమైన నియామక క్యాలెండర్, నిరుద్యోగ భృతి, ఫీజు రీయింబర్స్‌మెంట్, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు, స్థానిక వనరుల ఆధారిత పరిశ్రమలను ఏర్పాటు చేయాలని బాల్ నర్సింహ్మ డిమాండ్ చేశారు. ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్రం మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఆరు నెలలకు ఒకసారి పోటీ పరీక్షలు నిర్వహించి ప్రభుత్వ ఖాళీలను భర్తీ చేస్తామని ప్రకటించిన నేపథ్యంలో ప్రకటనలు కాదని అమలు కావాలన్నారు. శిక్షణ కాదు ఉపాధి కావాలని, అణచివేత కాదుయువత ప్రశ్నలకు సమాధానాలు




కావాలి అనే నినాదంతో ఎఐవైఎఫ్ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తుందన్నారు. సెప్టెంబర్ 8,9,10 తేదీలలో యాదగిరిగుట్టలో జరిగే ఎఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభలను విజయవంతం చేయాలని యువత, విద్యార్థులు, ప్రజాస్వామ్యవాదులకు ఆయన పిలుపునిచ్చారు. సిపిఐ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ మాట్లాడుతూ నేటి యువత కేవలం ఉద్యోగం సాధించడం మాత్రమే కాకుండా, సమాజాన్ని శాస్త్రీయ దృక్పథంతో అర్థం చేసుకునే సైద్ధాంతిక అవగాహన అత్యంత అవసరమని పేర్కొన్నారు. శాంతి, అభ్యుదయం, శాస్త్రీయ సోషలిజం అనే సిద్ధాంతాన్ని యువతలో విస్తృతంగా తీసుకెళ్లి, ప్రజా సమస్యలపై చైతన్యం పెంపొందిస్తూ ఉద్యమాలను బలోపేతం చేయాలన్నారు. మహాసభలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బి.నర్సింహ, పి.విజేయుడు, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి బిజ్జా శ్రీనివాసులు, కె.శివకృష్ణ, వాడల బాలపీరు, రాధాకృష్ణ, ధర్మరాజు, యూసుఫ్, రామకృష్ణ, మధు, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రేమ్ కుమార్, సంతోష్, గణేష్, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేష్, నర్సింహో, పర్వతాలు, నర్సింహో తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ కార్యాలయాన్ని ప్రజలకు అందుబాటులోకి తేవాలి




సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి
షేక్ బాష్ మియా డిమాండ్

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్ :** వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం అందుబాటులో లేకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కలెక్టర్ కార్యాలయాన్ని తక్షణమే ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం శివనగర్‌లోని సిపిఐ కార్యాలయంలో వరంగల్ మండల సమితి సమావేశం జన్ను హరిబాబు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో బాష్ మియా పాల్గొని మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో కలెక్టర్ కార్యాలయం అందుబాటులో లేక భూసమస్యలు సంక్షేమ పథకాలు, పెన్షన్లు, ఇళ్ల స్థలాలు ఇతర ప్రభుత్వ సేవలకు సంబంధించిన సమస్యలు పరిష్కారం కోసం ప్రజలు కార్యాలయాల చుట్టు తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని తక్షణమే ప్రారంభించి పూర్తి స్థాయిలో కార్యకలాపాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, జిల్లా అధికారులను షేక్ బాష్ మియా డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మేకల రవి, జిల్లా సహాయ కార్యదర్శి పనాల ప్రసాద్, దండు లక్ష్మణ్, మండల కార్యదర్శి గుండె బద్రి, మండల సహాయ కార్యదర్శులు జన్ను రవి, పరికరాల రమేష్, నాయకులు ల్యాదల్ల శరత్, తాళ్లపల్లి రాహేలా, దస్రు షబానా, సంద్ర కుమార్, సుధీర్, జగదీష్, విక్టోరియా చంద్రశేఖర్ పాల్గొన్నారు. కాగా పార్టీ నియమ నిబంధనలకు విరుద్ధంగా ఆర్థిక లావాలేవీలకు పాల్పడినట్లు వచ్చిన ఫిర్యాదులు, అంశాలను పరిశీలించి బుస్స రవీందర్‌ను పార్టీ ప్రాథమిక సభ్యత్వాన్ని తొలగించాలని నిర్ణయించడం జరిగిందని జిల్లా పార్టీ ప్రకటించింది.

## సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ అమలు చేయాలి



ఉద్యోగుల న్యాయమైన
డిమాండ్లను పరిష్కరించాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా

**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** ఉద్యోగుల జీవితాలకు భద్రతలేని సిపిఎస్ విధానాన్ని పూర్తిగా రద్దు , పాత పెన్షన్ ఓపిఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల న్యాయమైన దీర్ఘకాలిక డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ పంచాయితీరాజ్ మినిస్ట్రియల్ ఉద్యోగుల సంఘం ఇచ్చిన రాష్ట్ర వ్యాప్త ధర్నా కార్యక్రమాల పిలుపులో భాగంగా గురువారం కలెక్టరేట్ ఎదుట పంచాయితీ కార్యదర్శులు, ఉద్యోగులు చేపట్టిన మహాధర్నాకు సాబీర్ పాషా హాజరై సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా సాబీర్‌పాషా మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రజల్లోనికి తీసుకెళ్లడంలో ఉద్యోగులు కీలకపాత్రను పోషిస్తున్నారని, అలాంటి వారి సమస్యలను పరిష్కరించడంలో పాలకులు నిర్లక్ష్యం వహించడం సరైంది కాదన్నారు. 2వ పిఆర్‌సిని వెంటనే ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న డిఎలను విడుదల చేసి ఉద్యోగులను ఆదుకోవాలని కోరారు. ఉద్యోగుల న్యాయమైన హక్కుల సాధన పోరాటాలకు సిపిఐ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

# యువతను విస్మరిస్తే.. పతనం తప్పదు

ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు
వలీవుల్లా ఖాద్రీ



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** యువతను నిర్లక్ష్యం చేస్తే పాలకులకు పతనం తప్పదని ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలీవుల్లా ఖాద్రీ హెచ్చరించారు. అఖిల భారత యువజన సమాఖ్య భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నిర్మాణ మహాసభ గురువారం కొత్తగూడెంలోని సిపిఐ కార్యాలయం శేషగిరి భవన్‌లో ఘనంగా జరిగింది. సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి నానబాల బాలకృష్ణ జెండాను ఆవిష్కరించి మహాసభలను ప్రారంభించారు. అనంతరం జరిగిన ప్రతినిధుల సభలో ఖాద్రీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలతో నిరుద్యోగ సమస్య తీవ్రరూపం దాల్చుతోందన్నారు. ఏటా కోట్లాది ఉద్యోగాలు ఇస్తామని గద్దెనెక్కిన పాలకులు యువశక్తిని పూర్తిగా విస్మరిస్తూ మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు శక్తులకు కట్టబెడుతూ యువత భవిష్యత్‌ను అంధకారంలోకి నెడుతున్నారని మండిపడ్డారు. ప్రశ్నించే యువతపై నిర్బంధాలు మోపడం పాలకుల అసహనానికి నిదర్శనమన్నారు. పోరాడితేనే హక్కుల సాధ్యమవుతాయని, యువత ఉద్యయనం, పోరాటాలను అలవర్చుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సమాజ మార్పునకు యువశక్తి కీలక చోదకశక్తి అని పేర్కొన్నారు. ఉపాధి కల్పనపై పాలకులు తక్షణమే సమగ్ర కార్యాచరణను ప్రకటించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఎఐవైఎఫ్ అధ్వర్యంలో రాజీలేని పోరాటాలు నిర్మిస్తామని వలీవుల్లా ఖాద్రీ స్పష్టం చేశారు. మహాసభలో సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా మాట్లాడుతూ దేశభవిష్యత్‌కు వెన్నెముకలాంటి యువతను నిర్వీర్యం చేసేలా పాలకుల విధానాలు సాగుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రభుత్వాలు ఉపాధి ఉద్యోగ రంగాలను గాలికొదిలేయడం వల్ల యువత తీవ్ర అసహనానికి గురవుతోందన్నారు. రాజ్యాంగబద్ధమైన హక్కులను కాపాడుకునేందుకు ఉద్యమాలు చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్, ఎఐవైఎఫ్ నిర్మాణ బాధ్యులు నరాటి ప్రసాద్ మాట్లాడుతూ యువత తమ సైద్ధాంతిక బలాన్ని పెంపొందించుకుని సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేయాలని సూచించారు. సభలో కల్లూరి వెంకటేశ్వరరావు, ఇటికల రామకృష్ణ, సలిగంటి శ్రీనివాస్, మున్నా లక్ష్మీ కుమారి, వి.పూర్ణ చంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్, ఎస్‌కే ఫహీమ్, ఖయూమ్, భూపేష్, జర్పుల ఉపేందర్, అనుముల సాయి, సాధనపలిల్ సతీష్, భూక్యా దస్రు, కందుల భాస్కర్, డి.శంకర్, భూక్య శ్రీనివాస్, గోపికృష్ణ, ధర్మరాజు, నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, యూసుఫ్, సత్యనారాయణ, ఎర్రబెల్లి శంకర్ చాంద్‌పాషా, బోయిన విజయ్‌కుమార్ ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.



## క్రీడల ఎంపికకు ప్రభుత్వ ఉద్యోగులు పేర్లు నమోదు చేసుకోవాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటి వారిచే నిర్వహించు తెలంగాణ రాష్ట్ర స్థాయి సివిల్ సర్వీస్ క్రీడా ఎంపికలకు ఆసక్తి గల ప్రభుత్వ ఉద్యోగులు పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా యువజన క్రీడల అధికారి బి. వెంకట్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో కోరారు. 2026/27 సంవత్సమునకు సంబంధించి ప్రతి సంవత్సరం భారత ప్రభుత్వము నిర్వహించు ఆల్ఇండియా సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్ నిర్వహణలో భాగంగా ఈ ఎంపిక ఉంటుందన్నారు. హైదరాబాద్ నందు వివిధ ప్రదేశాలలో 2026 సెప్టెంబర్ 08, 09 తేదీల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మహిళలు, పురుషులకు అథ్లెటిక్స్, బాస్కెట్ బాల్, బ్యాడ్మింటన్, చెస్, క్యారమ్స్, హాకీ, కబడ్డీ, లాన్ టెన్నిస్, పవర్ లిఫ్టింగ్, స్విమ్మింగ్, టెన్నిస్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, బెస్ట్ ఫిజిక్స్, యోగా క్రీడలు ఉన్నాయన్నారు. పురుషుల కోసం క్రికెట్, ఫుట్‌బాల్, రెజ్లింగ్, ఖో ఖో పోటీల్లో ఎంపిక జరగనుందని తెలిపారు. ఆసక్తి గల ప్రభుత్వ ఉద్యోఘులు తమ సంబంధిత ఉద్యోగ ధృవీకరణ పత్రం (ఒరిజినల్ ఎంప్లాయి ఐడి), రెండు జిరాక్స్ ప్రతులతో తేది.03.09.2026 ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట లోపు జిల్లా యువజన, క్రీడల కార్యాలయంలో హాజరు కావాలని కోరారు. ఇతర వివరాలకు 9100949979ను సంప్రదించాలని కోరారు.

## సమస్యల పరిష్కారానికి యువత ఉద్యమం

మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు పిలుపు



**ప్రజాపక్షం/చింతపల్లి :** ప్రజా సమస్యల పరిష్కారానికి యువత ఉద్యమించాలని మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని నారాయణరావు భవన్‌లో అఖిలభారత యువజన సమాఖ్య ( ఏఐవైఎఫ్) రాష్ట్ర మహాసభల పోస్టర్ను గురువారం యాదగిరిరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగంలో సంభవించిన మార్పులకు అనుగుణంగా యువతను విజ్ఞానవంతులను చేసి సమాజాభివృద్ధిలో భాగస్వాములుగా చేయడంలో ప్రభుత్వాలు గోరంగా వైశాల్యం చెందాయని దుయ్యబట్టారు. పార్యావసనంగా నిరుద్యోగ భూతం యువత భవిష్యత్తును అంధకారంలోకి నెట్టి వేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. నిరుద్యోగం , పేదరికం ఆర్థిక అంతరాలు, నిరాశ నిస్పృహలు పెరిగిపోతున్నాయన్నారు. ప్రభుత్వం యవతకు ఆర్థిక సహకారం చేసేందుకు వెయ్యి కోట్ల యూత్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 8, 9, 10 తేదీలలో యాదగిరిగుట్టలో జరిగే ఏఐవైఎఫ్ మూడవ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నల్లగొండ జిల్లా అధ్యక్షులు ఎనమల్ల నవీస్, సిపిఐ మండల కార్యదర్శి పోలే వెంకటయ్య, ఏఐవైఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు మిడిదొడ్డి రామకృష్ణ, ఎదుల్ల వెంకటరత్నం, సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఉజ్జిని అంజల్‌రావు, బినమోని వెంకటేష్, బాధరాజు, నేనావత్ కృష్ణ, సైదులు పాల్గొన్నారు.

## భద్రతా పరంగా పటిష్ట చర్యలు

నల్లగొండ జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** జైలు సిబ్బంది విధుల్లో క్రమశిక్షణ, అప్రమత్తతతో పాటు నిరంతర పర్యవేక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ సూచించారు. గురువారం నల్లగొండ జిల్లా జైలును ఎస్పి సందర్శించి జైలు భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జైలు సూపరింటెండెంట్‌తో కలిసి జైలు పరిసరాలు,భద్రతా విధానాలు, సెక్యూరిటీ పాయింట్లు, ప్రవేనిష్క్రమణ ప్రాంతాలను పరిశీలించి, భద్రతాపరంగా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సమగ్రంగా సమీక్షించారు.ఈ సందర్భంగా జైలు భద్రతకు సంబంధించి సెక్యూరిటీ పాయింట్ ఆఫ్ వ్యూలో అవసరమైన సూచనలు, సలహాలను జైలు సూపరింటెండెంట్‌కు జిల్లా ఎస్పి అందజేశారు. జైలు పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జైలు భద్రతా ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, భద్రతాపరంగా అవసరమైన చర్యలను వెంటనే చేపట్టాలని ఎస్పీ సూచించారు. జైలు సూపరింటెండెంట్, జైలు అధికారులు, సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఓటర్ జాబితా సవరణకు సహకరించాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రత్యేక విస్తృత ఓటర్ జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా నిర్వహించే ఇంటింటి సర్వేకు ప్రజలంతా పూర్తి సహకారం అందించాలని మునిసిపల్ కమిషనర్ నర్రా శ్రీజారెడ్డి కోరారు. మిర్యాలగూడ మునిసిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో గురువారం ప్రత్యేక వార్డు సభలు నిర్వహించారు. ఈదులగూడలో జరిగిన సభలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పోలింగ్ బూత్‌ల వారీగా కేటాయించిన బూత్ లెవెల్ అధికారులు, వార్డు అధికారులు ఓటర్ల జాబితా పరిశీలన కోసం నివాసాలకు వచ్చినప్పుడు వారికి సరైన వివరాలు అందించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. 17వార్డులో కౌన్సిలర్ నూకల కవిత, 6వ వార్డు, 37 వార్డుల్లో పుట్టపాక శ్రీనివాస్, చల్ల సుధాకర్, బూత్ లెవెల్ అధికారులు బొందు పార్వతి, పద్మ, రజిత పాల్గొన్నారు. అదే విధంగా ఎన్ఎస్పి క్యాంపులో జరిగిన కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్త నంబర్లతో భూధార్ కార్డు



**ప్రజాపక్షం/మర్రిగూడ:** భూ రీ సర్వేకు గ్రామ ప్రజలు సహకరించాలని చండూరు ఆర్‌డిఓ శ్రీదేవి కోరారు. మండలంలోని తమ్మడపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన భూ రీ సర్వే గ్రామ సభకు ఆమె హాజరై మాట్లాడారు. మొదటగా గ్రామ పెద్దల సమక్షంలో గ్రామ సరిహద్దును ఫిక్స్ చేసి, ఆ తర్వాత గ్రామ కంఠం, ప్రభుత్వ భూమి, కాలువలు, రోడ్లు,కుంటలు, సీకం భూములు,అనంతరం పట్టా భూములను శాటిలైట్ రోవర్ల ద్వారా సర్వే నంబర్ హద్దు పాయింట్లు చూపిస్తారని తెలిపారు. మన మండలానికి రెండు రోవర్ల ద్వారా సర్వేయర్లతో సర్వే చేస్తున్నారని, తమ్మడపల్లి గ్రామం మొత్తం 1182 ఎకరాలు ఉండటంతో నెల రోజుల్లోగా పూర్తవుతుందన్నారు. ఇప్పుడున్న సర్వే నంబర్లు మారిపోయి కొత్త సర్వే నంబర్లు వస్తాయని, కొత్త నంబర్లతో భూ ఆధార్ కార్డు ప్రతి రైతుకు వస్తుందని తెలిపారు. అభ్యంతరాలు ఏమైనా ఉంటే డీఐ, ఏడీలకు చూపించుకోవచ్చని సూచించారు. తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ 1987 కంటే ముందు భూములు సర్వే చేసి దాదాపు 90 ఏళ్లు అవుతోందని, ఈ గ్రామంలో 144 సర్వే నంబర్లు ఉన్నాయని, రీ సర్వే తర్వాత పాత నంబర్లు ఉండవని తెలిపారు.

# ప్రకాశం బజార్‌లో వీధి వ్యాపారుల కన్నీళ్లు..

- ఖాళీ స్థలంలో మొక్కలే
- నల్లగొండ పట్టణంలో మళ్లీ రోడ్డుపైనే వీధి వ్యాపారులు
- ప్రజలు రాని చోట వ్యాపారాలు సాగేదెలా...4,5 నెలలుగా ఆర్థిక ఇబ్బందులు
- కార్పొరేషన్ ఆలోచన మంచిదే..అమలులో లోపాలే వీధి వ్యాపారులకు శాపం



**ప్రజాపక్షం/నల్లగొండ:** నూతన మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటైన నేపథ్యంలో పట్టణంలో మార్పులు తీసుకురావాలన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సంకల్పంలో భాగంగా చేపట్టిన చర్యలు క్షేత్రస్థాయిలో ఆశించిన ఫలితాలను ఇవ్వడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.ముఖ్యంగా నల్లగొండ పట్టణానికి నాడిబొడ్డుగా ఉన్న ప్రకాశం బజార్‌లో వీధి వ్యాపారుల సమస్య ఇందుకు నిదర్శనంగా మారింది. ట్రాఫిక్ నియంత్రణ, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయాలనే ఉద్దేశంతో వీధి వ్యాపారులను ప్రత్యామ్నాయ ప్రాంతానికి తరలించినా అక్కడ జనసంచారం లేకపోవడంతో వారి జీవనోపాధి దెబ్బతిన్నదని వీధి వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రకాశం బజార్‌లో పండ్ల బండ్లు,పూల బండ్లు,కుండలు, తమలపాకులు,ఇతర వస్తువులు విక్రయించే వీధి వ్యాపారులు రోడ్డుకు ఇరువైపులా ఏళ్ల తరబడి వ్యాపారాలు కొనసాగిస్తున్నారు.దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడటంతోపాటు పాదచారులకు కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని అధికారులు గుర్తించారు.ఈ నేపథ్యంలో కార్పొరేషన్,రెవెన్యూ,పోలీస్ అధికారులు సంయుక్తంగా చర్యలు చేపట్టి వీధి వ్యాపారులను అక్కడి నుంచి తరలించాలని నిర్ణయించారు.పాత కలెక్టర్ కార్యాలయానికి సంబంధించిన ఖాళీ స్థలంలో వీధి వ్యాపారాలు నిర్వహించుకోవాలని సూచించారు.

అధికారుల ఉద్దేశం మంచిదే అయినప్పటికీ..ప్రత్యామ్నాయ స్థలం ఎంపిక తమ జీవనోపాధికి ప్రతికూలంగా మారిందని వీధి వ్యాపారులు చెబుతున్నారు.ప్రధాన రహదారిపై నిరంతరం ప్రజల రాకపోకలు ఉండటంతోనే తమకు గిరాకీ లభించేదని,ప్రస్తుతం జనసంచారం లేని ప్రాంతానికి తరలించడంతో కొనుగోలుదారులు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత నాలుగు,ఐదు నెలలుగా గిరాకీ లేక ఆదాయం గణనీయంగా తగ్గిపోయిందని వాపోతున్నారు.

**జనం లేని చోట బండి పెట్టి ఏం అమ్మాలి? పండ్ల వీధి వ్యాపారి ఎండి సర్వర్**



ఒక పండ్ల వీధి వ్యాపారి మాట్లాడుతూ ప్రకాశం బజార్‌లో ఏళ్లుగా పండ్లు అమ్ముకుంటూ జీవిస్తున్నాం అని పండ్ల వీధి వ్యాపారి ఎండి సర్వర్ చెప్పుకొచ్చారు. అక్కడ జనా లు ఎక్కువగా ఉండటంతోనే రోజువారీ గిరాకీ వచ్చేది. ఇప్పుడు జనాలు రాని చోటికి పంపితే మా పండ్లు ఎవరు కొనుగోలు చేస్తారు. ఉదయం నుంచి సా యంత్రం వరకు కూర్చున్నా గిరాకీ ఉండటం లేదు. పం డ్లు నిల్వ ఉండి పాడైపోతున్నాయి. కుటుంబ పోషణ కూ డా కష్టంగా మారింది.ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలన్న అధికారుల ఆలోచనను మేము వ్యతిరేకించడం లేదు.

**నాలుగు నెలలుగా ఏడుపు.. అప్పులు తప్ప ఏం లాభం లేదు : పండ్ల వీధి వ్యాపారి లక్ష్మ మ్మ**



మా దగ్గర పెద్ద పెట్టుబడులు లేవు.రోజూ పండ్లు కొనుక్కొచ్చి అమ్మితే వచ్చే ఆదాయంతోనే కుటుంబాన్ని పోషించుకుంటాం. కొత్త స్థలంలో ప్రజలు లేకపోవడంతో పండ్లు అమ్ముడుపోవడం లేదు.నాలుగు,ఐదు నెలలుగా తీవ్రంగా నష్టపోతున్నాం అని పండ్ల వీధి వ్యాపారి లక్ష్మ మ్మ అన్నారు.ఏడుపు.. అప్పులు తప్ప ఏం లాభం లేదు. అధికారులు ఒకసారి స్వయంగా వచ్చి అక్కడ పరిస్థితి ఎలా ఉందో చూడాలి.

**ఆలోచన మంచిదే.. ఆచరణలో మార్పు కావాలి : సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వీరాస్వామి**



పట్టణంలో ట్రాఫిక్ సమస్యను తగ్గించడం, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయడంలక్ష్యంగా కార్పొరేషన్ తీసుకున్న నిర్ణయాన్ని తప్పుపట్టాల్సిన అవసరం లేదని సిపిఐ జిల్లా కర్యవర్గ సభ్యులు పబ్బు వీరాస్వామి అభిప్రాయపడుతున్నారు. కార్పొరేషన్ లక్ష్యం మార్పు అయితే ఆ మార్పు ప్రజలకు, వీధి వ్యాపారులకు ఉపయోగపడేలా ఉండాలి. లేకపోతే జనాలు లేని చోట బండ్లు.. బండ్లు లేని చోట మొక్కలే మిగిలే పరిస్థితి ఏర్పడుతుందన్నారు.

## మార్కెట్ యార్డులో ధాన్యం చోరీ..

- చోరీ చేసిన వారినే బెదిరించి రూ.5 లక్షల దోపిడీ
- 11 మంది అరెస్ట్.. రూ.9.80 లక్షల నగదు, 11 సెల్‌ఫోన్లు, బొలెరో వాహనం స్వాధీనం



**ప్రజాపక్షం/చండూరు:** చండూర్ వ్యవసాయ మార్కెట్ యార్డులోని గోదాంలో నిల్వ ఉంచిన ప్రభుత్వ ధాన్యాన్ని నకిలీ తాళంతో తెరిచి పలు దఫాలుగా దొంగిలించిన ముఠా గుట్టును పోలీసులు ఛేదించారు. దొంగిలించిన ధాన్యాన్ని సూర్యాపేట మార్కెట్‌లో విక్రయించిన ముగ్గురితో పాటు, దొంగతనం చేస్తూ వారిని పట్టుకుని చంపుతామని బెదిరించి రూ.5 లక్షలు వసూలు చేసిన మరో ఎనిమిది మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో మొత్తం 11 మంది నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.9.80 లక్షల నగదు,11 సెల్‌ఫోన్లు, ధాన్యం తరలించేందుకు ఉపయోగించిన బొలెరో వాహనం (టీఎస్07 యూకే 4505) స్వాధీనం చేసుకున్నట్లు నల్లగొండ డిఎస్‌పి కె.శివరాంరెడ్డి తెలిపారు.కేసును చండూర్ సీఐ టి.రాము ఆధ్వర్యంలో ఎస్ఐ జె.శివకుమార్ మరియు సిబ్బంది వేగంగా దర్యాప్తు చేసి ఛేదించారు.

**నకిలీ తాళంతో గోదాం తెరిచి..** చండూరుకు చెందిన తెలుకుంట్ల శ్రీనివాసులు తన భాగస్వామితో కలిసి కనగల్ మండలం కురంపల్లి గ్రామంలోని మహావీర్ పారాబాయిల్ రైస్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ మిల్లును నిర్వహిస్తున్నారు. 2025/26 ఖరీఫ్,రబీ సీజన్‌కు సంబంధించిన ప్రభుత్వ ధాన్యంలో సుమారు 25 వేల క్వింటాళ్లను చండూరు వ్యవసాయ మార్కెట్ గోదాములో నిల్వ చేశారు.దశలవారీగా ధాన్యాన్ని మిల్లుకు తరలించిన అనంతరం గోదాములో సుమారు 13 వేల క్వింటాళ్లు ఉండాల్సి ఉంది. అయితే గోదామును పరిశీలించగా షట్టర్ తాళం వద్ద ధాన్యం చిందరవందరగా ఉండటం, బస్తాలు గుంజిన ఆనవాళ్లు కనిపించాయి. లెక్కలు పరిశీలించగా సుమారు 600 నుంచి 700 బస్తాల ప్రభుత్వ ధాన్యం మాయమైనట్లు గుర్తించారు. దొంగిలించిన ధాన్యాన్ని సూర్యాపేట మార్కెట్‌లో విక్రయించి వచ్చిన డబ్బును పంచుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో నాగిళ్ల ఆంజనేయులు, బొమ్మోజు ప్రకాష్, మెతరి నాగేష్,వెంకన్న,వేముల పవన్,దోటి శివ,భీమనపల్లి గణేష్, దోటి నరేష్, గందూరి మల్లేశ్, బెత వెంకన్న, గోల్కొండ శేఖర్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు. నల్ల స్వామి పరారీలో ఉన్నట్లు తెలిపారు.

## ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు అత్యంత విలువైంది



సమగ్ర సవరణపై ప్రజలకు అవగాహన కల్పించిన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా తుర్కపల్లి మండలం మాదాపూర్ గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులతో కలిసి ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ ద్వారా జాబితాలో ఉన్న తప్పులు, పొరపాట్లను సరిచేసుకోవడంతో పాటు అర్హులైన కొత్త ఓటర్ల పేర్లను నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతీ యువకుడు తమ పేరును ఓటర్ల జాబితాలో నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. గ్రామ సభల ద్వారా ప్రజలకు సర్ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించాలని, ప్రతి ఇంటికి వెళ్లి అర్హులైన ఓటర్ల వివరాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు. అనంతరం తుర్కపల్లి మండల కేంద్రంలో తెలంగాణా తల్లి ప్రధాన చౌరస్తాలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. లైట్ల ఏర్పాటుతో తుర్కపల్లి ప్రధాన రహదారి,చౌరస్తా వెలుగులతో నిండిపోతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, బూత్ స్థాయి అధికారులు నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి

- కోదాడలో ఎస్పి కె.నర్సింహ్మా వార్షిక తనిఖీలు
- ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు



**ప్రజాపక్షం/కోదాడ:** సూర్యాపేట జిల్లా పోలీస్ శాఖలో భాగంగా నిర్వహిస్తున్న వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా ఎస్పి కె.నర్సింహా గురువారం కోదాడ డివిజన్ కార్యాలయంతో పాటు కోదాడ పట్టణ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది నిర్వహించిన కవాతును పరిశీలించిన ఎస్పీ కార్యాలయాల పరిసరాల్లో మొక్కలు నాటారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు అనుక్షణం అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకుంటూ స్మార్ట్ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలని సూచించారు. ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో డ్రంకన్ అండ్ డ్రైవ్ రిజిస్టర్ , ఎన్‌ఫోర్స్‌మెంట్ రిజిస్టర్ తదితర రికార్డులను పరిశీలించి పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణను మరింత పటిష్టం చేయాలని ఆదేశించారు. ఆపరేషన్ రోప్‌ను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు మద్యం మత్తులో వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేసి జైలుకు పంపించేలా చర్యలు చేపట్టాలన్నారు. యువత నిర్లక్ష్యపు డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్‌పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించాలని, ట్రాఫిక్ ఉల్లంఘనలపై ఆకస్మిక తనిఖీలు చేపట్టాలన్నారు. డిఎస్‌పి కార్యాలయంలో వివిధ రకాల రిజిస్టర్లను పరిశీలించిన ఎస్పీ, వరకట్నపు హత్యలు, ఆత్మహత్యలు, తీవ్రమైన చీటింగ్ కేసులు, ఎస్సి, ఎస్టీ అట్రాసిటీ కేసులు, మైనర్లపై వేధింపులకు సంబంధించిన కేసులు తదితర దర్యాప్తుల పురోగతిని సమీక్షించారు. డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సిబ్బంది పనితీరును మెరుగుపర్చేలా చర్యలు తీసుకోవాలని డిఎస్‌పి కి సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రణాళిక బద్దమైన చర్యలు చేపట్టాలని, జాతీయ రహదారులు, ప్రధాన రహదారుల వెంట ఉన్న గ్రామాల ప్రజలు, హోటళ్లు, టీ దుకాణాలు, ఇతర వ్యాపార సంస్థల నిర్వాహకులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించి వారి వ్యాపార ప్రాంతాల వద్ద తగిన జాగ్రత్తలు పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ తనిఖీల్లో కోదాడ డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి, సిఐలు శివశంకర్‌నాయక్, చరమందరాజు, రామకృష్ణారెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐ అంజిరెడ్డి, ఎస్ఐలు నవీన్, మోహన్, స్టోర్ ఆర్ఎస్ఐ అఖిల్, డిసిఆర్‌బి సిబ్బంది అంజన్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, సిసి సందీప్, టెక్నికల్ కానిస్టేబుల్ అబెద్ పాల్గొన్నారు.



## యువత సమస్యలపై ఏఐవైఎఫ్ నిరంతర పోరాటం

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** యాదాద్రి భువనగిరి జిల్లాలో జరగనున్న అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర మూడవ మహాసభలను జయప్రదం చేయాలని సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలో అఖిల భారత యువజన సమాఖ్య పట్టణ కౌన్సిల్ సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగం, ఉపాధి అవకాశాల కొరత, విద్యా సమస్యలు, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, సామాజిక న్యాయం, యువత హక్కులు వంటి అనేక సమస్యలపై మహాసభల్లో సమగ్రంగా చర్చించి భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ రంగాన్ని బలోపేతం చేయడంతోపాటు ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని, యువతకు నాణ్యమైన విద్య, ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. యువత సమస్యలపై నిరంతరం పోరాడుతూ వస్తున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర మూడవ మహాసభలు భవిష్యత్తు యువజన ఉద్యమానికి నూతన దిశానిర్దేశం చేసే వేదికగా నిలవనున్నాయని అఖిల భారత యువజన సమాఖ్య పట్టణ అధ్యక్ష కార్యదర్శులు బూర సైదులు, ఎడెల్లి శ్రీకాంత్‌లు అన్నారు. జిల్లాలోని యువత, విద్యార్థులు, నిరుద్యోగులు, ప్రజాస్వామిక వాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కుక్కడపు శౌరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో అయితగాని కామేష్, రెడ్డిమల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ పెద్దపీట



**ప్రజాపక్షం/చివ్వెంల :** గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. పల్లెల్లో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించి, గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. మండలంలోని గుర్రంతండ గ్రామంలో నూతన అభివృద్ధి పనులకు మండల పార్టీ అధ్యక్షులు ధరావత్ వీరన్న నాయక్, సర్పంచ్ ధరావత్ వినోద్ నాయక్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో తండాలు అభివృద్ధికి దూరమయ్యామని విమర్శించారు. రూ.20లక్షల వ్యయంతో గ్రామ పంచాయితీకి భవనం, రూ.12లక్షలతో అంగన్‌వాడీ కేంద్ర భవనం, రూ.30లక్షలతో ఫుడ్ స్టోరేజ్ భవనం, రూ.10లక్షలతో సంఘభవనం, మొత్తం రూ.72లక్షల విలువైన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

## సమస్యలను పరిష్కరించాలని ధర్నా

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ఉద్యోగుల, పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట తెలంగాణ రాష్ట్ర ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల ఐక్యవేదిక (టిజిఇజెఏసి) ఆధ్వర్యంలో టిఎన్‌జిఓస్ యూనియన్ జిల్లా కార్యదర్శి దున్న శ్యామ్ అధ్యక్షతన మహా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు జెఏసి నాయకులు మాట్లాడుతూ పిఆర్‌సి వెంటనే అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న 6 డిఏలను మంజూరి చేయాలన్నారు. సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులు, హెల్త్ కార్డులు సక్రమంగా అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టి, పదోన్నతులు పూర్తి చేయాలని కోరారు. జిఓ 25 సవరణ చేసి, జిఓ 190 అమలు చేయాలన్నారు. విబిజిఆర్ ఏఎం ఉద్యోగులకు ప్రకటించిన పే స్కేల్స్‌లను వెంటనే అమలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైన స్పందించి జెఏసి నాయకత్వాన్ని ఆహ్వానించి సమస్యల పరిష్కారం కోసం చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సెప్టెంబర్ 10న ఇందిరాపార్కు వద్ద జరగనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జెఏసి నాయకులు భూపాల్ రెడ్డి, తంగెళ్ల జితేందర్ రెడ్డి, రాధాకృష్ణ, ఎన్. సోంబాబు, వీరన్న, షేక్ ఉమర్, నిమ్మల శ్రీనివాస్, సీతారామయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



## జిల్లా ప్రజలకు 'రాఖీ' శుభాకాంక్షలు

ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్ భవేష్ మిశ్రా



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** సోదరభావానికి ప్రతీక అయిన రక్షాబంధన్ (రాఖీ పండగ) పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రజలకు ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్ భవేష్ మిశ్రా ఆనందోత్సహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. తమ సోదరీమణులకు ఏ ఆపద రాకుండా ఎల్లవేళలా అండగా నిలబడతామని సోదరులు భరోసానందించటం విశిష్ట అని గుర్తు చేశారు. 'రాఖీ' కుటుంబ బంధాలను బలోపేతం చేసే వారధి అన్నారు. మహిళలకు భద్రత, గౌరవం ఎంతో ముఖ్యమనే సందేశాన్ని ఈ పండగ అందిస్తుందని కులమతాలకతీతంగా మానవత్వాన్ని ప్రేమానురాగాలను చాటే ఈపర్వదినం మన సంస్కృతి, ఔన్నత్యానికి ప్రతీక అన్నారు. రాఖీ పౌర్ణమి వేడుక ప్రజల మధ్య ఆత్మీయతను మరింతగా పెంపొందించాలని ఆకాంక్షించారు.

## వారసంతలో మౌలిక వసతులు కల్పించాలి

సిపిఐ నాయకుడు కొదురుపాక మహేష్



**ప్రజాపక్షం/వాంకిడి :** వాంకిడి వారసంతలో కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) నాయకులు కొదురుపాక మహేష్ మండిపడ్డారు. వాంకిడి మండల కేంద్రంలో ప్రతివారం జరిగే సంతకు దాదాపు 30 గ్రామాల నుంచి గిరిజన రైతులు వ్యాపారులు వస్తుంటారని వసతులు లేక వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన విమర్శించారు. ఎండ వానల నుంచి రక్షణ కల్పించే రేకుల షెడ్లు లేవని కనీసం తాగునీరు మరుగుదొడ్లు చెత్త నిర్వహణ కూడా కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దుస్థితి వల్ల మహిళలు వృద్ధులు తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలిపారు. సంత ద్వారా గ్రామపంచాయతీకి ఆదాయం వస్తున్నా అభివృద్ధికి నిధులు కేటాయించకపోవడం దారుణమన్నారు. అధికారులు స్పందించి సంతలో షెడ్లు తాగునీరు ప్రత్యేక మరుగుదొడ్లు డ్రైనేజీ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే వ్యాపారులు రైతులను కలుపుకుని పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సమితి నాయకులు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు

సిపిఐ మండల కార్యదర్శి కొదురుపాక మహేష్

**ప్రజాపక్షం/వాంకిడి :** వాంకిడి మండలంలోని పలు వ్యవసాయ పొలాల్లో వంగిపోయిన విద్యుత్ స్తంభాలను తక్షణమే సరిచేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) మండల కార్యదర్శి కొదురుపాక మహేష్ డిమాండ్ చేశారు. పలు ప్రాంతాల్లో స్తంభాలు పూర్తిగా బలహీనపడి ఒకవైపునకు వంగిపోవడంతో ఎప్పుడు కూలిపోతాయోనని రైతులు, వ్యవసాయ కూలీలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ఈదురుగాలులు, వర్షాల తీవ్రతకు ఈ స్తంభాలు నేలకొరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు.ప్రమాదాలు జరగకముందే విద్యుత్ శాఖ అధికారులు స్పందించి పొలాల్లో క్షేత్రస్థాయి పరిశీలన జరపాలని కోరారు. శిథిలావస్థకు చేరిన స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడంతో పాటు వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రైతుల భద్రతను దృష్టిలో ఉంచుకుని సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని మహేష్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

## ఎలాంటి పొరపాట్లకు తావుకుండా 'సర్'


అదనపు కలెక్టర్ రాములు



**ప్రజాపక్షం/హాజీపూర్ :** ఎస్ఐఆర్ ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా చేపట్టి త్వరగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ వి. రాములు అధికారులను ఆదేశించారు. హాజీపూర్ మండలం కర్ణమామిడి గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం ఎస్ఐఆర్‌పై నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ ప్రక్రియలో భాగంగా రూపొందించిన ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. అందులో గుర్తించిన వివరాలను గ్రామసభలో చదివి వినిపించాలని బూత్ స్థాయి అధికారులకు స్పష్టం చేశారు. చిరునామాలు మార్చుకున్న వారు, మరణించిన ఓటర్లకు (ఎఎస్డి) సంబంధించి నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేసి తదుపరి చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్ణీత గడువులోగా పారదర్శకంగా ఈ ప్రక్రియను ముగించాలని ఆయన ఆదేశించారు. మండల తహసీల్దార్, సంబంధిత అధికారులు, బూత్ స్థాయి అధికారులు, గ్రామ సర్పంచ్, ప్రజలు పాల్గొన్నారు.

## సిపిఐ కార్యాలయ కోసం స్థలం కేటాయించాలి

డిఆర్‌డిఓకు పార్టీ నేతల వినతి



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ జిల్లాలో సిపిఐ పార్టీ కార్యాలయం కొరకు తగిన స్థలాన్ని కేటాయించాలని కోరుతూ గురువారం జిల్లా రెవెన్యూ అధికారి (డిఆర్‌డిఓ)కి పార్టీ నాయకులు వినతిపత్రం అందజేశారు.గతంలో కార్యాలయ స్థలానికి సంబంధించి జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వుల ప్రతిని, ఆపై డిఆర్‌డిఓ (డిఆర్‌డిఓ) తహసీల్దార్‌కు జారీ చేసిన లేఖలను ఈ వినతిపత్రానికి జతపరిచి డిఆర్‌డిఓకు అందజేశారు. స్థల పరిశీలన,కేటాయింపు ప్రక్రియపై తహసీల్దార్‌కు ఆదేశాలు ఇవ్వాలని నాయకులు కోరారు. డిఆర్‌డిఓ సానుకూలంగా స్పం దిస్తూ, వెంటనే తహసీల్దార్‌ను ఆదేశిస్తూ లేఖ రాయడం జరిగింది. కామ్రేడ్ విలాస్,సిపిఐ నిర్మల్ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ భూక్యా రమేష్, పాల్గొన్నారు.

## సాఠే ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

సర్పంచ్ గంగాసాగర-శివరాం

**ప్రజాపక్షం/తానూర్ :** సామాజిక చైతన్యానికి, శ్రామిక వర్గాల హక్కుల పోరాటానికి తన సాహిత్యంతో బాటలు వేసిన మహనీయుడు డాక్టర్ అన్నాభావూ సాఠే అని హిప్నెల్లి గ్రామ సర్పంచ్ గంగాసాగరశివరాం పేర్కొన్నారు. సాఠే 106వ జయంతి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి.ముందుగా సర్పంచ్ చంద్రే గంగాసాగరశివరామ్,ఉప సర్పంచ్ గంగాధర్,చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.సాఠే చూపిన మార్గంలో పయనిస్తూ సామాజిక సమానత్వానికి కృషి చేయాలని పిలుపునిచ్చ ఎంఆర్ఎస్ మండల అధ్యక్షుడు సాహెబ్ రావ్,పంచాయతీ కార్యదర్శి అజీజ్, వార్డ్ సభ్యులు, మహిళలు, గ్రామస్తులు,పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల నియంత్రణ దిశగా

# పకడ్బందీ చర్యలు చేపట్టాలి

కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాపక్షం/నస్పూర్ :** జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణ దిశగా అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. గురువారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో డిసిపి భాస్కర్, అదనపు కలెక్టర్ చంద్రయ్య, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్‌లతో కలిసి మాదకద్రవ్యాల నియంత్రణ, రోడ్డు భద్రతపై సమీక్షా సమావేశాలు నిర్వహించారు. మాదకద్రవ్య రహిత మంచిర్యాల సాధనకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు నమోదైన 49 కేసుల్లో 103 మందిని గుర్తించామని, కోర్టు ద్వారా 30 మందిని డ్రగ్ డిఅడిక్షన్ కేంద్రాలకు తరలించి కౌన్సిలింగ్ ఇప్పిస్తున్నట్లు వెల్లడించారు. విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్ కమిటీల ద్వారా క్విజ్, చిత్రలేఖనం పోటీలు నిర్వహించాలని, పాఠశాలలు, కళాశాలలకు 100 మీటర్ల పరిధిలో బెల్ట్ షాపులు, పొగాకు ఉత్పత్తుల విక్రయాలను పూర్తిగా నిషేధించాలన్నారు. వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయించే మెడికల్ షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు.అనంతరం నిర్వహించిన రోడ్డు భద్రతా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రహదారి ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు అమలు చేయాలన్నారు. మున్సిపల్ పరిధిలోని రహదారులపై స్పీడ్ బ్రేకర్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, చెత్త, ఇతర ఆటంకాలను వెంటనే తొలగించాలని పేర్కొన్నారు. రవాణా నిబంధనలు ఉల్లంఘించిన 95 మంది లైసెన్సులను ఈ ఏడాది రద్దు చేసినట్లు తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా ట్రాఫిక్ పోలీసులు కఠినంగా వ్యవహరించాలని, ప్రమాదాల నివారణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఆర్‌డిఓ శ్రీనివాసరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, మంచిర్యాల, బెల్లంపల్లి, జైపూర్ ఎసిపిలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అర్హత కలిగిన ప్రతీ ఓటరు పేరు జాబితాలో ఉండేలా చూడాలి

కలెక్టర్ భవేష్ మిశ్రా



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా క్షేత్రస్థాయి సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌లో భాగంగా 2002 ఓటరు జాబితాతో మ్యాపింగ్ జరగని వారికి, పేరు, వయస్సు వంటి అంశాలలో వ్యత్యాసం కలిగి ఉన్న ఓటర్లకు హియరింగ్‌కు రావలని కోరుతూ బీఎల్ఓలు ఇంటింటికి తిరుగుతూ నోటీసులు జారీ చేస్తున్న నేపథ్యంలో కలెక్టర్ భవేష్ మిశ్రా గురువారం ఈ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బీఎల్ఓ, సూపర్‌వైజర్లు అందుబాటులో ఉన్నారా లేదా అన్నది గమనించారు. వారు విధులు నిర్వర్తిస్తున్న తీరును పరిశీలించి ఇప్పటివరకు ఎంతమందికి నోటీసులు అందించారు. ధృవీకరణ అవసరమున్న ఓటర్ల ఇంటింటి స్వయంగా వెళ్లి నోటీసులు అందించాలని, సూచించిన సమయానికి ఒకవేళ వారు రాలేకపోతే మరోమారు నోటీసు ఇవ్వాలని సూచించారు. నోటీసు అందించే సమయంలోనే ఎవరైనా ఓటర్లు ధృవీకరణ పత్రాలు సమర్పిస్తే వాటిని స్వీకరించవచ్చన్నారు. నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటించాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట నగరపాలక సంస్థ కమీషనర్ దిలీప్‌కుమార్, బీఎల్ఓ సూపరింటెండెంట్ మురళి, బీఎల్ఓ లావణ్య తదితరులున్నారు.

## గట్ లింగంపల్లిలో భూ రీసర్వే పనులు పరిశీలన

కలెక్టర్ ప్రతీక్ జైన్



**ప్రజాఫక్షం/సంగారెడ్డి :** నారాయణ ఖేడ్ నియోజకవర్గం మానూర్ మండల పరిధిలోని గట్ లింగంపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూ రీసర్వే పనులను గురువారం సంబందించిన అధికారులతో కలసి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పరిశీలించారు. రీ సర్వే పనులను ఏలాంటి తప్పిదాలకు తావు లేకుండా పారదర్శకంగా నిబంధనల ప్రకారం పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. భూ యజమానులకు ఇబ్బందులు కలగకుండావారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాని ఆదేశించారు. నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి,డిప్యూటీ కలెక్టర్ ప్రతిభ, శేఖర్ సర్వే ల్యాండ్ ఏడి మానూర్ తహసీల్దార్ విష్ణు, సాగర్ ,ఆర్ఐ శంకర్ రెడ్డి, సర్వేయర్ సుమలత, జూనియర్అసిస్టెంట్ ఖాజా మోయినుద్దీన్, ఉపసర్పంచ్‌తో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు. గ్రామంలోభూ రీ సర్వే ప్రక్రియను పూర్తి చేసేందుకు సమన్వయంతో పనిచేస్తున్నట్లు తెలిపారు.

## అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం జరిగేలా కృషి

కలెక్టర్ భవేష్ మిశ్రా



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ఎస్‌సి,ఎస్‌టి అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం జరిగేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో గురువారం కలెక్టర్ అధ్యక్షతన ఎస్‌సి,ఎస్‌టి అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ జిల్లా కమిటీ సమావేశం జరిగింది.అట్రాసిటీ కేసుల పురోగతిపై నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ డివిజన్ల వారిగా కలెక్టర్ సమీక్షించారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై చేపట్టిన చర్యలపై అడిగి తెలుసుకున్నారు. బాధితులకు సత్వర న్యాయం జరిగేందుకు వీలుగా పకడ్బంధీగా దర్యాప్తు జరిపి పూర్తి ఆధారాలను సేకరించి సకాలంలో ఛార్జిషీట్ ఫైల్ చేయాలన్నారు. పోలీసు, రెవెన్యూ తదితర శాఖల అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలని సూచించారు. అట్రాసిటీస్ కేసుల్లో బాధితులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన పరిహారం, ఇతర సహాయ సహకారాల విషయంలో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలన్నారు. కేసుల సత్వర పరిష్కారం కోసం రెవెన్యూ తదితర శాఖల కార్యాలయాలతో ఎప్పటికప్పుడు అవసరమైన నివేదికలను, లేఖలను అందజేయాలని సూచించారు. కేసుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ బాధితులకు అవసరమైన సహాయ సహకారలందేలా చూడాలని సూచించారు. ప్రతినెల సివిల్ రైట్స్ డే కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలని, దళిత, గిరిజన వర్గాల ప్రజల హక్కులపై వారికి అవగాహన కల్పించటంతో పాటు వారి సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు జీవనాధారం కోసం ప్రభుత్వం అందజేసిన అసైన్డ్ భూములను ఎవరైనా కబ్జా చేసినట్లయితే తమ దృష్టికి తేవాలని, బాధితులకు భూభారతి చట్టం ద్వారా న్యాయం జరిగేలా కృషి చేస్తామని కలెక్టర్ సూచించారు. కాగా గ్రామాల్లో సాంఘిక బహిష్కరణలు వంటి సంఘటనలు జరిగినప్పుడు బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు డీసీపీ శుభం నగ్రాలే, జిల్లా రెవెన్యూ అధికారిని గీత, జిల్లా సాంఘిక సంక్షేమాభివృద్ధికారిని రజిత, నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ ఏసీపీలు ప్రకాష్, శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రెడ్డి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ భాస్కర్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## భూముల వివరాలతో సమగ్ర నివేదికలు ఇవ్వాలి

ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ హరిత



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** జిల్లాలోని వ్యవసాయ, వ్యవసాయేతర భూముల వివరాలతో సమగ్ర నివేదికలు సిద్ధం చేసి సమర్పించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ ఆర్డీవోలు లోకేశ్వర్‌రావు, చెన్నూరి కిష్టయ్య, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ వినయ్‌తో కలిసి తహసీల్దార్లు, ఇతర అధికారులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లావుని పట్టా, సీలింగ్, ప్రభుత్వ, అటవీ, దేవాదాయ, వక్ఫ్, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఆస్తులతో పాటు విచారణ సంస్థలు అటాచ్ చేసిన ఆస్తులను నిషేధిత జాబితాలోని సంబంధిత కేటగిరీల్లో చేర్చాలని సూ చించారు. సాగునీటి ప్రాజెక్టులు, కాలువల అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం సేకరించిన భూ ముల వివరాలను కూడా జాబితాలో పొందుపరచాలని తెలిపారు. సాదాబైనామా, రెవెన్యూ సదస్సులు, భూభారతిలో భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణిలో భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు పాల్గొన్నారు.

## ఎఐటియుసి రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి : గంగయ్య

**ప్రజాపక్షం/ నేరడిగొండః** కరీంనగర్‌లో వచ్చే నెల 6 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించే ఎఐటియుసి తెలంగాణ 4వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఎఐటియుసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కళ్ళేపెల్లి గంగయ్య పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో మండల కమిటీ ఆధ్వర్యంలో మహాసభల గోడ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక చట్టాలను, నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్క కార్మికుడు సభలకు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు పెరుమళ్ల నరసయ్య, గంగాధరి గంగయ్య, రౌట్ల రాజేశ్వర్, గురువయ్య, కార్మిక నాయకులు పాల్గొన్నారు.




## 'సర్' ప్రక్రియలో 50 మందికి నోటీసులు

మెదక్ ఆర్‌డిఓ రమాదేవి



**ప్రజాపక్షం/మెదక్ :** ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా మెదక్ పట్టణంలోని 6వ వార్డు పరిధిలోని 132, 133 బూత్ లలో నోమ్యాపింగ్, క్లరికల్ మిస్టేక్‌లు ఉన్న ఓటర్లకు సంబంధించి సుమారు 50 మందికి నోటీసులు జారీ చేసినట్లు మెదక్ ఆర్డీ రమాదేవి తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ఓటర్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్ లెవల్ ఏజెంట్లు (బిఎల్‌ఏ), కౌన్సిలర్లు, బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓ) పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఆమె సూచించారు. ఈ నెల 27వ తేదీ గురువారం ఉదయం లేదా మధ్యాహ్నం ఆయా బూత్‌ల పరిధిలో కౌన్సిలర్లు, బీఎల్ఏలు, ఓటర్లతో సమావేశాలు నిర్వహించాలని బీఎల్ఓలకు సూచించారు. ఈ సమావేశాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియలో నో మ్యాపింగ్, క్లరికల్ మిస్టేక్‌లు ఉన్న ఫారాల వివరాలను ఓటర్లకు స్పష్టంగా తెలియజేయాలని ఆర్డీఓ సూచించారు. బీఎల్ఏ సంగ శ్రీకాంత్, అంగన్‌వాడీ టీచర్లు మమత, సిద్ధమ్మ, ఆర్డీఓ రమాదేవి, ఎమ్మార్వో లక్ష్మణ్‌బాబు, ఆర్ఐ లక్ష్మణ్, వీఆర్వో ప్రసాద్‌తో పాటు కాలనీ వాసులు అభిషేక్, ముజంబిల్, కొండాపూరం ప్రసాద్, సురేష్, ఇలియాస్, సుధాకర్, తాజ్ కిషన్ పాల్గొన్నారు.

## శిథిలావస్థలో తాగునీటి ట్యాంకు.. పట్టించుకోని అధికారులు




**ప్రజాపక్షం/అల్లాదుర్గం :** మండలంలోని బహిరన్ దిబ్బ గ్రామంలో తాగునీటి ట్యాంకు శిథిలావస్థకు చేరుకోవడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. గ్రామంలో ఏళ్ల క్రితం నిర్మించిన ఈ తాగునీటి ట్యాంకు ప్రస్తుతం పూర్తిగా దెబ్బతింది. ట్యాంకుకు ఉన్న నాలుగు పిల్లర్లు పగుళ్లు వచ్చి పెచ్చులు ఊడిపోతున్నాయి. రక్షణ గోడలు దెబ్బతిని, సిమెంట్ పూత పూర్తిగా ఊడిపోయి ఇనుప చువ్వలు బయటకు వచ్చాయి. ఇనుప చువ్వలు తుప్పు పట్టి ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ ట్యాంకు సమీపంలోనే నివాస గృహాలు ఉండటం, చిన్న పిల్లలు ఆ ట్యాంకు కింద ఆడుకుంటుండటంతో ప్ర మాదం పొంచి ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, ట్యాంకును పరిశీలించి మరమ్మతులు చేపట్టాలని, అవసరమైతే కొత్త ట్యాంకును నిర్మించాలని గ్రామ ప్రజలు కోరారు.

## 'భూభారతి'లో రూ.లక్షల అవినీతి

# పేదల భూములు ధారాదత్తం!

మామడ తహసీల్దార్ కార్యాలయంలో ప్రైవేట్ వ్యక్తుల హల్చల్.. అక్రమ విరాసత్ పట్టా?



**ప్రజాపక్షం/నిర్మల్/మామడ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూభారతి వ్యవస్థ కొందరు అక్రమార్కులు, అధికారుల కుమ్మక్కుతో లొసుగులమయంగా మారుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మామడ మండల తహసీల్దార్ కా ర్యాలయంలో ప్రైవేట్ వ్యక్తుల ప్రమేయం పెరిగిపోయిందని, లంచాలు ఇస్తేనే పనులు జరుగుతున్నాయని స్థానిక ప్రజలు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. సదాబైనామాలు, డిఎస్ పెండింగ్, విరాసత్, ఆధార్ సిడింగ్, ప్రోహిబిటెడ్ ల్యాండ్స్ తదితర రికార్డులను తారుమారు చేస్తూ లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నారనే ఆరోపణ రేపుతున్నాయి.

**తాండ్ర శివారులో 3 ఎకరాల భూమిపై కన్ను :** మామడ మండలం తాండ్ర శివారులోని సర్వే నంబర్ 113/2 (ఖాతా నం. 111) లో గల 3.00 ఎకరాల లావుని పట్టా (అసైన్డ్) భూమిని కాజేసేందుకు ఒక రాజకీయ పార్టీ నాయకులు, అధికారులు కలిసి పథకం పన్నారు. ఈ భూమి తాండ్ర గ్రామానికి చెందిన కుడుకల పోశెట్టి (తండ్రి: గంగారాం) పేరిట ఉంది. పోశెట్టికి ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉండగా, వీరిలో ఒక కుమారుడు గ్రామంలో, మిగతా వారు వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్నారు.


**నకిలీ డెత్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికేట్లు :** ఈ భూమిని దక్కించుకోవడానికి అక్రమార్కులు కుడుకల పోశెట్టి 20.04.2000 నాడు మరణించినట్లుగా తాండ్ర గ్రామ పంచాయతీ జారీ చేసినట్లు ఒక నకిలీ మరణ ధృవీకరణ పత్రాన్ని (డిఆర్ ఎన్‌ఓ. 158) సృష్టించారు. 2000 సంవత్సరంలో తహసీల్దార్లు రిజిస్ట్రార్లుగా వ్యవహరిస్తున్న సమయానికే, పంచాయతీ కార్యదర్శి సంతకంతో ఈ పత్రం జారీ కావడం అధికారుల నిర్లక్ష్యానికి, అక్రమాలకు అద్దం పడుతోంది.అంతే కాకుండా, పోశెట్టి బీసీ తెనుగు సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కాగా, బీసీ గౌడ్ కులానికి చెందిన కైరి సుజాత అనే మహిళను ఆయన ఏకైక కుమార్తెగా చూపుతూ 12.04.2025న తహసీల్దార్ ద్వారా నకిలీ కుటుంబ సభ్యుల ధృవీకరణ పత్రం (ఎఫ్ఎ ఎంసి 022501706773) ఇప్పించారు. కులాలు వేరైనా అధికారులు ఈ వ్యత్యాసాన్ని పట్టించుకోకపోవడం వెనుక భారీగా చేతులు మారినట్లు ఆరోపణలు ఉన్నాయి.

**విచారణలో వెలుగులోకి వచ్చిన నిజాలు :** ఆధార్ ఈకేవైసీ కాకపోవడంతో పెండింగ్‌లో పడిన ఈ భూమిని, నకిలీ పత్రాల ఆధారంగా విరాసత్ (దరఖాస్తు నెం. 2500721758) ద్వారా వేరొకరి పేరిట మార్చేందుకు ప్రయత్నించారు. స్థానిక జిపిఓ (జిపిఒ) విచారణ కు వెళ్లినప్పుడు పొంతన లేని సమాధానాలు రావడంతో అనుమానం వచ్చి, గ్రామంలో నిజమైన వారసులు ముగ్గురు కుమారులు, ముగ్గురు కూ తుళ్లు ఉన్నారని, కైరి సుజాతకు పట్టాదారుడికి ఎలాంటి సంబంధం లేదని తేలడంతోతంత్రం వెలుగులోకి వచ్చింది. ఒత్తిళ్లు వచ్చినా తప్పుడు నివేదిక ఇచ్చేందుకు సదరు జీపీఓ నిరాకరించి దరఖాస్తును తిరస్కరించినట్లు సమాచారం.

**ఉన్నతాధికారుల విచారణకు డిమాండ్ :** ఒక జిల్లాస్థాయి నాయకుడి ప్రోద్బలంతోనే ఈ తహసీల్దార్ కార్యాలయంలో ప్రైవేట్ వ్యక్తుల రాజ్యం నడుస్తోందని, అమాయక పేదల భూములను దారాదత్తం చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. బాధ్యులైన తహసీల్దార్, సంబంధిత అధికారులపై ఉన్నతాధికారులు శాఖాపరమైన విచారణ జరిపి, భూభారతి చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

విజయ్ దేవరకొండ, రశ్మిక మందన్న జంటగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా మూవీ 'రణబాలి'. ఈ సినిమాకు రాహుల్ సంకృత్యన్ దర్శకత్వం వహిస్తున్నారు. టి సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై 'రణబాలి' సినిమాను ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ హ్యూజ్ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు.

రీల్



## 'దసరా'కు రానున్న 'రణబాలి'

విజయ్ దేవరకొండ, రశ్మిక మందన్న జంటగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా మూవీ 'రణబాలి'. ఈ సినిమాకు రాహుల్ సంకృత్యన్ దర్శకత్వం వహిస్తున్నారు. టి సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై 'రణబాలి' సినిమాను ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ హ్యూజ్ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. 19వ సెంచరీ నేపథ్యంలో 1854 నుంచి 1878 మధ్య బ్రిటీష్ పాలనా కాలంలో జరిగిన యదార్థ చారిత్రక సంఘటనల ఆధారంగా రణబాలి సినిమా రూపొందుతోంది. ఈ సినిమా అక్టోబర్ 16న విజయదశమి పర్వదినం సందర్భంగా వరల్డ్ వైడ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈ మూవీ రిలీజ్ డేట్ అనౌన్స్ మెంట్ సందర్భంగా రిలీజ్ చేసిన పోస్టర్ లో విజయ్ దేవరకొండ చేతిలో కత్తితో ఫెరోషియస్ గా కనిపించి ఆకట్టుకుంటున్నారు. రణబాలి రాకతో దసరా బాక్సాఫీస్ మరింత సందడిగా మారనుంది. విజయ్ దేవరకొండ, రశ్మిక మందన్న, ఆర్నాల్డ్ వోస్లూ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సమర్పణ గుల్షన్ కుమార్, భూషణ్ కుమార్, టి సిరీస్ ఫిలింస్, కో ప్రొడ్యూసర్స్ అనురాగ్ పర్వతనేని, శివ చనన, మ్యూజిక్ అజయ్ అతుల్, డీఓపి నీరవ్ షా, జిష్ణు భట్టాచార్జీ, రైటర్ ప్రమోద్ తమ్మినేని ప్రొడక్షన్ డిజైనర్ శివం రావు నాగోని, ఎడిటర్ కార్తీక శ్రీనివాస్ ఆర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఆర్ చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ చెంబోలు సాయి ఆదిత్య, కొరియోగ్రఫీ కృతి మహేశ్, కాస్ట్యూమ్ డిజైనర్ అర్చన రావు, ఆర్ట్ డైరెక్టర్ విఠల్ కోసనం, యాక్షన్ కొరియోగ్రాఫర్స్ యెన్నిక్ బెన్, ఆండీ లాంగ్ గ్యుయెన్, రాబిన్ సుబ్బు.

# పొలిటికల్ యాక్షన్ డ్రామాగా 'లెగసీ'

### మదనపల్లె పరిసర ప్రాంతాల్లో నెలరోజుల పాటు చిత్రీకరణ




మాస్ కా దాస్ విశ్వక్ సేన్ కథానాయకుడిగా, దర్శకుడు సాయి కిరణ్ దైదా దర్శకత్వంలో కలాహీ మీడియా పతాకంపై తెరకెక్కుతున్న పొలిటికల్ యాక్షన్ డ్రామా 'లెగసీ'. యశ్వంత్ దగ్గుమాటి, సాయి కిరణ్ రెడ్డి దైదా నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంజయ్ సాంబ్రాణి, వి.వి.ఎస్. ప్రసాద్ సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఈ ఏడాది ప్రారంభంలో విడుదలైన 'లెగసీ' అనౌన్స్‌మెంట్ టీజర్ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ ఆసక్తిని కలిగించింది. విమర్శకుల ప్రశంసలు అందుకున్న 'పిండం' చిత్రాన్ని నిర్మించిన కలాహీ మీడియా నుంచి వస్తున్న రెండో చిత్రం కావడంతో లెగసీపై అంచనాలు మరింత పెరిగాయి. పవర్, ఫ్యామిలీ, ప్రేమ, ద్రోహం నేపథ్యంలో లెగసీ సినిమా సాగుతుంది. పొలిటికల్ యాక్షన్ డ్రామా. అధికారం, కుటుంబం, ప్రేమ, ద్రోహం చుట్టూ సాగే ఈ కథలో ఒక వారసుడు తాను కోరుకోని ప్రమాదకరమైన ప్రపంచంలోకి అడుగుపెడతాడు. తన తండ్రి గతానికి సంబంధించిన దాగి ఉన్న నిజాలను ఎదుర్కొంటూ, శక్తివంతమైన ప్రత్యర్థులతో పోరాడుతూ తనపై పడిన వారసత్వపు భారాన్ని మోసే పరిస్థితిని ఎదుర్కొంటాడు.ఈ చిత్రంలో విశ్వక్ సేన్ ఇప్పటివరకు చూడని విభిన్నమైన, శక్తివంతమైన అవతార్లో కనిపించనున్నారు. ప్రముఖ నటుడు కె కె మేనన్ అత్యంత శక్తివంతమైన ప్రతినాయకుడి పాత్రలో నటిస్తున్నారు. ఈ చిత్రంలో ఏక్తా రాథోడ్ కథానాయికగా నటిస్తుండగా, మురళీ మోహన్, కె కె మీనన్, రావు రమేష్, సచిన్ ఖేడేకర్, ఖుషీ రవి, కల్యాణి నటరాజన్, రాజీవ్ కనకాల, అనీష్ కురువిల్లా, కలెక్టర్ శ్రీనివాస్, రవి కాలే, అమిత్ తివారీ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. జిజు సన్నీ ఛాయాగ్రహణం, గోవింద్ వసంత్ సంగీతం, సిరీష్ ప్రసాద్ ఎడిటింగ్, రాజీవ్ నాయర్ ప్రొడక్షన్ డిజైన్, జషువా యాక్షన్ కొరియోగ్రఫీ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.



## నాగార్జున 100వ సినిమా టైటిల్ ఏమిటో?

నాగార్జున ప్రస్తుతం తన కెరీర్‌లో ప్రతిష్ఠాత్మకమైన 100వ చిత్రంలో నటిస్తున్నారు. కింగ్ 100 వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై రూపొందిస్తున్నారు. రా కార్తీక్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాతో ఆయన తెలుగులో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఆగస్టు 29న నాగార్జున పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్ర టైటిల్ గ్లింప్స్‌ను విడుదల చేసేందుకు మేకర్స్ సిద్ధమవుతున్నారు. తమ అభిమాన హీరో 100వ సినిమాకు ఎలాంటి టైటిల్ పెట్టబోతున్నారనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. ఈ చిత్రంలో కీలక పాత్రలో నటిస్తున్నారు. 'నిన్నే పెళ్లాడతా', 'ఆవిడ మా ఆవిడే' వంటి చిత్రాల్లో నాగార్జునతో కలిసి నటించిన టబు.. భారీ స్థాయిలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి ప్రముఖ సాంకేతిక నిపుణులు పనిచేస్తున్నారు. రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. టైటిల్ గ్లింప్స్‌తో పాటు సినిమాకు సంబంధించిన వెల్లడించనున్నారు.ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: రా కార్తీక్, సంగీతం: దేవిశ్రీ ప్రసాద్.

# తండ్రి ఔనత్యాన్ని చెప్పే 'ఫాదర్'



డార్లింగ్ కృష్ణ, ప్రకాష్ రాజ్, అమృత అయ్యంగార్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా 'ఫాదర్'. ఈ చిత్రాన్ని ఆర్‌సి స్టూడియోస్ బ్యానర్‌పై ఆర్ చంద్రు, యమున చంద్రశేఖర్, ఆనంద్ పండిట్ నిర్మిస్తున్నారు. రాజమోహన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఫాదర్, సన్ బాండింగ్ నేపథ్యంగా సాగే ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామా కథతో తెరకెక్కిన ఈ సినిమా త్వరలో గ్రాండ్ పాన్ ఇండియా థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఫాదర్ సినిమా టీజర్ రిలీజ్ చేశారు. 'ఫాదర్' సినిమా టీజర్ ఎలా ఉందో చూస్తే తండ్రి( ప్రకాష్ రాజ్ )ని దేవుడిలా కొలిచే కొడుకు కృష్ణ (డార్లింగ్ కృష్ణ). మళ్లీ జన్మంటూ ఉంటే కృష్ణకు తండ్రిగా పుట్టాలని కోరుకునేంత ప్రేమను గుండెల నిండా నింపుకుంటాడు తండ్రి. అంతగా ప్రేమించిన కొడుకును వదిలి తండ్రి దూరంగా వెళ్లిపోవాలనుకుంటాడు. ఈ ఎడబాటుకు కారణం ఏంటి, కొడుకును వదిలి తండ్రి ఎందుకు దూరంగా వెళ్లిపోవాలని అనుకున్నాడు వంటి అంశాలతో 'ఫాదర్' సినిమా టీజర్ ఆసక్తికరంగా సాగింది. గగనపు సూర్యుడే, వెలుగుల చంద్రుడే, ధరణికి దేవుడే నాన్నా...అంటూ వచ్చిన బీజీఎం సాంగ్ హార్ట్ టచింగ్ గా ఉంది. ఫాదర్, సన్ రిలేషన్ నేపథ్యంగా ఒక బ్యూటిఫుల్ ఎమోషనల్ ఫ్యామిలీ మూవి చూడబోతున్నామనే ఇంప్రెషన్ ను ఈ టీజర్ కలిగిస్తోంది. ఈ చిత్రానికి కో ప్రొడ్యూసర్స్ రూప పండిట్, రాహుల్ వి దూబె, మాధవ్ సిరాన్, మ్యూజిక్ నకుల్ అభ్యంకర్, డిఒపి సుగ్నాన్, స్టంట్స్ వినోద్, డైలాగ్ రైటర్ మంజు మాండవ్య, లిరిక్స్ రాంబాబు గోసాల, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్ దయాల్ పద్మనాభన్, మౌర్య మంజునాథ్.





## ఫోర్బ్స్ ఇండియా కవర్‌పై అల్లు అర్జున్

జాతీయ అవార్డు గ్రహీత అల్లు అర్జున్ మరో అరుదైన ఘనతను సొంతం చేసుకున్నారు. భారతదేశంలోని టాప్ 100 ప్రముఖ సెలబ్రిటీలను సెలబ్రేట్ చేస్తూ రూపొందించిన ఎంతో ప్రతిష్టాత్మకమైన ఫోర్బ్స్ ఇండియా 'షో స్టాపర్స్ 2026' ఎడిషన్ కవర్‌పై ఆయన తనదైన స్టైల్లో మెరిశారు. ఈ కవర్ పేజీ ద్వారా సెలబ్రిటీల ప్రభావం, క్రేజ్‌కు సంబంధించి అల్లు అర్జున్ అగ్రస్థానంలో నిలిచారు. ఆయన స్టార్డమ్ స్థాయి, బాక్సాఫీస్ వద్ద సత్తా, అలాగే ఒక స్టార్గా ఆయన అసాధారణమైన బ్రాండ్ వేల్యూ ఈ గుర్తింపుతో మరోసారి స్పష్టమైంది.తెలుగు సినిమా అల్లు అర్జున్ ప్రభావం ఎంత దూరం విస్తరించిందో చెప్పటానికి ఇదొక గొప్ప తిరుగులేని గుర్తింపు. నటన, వ్యక్తిత్వం, ప్రేక్షకులతో ఆయనకున్న అసాధారణ అనుబంధం.. ఈ అరుదైన కలయికే అల్లు అర్జున్‌ను జాతీయ స్థాయిలో అగ్రస్థానానికి తీసుకెళ్లింది. 'పుష్ప' ఫ్రాంచైజీతో అప్పటికే ఉన్న ఆయన భారీ క్రేజ్ మరింత విస్తరించి, దేశవ్యాప్తంగా ఒక సాంస్కృతిక ప్రభంజనంగా మారింది. అల్లు అర్జున్ అద్భుతమైన ప్రయాణంలో మరో కీలక మైలురాయిగా నిలిచింది. ఒక అసాధారణ ఫినామినన్‌గా అల్లు అర్జున్ సృష్టిస్తోన్న ప్రభంజనానికి ఇది మరో గొప్ప గుర్తింపుగా చెప్పొచ్చు.

### మెగాస్టార్ మిత్రుడు, నటుడు

## నారాయణరావు కన్నుమూత



ప్రముఖ నటుడు, చిరంజీవి స్నేహితుడు గుళ్ళపల్లి వెంకట నారాయరావు ( జివి నారాయణ రావు) కన్నుమూశారు. ఆయన ఇకలేరనే విషాదకర వార్తను నటి కరాటే కల్యాణి సోషల్‌మిడియా వేదికగా వెల్లడించారు. 9 అక్టోబర్ 1953లో కృష్ణ జిల్లా కురుమద్దాలి గ్రామంలో జన్మించిన నారాయణ రావు బాల్యం, విధ్యాబ్యాసం గుంతకల్లులో సాగింది. ఆయనకు భార్య , పిల్లలకు ఉన్నారు. విదేశాల నుంచి వారి పిల్లకు రావలసి ఉన్నందున 28వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు జూబిలీహిల్స్ లోని మహా ప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. నారాయణ రావు 100కు పైగా చిత్రాల్లో నటించారు. 1976లో కె.బాలచందర్ దర్శకత్వం వహించిన 'అంతులేని కథ' చిత్రంతో నటుడిగా పరిచయం అయ్యారు. తొలి సినిమాకే ఉత్తమ సహాయ నటుడిగా నంది అవార్డు అందుకున్నారు. మద్రాస్ ఫిలిం ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ తీసుకున్న నారాయణరావు. రజనీకాంత్, చిరంజీవిలకు మంచి మిత్రుడే. 'అంతులేని కథ', 'ముత్యాల పల్లకి', 'అంగడి బొమ్మ', 'చిలకమ్మ చెప్పింది', 'గ్యాంగ్ లీడర్', హిట్లర్ లాంటి సినిమాల్లో నటించారు. దేవాంతకుడు, ఇంటికో రుద్రమ్మ, యముడికి మొగుడు, పెళ్ళి నీకు శుభం నాకు సినిమాలను నిర్మించారు. నారాయణరావు మృతి పట్ల మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా) సంతాపం తెలిపింది. గిడుగు విశాలాక్షి వద్ద భరతనాట్యం, నటరాజ రామకృష్ణ వద్ద కూచిపూడి నృత్యం, ఎ.ఆర్.కృష్ణ వద్ద నటన నేర్చుకున్నారు. చదువుకునే రోజులలో మహమ్మద్ బీన్ తుగ్లక్, ప్రతాపరుద్రీయం, మంచుతెర లాంటి నాటకాలలో నటించారు. దివంగత సినిమా నటులు కోట శ్రీనివాసరావు, నూతన ప్రసాద్, దేవదాస్ కనకాలకు నారాయణరావుకు రంగస్థల మిత్రులు. సినిమాలతో పాటు పలు టి.వి. సీరియళ్లలోనూ నారాయణ రావు నటించి మెప్పించారు.

# జుట్టు కత్తిరించడం కాదు..'శిరోముండనమే'!

### వ్యాపారవేత్త సుభాష్ చంద్రకు రూ.6.5 కోట్ల చెల్లింపు ఆమోదంపై కాంగ్రెస్ ధ్వజం

**న్యూఢిల్లీ :** వ్యాపారవేత్త సుభాష్ చంద్రకు ఉన్నటువంటి రూ.22,006 కోట్ల బకాయిలను పరిష్కరించేందుకు రూ.6.5 కోట్ల చెల్లింపును ది నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సిఎల్‌టి) ఆమోదించడంపై కాంగ్రెస్ పార్టీ గురవారం కేంద్రంపై విమర్శల దాడికి దిగింది. ఇది కేవలం 'జుట్టుకత్తిరింపు' (హెయిర్‌కట్) మాత్రమే కాదని, 2016, ఇన్‌సాల్వెన్సీ(దివాలా), బాంక్రప్టసీ కోడ్‌ను పూర్తిగా అపహాస్యం చేసే 'శిరోముండనమే' (గుండుగీయడం) అని వ్యాఖ్యానించింది. అయితే, దీనిపై సుభాష్ చంద్ర లేదా అతని గ్రూప్ నుంచి తక్షణ స్పందన ఏదీ రాలేదు. ద ట్రిబ్యునల్ ఎన్‌సిఎల్‌టి ఒక తిరిగి చెల్లింపు ప్రణాళికను ఆమోదించింది. దీని ప్రకారం, ఆ మీడియా దిగ్గజం దాని వ్యక్తిగత దివాళా పరిష్కార ప్రక్రియలో అంగీకరించిన రుణదాతల సంబంధిత దాదాపు రూ.22,006.57 కోట్ల క్లెయిమ్‌లను పరిష్కరించుకోవడానికి కేవలం రూ.6.5 కోట్లు మాత్రమే చెల్లిస్తారు. దీనివల్ల రుణదాతలకు దాదాపు 99.97శాతం నష్టం వాటిల్లుతుంది. మంగళవారం నాడు మూడవ సభ్యునిగా తీర్పును ఇచ్చిన ఎన్‌సిఎల్‌టి సభ్యుడు (జ్యుడీషియల్) నీలేష్ శర్మ రికవరీ ఆమోదానికి అర్హత లేనంత తక్కువగా ఉందని, రుణదాతలు చేసిన అభ్యంతరాలను తిరస్కరిస్తూ, ఇన్‌సాల్వెన్సీ అండ్ బాంక్రప్టసీ కోడ్ (ఐబిసి) సెక్షన్ 114 కింద ఈ ప్రణాళికను ఆమోదించారు.ఈ పరిణామంపై రమేష్ స్పందిస్తూ 'ఫైనాన్స్ పరిభాషలో రుణదాతలకు డబ్బు చెల్లించాల్సి ఉన్నప్పుడు, రుణ గ్రహీత దానిలో కొంతభాగం మాత్రమే చెల్లిస్తే ఆ వ్యత్యాసాన్ని శాతంలో వ్యక్తపరిస్తే దానిని 'హెయిర్‌కట్' అంటారు' అని పేర్కొన్నారు. ఒక ప్రముఖ వ్యాపారవేత్త రుణచెల్లింపు ప్రణాళికను జాతీయ కంపెనీ చట్టాల ట్రిబ్యునల్ ఇప్పుడే ఆమోదించింది. దీని ప్రకారం అంగీకరించిన సుమారు 22,006.57 కోట్ల క్లెయిమ్‌లకు గాను, రుణదాతలు కేవలం రూ.6.5 కోట్లు మాత్రమే తిరిగి పొందుతారని చంద్రను ఉద్దేశిస్తూ ఆయన అన్నారు. 'ఇది కేవలం జుట్టుకత్తిరించుకోవడం మాత్రమే కాదు. ఇది నిజానికి ఒక 'ముండన్'. ఇది ఇన్సాల్వెన్సీ అండ్ బాంక్రప్టసీ కోడ్ ,2026ను పూర్తిగా అపహాస్యం చేస్తోంది' అని రమేష్ 'ఎక్స్'పోస్ట్‌లో ఆరోపించారు. దీనికిముందు నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ కు చెందిన ఇద్దరు సభ్యులు భిన్నమైన తీర్పు ఇవ్వగా, అభిప్రాయ భేదాల నేపథ్యంలో ఫోరం అధ్యక్షుడు శర్మను మూడవ సభ్యుడిగా నియమించారు. ఈ చెల్లింపు ఆచరణ సాధ్యంకానిది అని వాదించిన ఎల్‌ఐసి హౌసింగ్ ఫైనాన్స్ నేతృత్వంలోని అసమ్మతి రుణదాతల వాదనలను శర్మ తోసిపుచ్చారు. 'ఎల్‌ఐసి హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఎల్‌ఐసిహెచ్‌ఎఫ్‌ఎల్) విషయంలో, వారు అంగీకరించిన క్లెయిమ్ రూ.1,322.39 కోట్లుగా ఉండగా, ప్రతిపాదిత తిరిగి చెల్లింపు కేవలం దాదాపు రూ.38,09, 294 మాత్రమే. ఇది వారు అంగీకరించిన బకాయిలలో సుమారు 0.028శాతానికి సమానం.ఇంతటి అతి స్వల్ప తిరిగి చెల్లింపు ఈ ట్రిబ్యునల్ ఆమోదాన్ని పొందలేదని వాదించబడింది' అని తన వాదనను నమోదు చేస్తూ ఎన్‌సిఎల్‌టి ఉత్తర్వులో పేర్కొంది. అంతేకాకుండా, తిరిగి చెల్లింపు ప్రణాళికలోనే ప్రతిపాదిత రూ.6.5 కోట్ల మొత్తాన్ని కూడా కేవలం సూచనాత్మకంగానే పరిగణించారు. ఖచ్చితమైనదిగా కాదు. దీనివల్ల, ఆ ప్రణాళిక తాత్కాలికమైనదిగా,నిశ్చయాత్మకం కానిదిగా, ఆమోదానికి అనర్హమైనదిగా మారింది.

అయితే అభ్యంతరం తెలిపిన రుణదాతలు అందరికీ కలిపి 20శాతం కంటే తక్కువ ఓటింగ్ వాటా ఉందని, కాగా, ఈ ప్రణాళికకు అవసరమైన 80.81శాతం ఓటింగ్ వాటాలతో ఆమోదం లభించిందని ఎన్‌సిఎల్‌టి పేర్కొంది. శర్మ తన 144పేజీల సుదీర్ఘ ఉత్తర్వులో, రిజల్యూషన్ ప్రొఫెషనల్ చేసిన వాల్యుయేషన ప్రకారం, ప్లాన్ కింద ప్రతిపాదించిన మొత్తం కంటే చంద్ర వ్యక్తిగత ఆస్తి విలువ గణనీయంగా తక్కువగా ఉందని, దానిని తిరస్కరించడం ద్వారా వ్యతిరేకించే రుణదాతలు మరింత మొత్తాన్ని రాబట్టుకునే అవకాశం లేదని, అలాచేస్తే వారు ఆర్థికంగా కోలుకునే స్థితిలో చెల్లించగలగడానికి బదులుగా దివాలా తీయవలసి వస్తుందని పేర్కొన్నారు.

## హరీశ్‌రావు ప్రయత్నాలు

(మొదటి పేజీ తరువాయి)

ఇరిగేషన్, పాల వ్యాపారం ఒకరు, రియల్ ఎస్టేట్ , ఇసుక దందాను మరొకరు పంచుకున్నారని, లాంటి బిఆర్‌ఎస్‌కు మళ్లీ అవకాశం ఇద్దామా? అని కవిత ప్రశ్నించారు. ఇటీవలే మెదక్ జిల్లా ఎమ్మెల్యేలలతో హరీష్ రహస్య మంతనాలు నిర్వహించారని, కెసిఆర్ వారసత్వం కెటిఆర్‌కు రావద్దని హరీశ్ చెప్పిన విషయాన్ని ఆ సమావేశంలో పాల్గొన్న ఒక ఎమ్మెల్యే ద్వారా తెలిసిందన్నారు. బిజెపితో హరీష్ రావు దోస్తీకి సంబంధించి ఆధారాలు తన వద్ద ఉన్నాయని, రాజ్ పుష్ప స్కైవాక్ ఓపెన్ విల్లాస్ లో బీజేపీ ముఖ్యనేతతో హరీష్ రావు తరచూ సమావేశమవుతున్నారని ఆరోపించారు. గుంపు మేస్త్రీతో కూడా హరీశ్‌రావుకు లాలూచీ ఉందని, ఇటీవలే వీళ్లు లండన్ లో రహస్యంగా సమావేశమై అగ్రిమెంట్ చేసుకున్నారని అన్నారు. హరీష్ రావు వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్న సమయంలో నారాయణ, చైతన్య కాళాశాల నుంచి 8 ఏళ్ల పాటు రూ 960 కోట్లు దండుకున్నారని,అలాగే కామినేని, యశోద, కిమ్స్ లాంటి కార్పొరేట్ హాస్పిటల్స్‌కు కూడా పాలను సరఫరా చేశారని వివరించారు. సిఎం రేవంత్ రెడ్డి ఆంధ్రావాళ్ల చేతిలో బందీ అయ్యారని మండిపడ్డారు. బ్రహ్మణ పరిషత్‌కు ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవులలో ఆంధ్రావాళ్లను నియమించారన్నారు. రెడ్ కో ఛైర్మన్ గా, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ, విద్యుత్, నీటిపారుదల శాఖలలో కూడా ఆంధ్రా పెత్తనమే ఉన్నదని మండిపడ్డారు.

## బస్సు—ఆటో ఢీ..

(మొదటి పేజీ తరువాయి)

ప్రయాణికుడిని ఎక్కించుకునేందుకు చిలకలూరిపేట బైపాస్ వద్దకు వచ్చింది. ప్రయాణికుడిని ఎక్కించుకున్న అనంతరం నరసరావుపేట బస్టాండ వైపు వెళ్తుండగా కళామందిర్ జంక్షన్ సమీపంలో ఎదురుగా వచ్చిన ఆటోరిక్షాను ఢీకొట్టింది. గంటకు సుమారు 40 కిలోమీటర్ల వేగంతో బస్సు ప్రయాణిస్తుండగా, ఆటో రాంగ్ రూట్‌లోకి వచ్చి బస్సు మార్గంలోకి వెళ్లడంతో ప్రమాదం జరిగిందని డిఎస్‌పి తెలిపారు. ఈ ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మృతి చెం దారు. తీవ్రంగా గాయపడిన మరో ముగ్గురు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మరో ఆరుగురు గాయపడ్డారు. నిర్లక్ష్యంగా లేదా అతివేగంగా వాహనం నడిపి మరణానికి కారణమైనందుకు అప్పటి భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్ 304 'ఎ' కింద పోలీసులు కేసు నమోదు చేశారు. మృతులు చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామానికి చెందినవారని అధికారులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి తెలిపారు. తీవ్రంగా గాయపడిన వారిని మెరుగైన చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గాయపడిన వారికి సాధ్యమైనంత మెరుగైన వైద్యం అందించాలని, వారి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఈ ప్రమాదంపై మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కూడా విచారం వ్యక్తం చేశారు. మృతులంతా ఒకే గ్రామానికి చెందినవారు కావడం ఘటనను మరింత బాధాకమని ఆయన పేర్కొన్నారు. గాయపడిన వారందరికీ తక్షణమే మెరుగైన వైద్యం అందించాలని అధికారులను కోరారు. ప్రమాదానికి దారితీసిన కారణాలపై సమగ్ర విచారణ జరిపించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రహదారి భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయాలని జగన్ అధికారులను కోరారు.

# నేపాల్ వరదల నేపథ్యంలో యుపిలో హై అలర్ట్

### నదులపై నిరంతర నిఘా.. సిద్ధంగా సహాయక బృందాలు

మహారాజ్‌గంజ్/కుషీనగర్ (ఉత్తరప్రదేశ్): పొరుగు దేశం నేపాల్‌లో సంభవించిన భారీ ఆకస్మిక వరదల నేపథ్యంలో ఉత్తరప్రదేశ్‌లోని మహారాజ్‌గంజ్, కుషీనగర్ జిల్లాల అధికారులు హై అలర్ట్ ప్రకటించారు. నేపాల్‌లోని వరదల కారణంగా ఇప్పటివరకు కనీసం 332 మంది మరణించగా, భారతీయ పర్యాటకులతో సహా వేలాది మంది గల్లంతయ్యారు. దీంతో నేపాల్ నుంచి దిగువకు ప్రవహించే గండక్ సహా పలు నదులు, జలవనరులపై అధికారులు నిఘా పెంచారు. నేపాల్‌తో ఉత్తర సరిహద్దును పంచుకునే ఉత్తరప్రదేశ్‌లో అధికారులు నదుల నీటిమట్టం, ప్రవాహాన్ని నిరంతరం పరిశీలిస్తున్నారు. నదీతీరాలు, లోతట్టు ప్రాంతాల్లోని గ్రామాలను అప్రమత్తం చేస్తున్నారు. అవసరమైతే సహాయక, రక్షణ చర్యలు వెంటనే చేపట్టేందుకు బృందాలను సిద్ధంగా ఉంచారు. నేపాల్—చైనా సరిహద్దు సమీపంలో మంచు, రాళ్ల కొండచరియలు నదీ ప్రవాహాన్ని అడ్డుకోవడంతో ఈ ఆకస్మిక వరదలు సంభవించాయని నేపాల్ విపత్తు నిర్వహణ అధికారులు తెలిపారు. వరదలు పలు జిల్లాలను తీవ్రంగా ప్రభావితం చేశాయి. దాదాపు 826 మంది గల్లంతయ్యారని అధికారులు వెల్లడించారు. గల్లంతైన వేలాది మందిలో సుమారు 300 మంది భారతీయ పర్యాటకులు ఉన్నారని నేపాల్ విదేశాంగ మంత్రి శిశిర్ ఖనాల్ తెలిపారు. వరదల ధాటికి వంతెనలు, రహదారులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పలు ప్రధాన జాతీయ రహదారులపై రాకపోకలు నిలిచిపోయాయి. మహారాజ్‌గంజ్ జిల్లాలో అదనపు జిల్లా మేజిస్ట్రేట్ ప్రశాంత్ కుమార్ సహా సీనియర్ అధికారులు ప్రమాదానికి గురయ్యే నదీతీర ప్రాంతాలలో పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు. గండక్, దర్జానియా, టైల్ ఫాల్ తదితర నదులు, నేపాల్ నుంచి నీరు వచ్చే కాలువల్లో నీటిమట్టం, ప్రవాహాన్ని వారు పరిశీలిస్తున్నారు. నీటిమట్టం అకస్మాత్తుగా పెరిగితే వెంటనే సహాయక, రక్షణ చర్యలు చేపట్టేందుకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. నదీతీర గ్రామాలు, లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక నిఘా పెట్టారు. అవసరమైతే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తున్నామని ప్రశాంత్ కుమార్ తెలిపారు. ప్రజలు అవసరం లేకుండా నదుల వద్దకు వెళ్లవద్దని, అధికారులు జారీ చేసే సూచనలు పాటించాలని, వదంతులను నమ్మవద్దని ఆయన కోరారు. పొరుగున ఉన్న కుషీనగర్ జిల్లాలోనూ గండక్ నది, స్థానికంగా నారాయణి అని పిలిచే ఈ నదిలో పెరుగుతున్న నీటిమట్టాన్ని అధికారులు నిశితంగా గమనిస్తున్నారు. జిల్లా మేజిస్ట్రేట్ మహేంద్ర సింగ్ తన్వర్, పోలీసు సూపరింటెండెంట్ కేశవ్ కుమార్‌తో కలిసి ప్రమాదకర నదీతీర గ్రామాలు, వాల్మీకినగర్ బ్యారేజీని పరిశీలించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నది, లోతట్టు ప్రాంతాలకు దూరంగా ఉండాలని సూచించారు. నదికి అవతలి వైపున ఇసుక ప్రాంతాల్లో నదికి సమీపంగా పెద్ద సంఖ్యలో ప్రజలు, పశువులు నివసిస్తున్న గ్రామాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. నీటిమట్టం వేగంగా పెరిగితే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. బిహార్‌లోని వాల్మీకినగర్ బ్యారేజీ వద్ద కూడా అధికారులు నిరంతర నిఘా కొనసాగిస్తున్నారు. బ్యారేజీలోని మొత్తం 36 గేట్లను తెరిచారు. రాత్రి 8 గంటలకు సుమారు 1.04 లక్షల క్యూసెక్కులుగా ఉన్న నీటి విడుదల 9.30 గంటలకు 1.36 లక్షల క్యూసెక్కులకు, రాత్రి 10 గంటలకు 1.42 లక్షల క్యూసెక్కులకు పెరిగిందని జిల్లా అధికారులు తెలిపారు.

# భారీ విధ్వంసం.. సరిపోని సాయం!

**న్యూఢిల్లీ :** నేపాల్‌లో భారీ వరదల అనంతరం సహాయక, రక్షణ చర్యలు కొనసాగుతున్నప్పటికీ విపత్తు తీవ్రత ప్రస్తుత ప్రభుత్వ ప్రతిస్పందనా సామర్థ్యాన్ని మించిపోయిందని వాతావరణ నిపుణులు, కార్యకర్తలు అంటున్నారు. తీవ్రంగా ప్రభావితమైన జిల్లాల్లో కుటుంబాలు ఆహారం, ఆశ్రయం, సహాయం కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని వారు పిటిఐకి చెప్పారు. నేపాల్‌లోని క్లైమేట్ రిస్క్ అండ్ రెసిలియన్స్ ల్యాబ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బినోద్ ప్రసాద్ పరాజులి మాట్లాడుతూ ప్రభుత్వం స్పందిస్తున్నప్పటికీ నష్టం, విధ్వంసం స్థాయి ప్రస్తుత వ్యవస్థల సామర్థ్యానికి మించిపోయిందన్నారు. ప్రాణాలను కాపాడటం ప్రభుత్వ తొలి ప్రాధాన్యమని తెలిపారు. వరదల్లో చిక్కుకున్నవారిని గుర్తించేందుకు ఖాట్మండూ నుంచి డ్రోన్ బృందాలను రంగంలోకి దించామని చెప్పారు. థర్మల్, ఆప్టికల్ కెమెరాలతో వారు గాలింపు చేపడుతున్నారని తెలిపారు. నష్టాన్ని వేగంగా అంచనా వేసేందుకు అధిక రిజల్యూషన్ ఉపగ్రహ చిత్రాల కోసం వాణిజ్య ఉపగ్రహ సంస్థలతో ప్రభుత్వం సమన్వయం చేస్తోందన్నారు. తొలి అంచనాల ప్రకారం రసువా, నువాకోట్, ధాదింగ్ జిల్లాల్లో కనీసం 1,976 భవనాలు పూర్తిగా దెబ్బతిన్నాయని, సుమారు 38 కిలోమీటర్ల రహదారులు పూర్తిగా ధ్వంసమయ్యాయని పరాజులి తెలిపారు. డ్రోన్లు, ఉపగ్రహ చిత్రాలు, రిమోట్ సెన్సింగ్ ఆధారంగా ఈ అంచనాలు రూపొందించామని, మరింత సమాచారం అందిన కొద్దీ సంఖ్యలు మారవచ్చని చెప్పారు. నేపాల్‌కు చెందిన వాతావరణ కార్యకర్త పెమా వాంగ్మో లామా మాట్లాడుతూ రసువాలో వరద బాధితులు ఎత్తైన ప్రాంతాల్లోని అడవుల్లో తలదాచుకుని రక్షణ కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. గురువారం ఉదయం హెలికాప్టర్ సుమారు 12—13 మందిని రక్షించిందన్నారు. ధాదింగ్‌లో రహదారి సంబంధాలు తెగిపోవడంతో ప్రజలు తమ వద్ద ఉన్న పరిమిత వనరులపైనే ఆధారపడుతున్నారని, రాబోయే రోజుల్లో తాగునీటి కొరత తీవ్రంగా మారే ప్రమాదం ఉందని చెప్పారు. నువాకోట్‌లో పరిస్థితి కొంత మెరుగ్గా ఉన్నప్పటికీ ప్రభుత్వ ఆశ్రయాల్లో బాధితులు సహాయం కోసం ఎదురుచూస్తున్నారని లామా తెలిపారు. జలవిద్యుత్ వ్యవస్థ దెబ్బతినడంతో విద్యుత్ కొరత ఏర్పడిందని, ఆసుపత్రులకు డీజిల్, జనరేటర్లు వంటి



అత్యవసర సాయం అవసరమని చెప్పారు. ఫోన్ బ్యాటరీలు అయిపోతుండటంతో కమ్యూనికేషన్ వ్యవస్థ కూడా దెబ్బతింటోందన్నారు. రహదారులు, రవాణా మార్గాలు దెబ్బతినడంతో రసువాకు చేరుకునే ప్రధాన మార్గం బిధుర్ మునిసిపాలిటీ వద్దనున్న త్రిశూలి నది మార్గమే మిగిలిందని లామా తెలిపారు. దాదాపు మొత్తం రక్షణ, సహాయక చర్యలను హెలికాప్టర్ల ద్వారా నిర్వహిస్తున్నారని చెప్పారు. వరదలకు అసలు కారణంపై విభిన్న, పరస్పర విరుద్ధమైన సమాచారం వస్తోందని ఆమె తెలిపారు. ఖచ్చితమైన సమాచారం లేకుండా ప్రజలను తరలించడం మరింత ప్రాణనష్టానికి దారితీయవచ్చని, ముం దుగా స్థానికులు, అధికారులతో సమర్థవంతమైన సమాచార వ్యవస్థ ఏర్పాటు చేయాలని సూచించారు. ఇదిలావుంటే, నేపాల్‌లో భారీ ఆకస్మిక వరదల మృతుల సంఖ్య కనీసం 162కు చేరినట్లు మీడియా కథనం పేర్కొంది. భద్రతా సిబ్బంది, విదేశీ పర్యాటకులు సహా పలువురు గల్లంతయ్యారు. బుధవారం సంభవించిన వరదలు మూడు జిల్లాల్లో భారీ విధ్వంసం సృష్టించాయి. కాఠ్మాండూ పోస్ట్ ప్రకారం, మంచు చరియలు భోటేకోషి నదికి చెందిన ల్హెండే ఉపనది ప్రవాహాన్ని అడ్డుకోవడంతో రసువాగఢి వద్ద చైనా సరిహద్దుకు సమీపంలోని టిమురే ప్రాంతాన్ని వరద తొలుత ముంచెత్తింది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com